


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 205 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : విశాఖపట్నం మంగళవారం 1 ఏప్రిల్ 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 205 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : VISAKHAPATNAM TUE 1 APRIL 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Visakhapatnam, Kakinada, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Prakasam,Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur





## తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా రంజాన్ వేడుకలు

హైదరాబాద్ పెన్ పవర్: రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.. నెల రోజుల రంజాన్ ఉపవాసాలు సోమవారం ముగియడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు పలు రాష్ట్రాల్లో ముస్లింలు 'రంజాన్' పండగను ఘనంగా చేసుకున్నారు. పలు చోట్ల నాయకులు హాజరై ప్రార్థనలు చేశారు. రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. చార్మినార్, మక్కా మసీదు, మీరాలం ఈద్గాతోపాటు రాష్ట్రంలోని మసీదులు, దర్గాల్లో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. దీంతో అధ్యాత్మిక వాతావరణం వెల్లవిరిసింది. ఈ సందర్భంగా మసీదుల వద్దకు వెళ్లి ప్రార్థనలు చేశారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

## ఇదేనా సనాతన ధర్మం?... దేవుడు అన్నీ గమనిస్తున్నాడు

- తిరుమల శ్రీవారికి నిద్ర కరవు అంటూ ఓ పత్రికలో కథనం
- సామాన్య భక్తులకు దర్శనాలు తగ్గించి... బ్రేక్ దర్శనాలు పెంచారన్న రోజా
- సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చి డబ్బున్న వారికే అవకాశం కల్పిస్తున్నారని విమర్శలు



పెన్ పవర్ డెస్క్:కూటమి ప్రభుత్వంపై మాజీ మంత్రి రోజా మరోసారి ధ్వజమెత్తారు. కూట మి ప్రభుత్వంలో మనుషులకే కాదు... చివరికి ఆ దేవదేవుడికి కూడా నిద్ర లేకుండా పోతోందని పేర్కొన్నారు. జగనన్న పాలనలో తిరుమలలో రోజుకు లక్ష మందికి పైగా భక్తులకు దర్శన భాగ్యం ఉండేదని, కానీ ఇప్పుడు స్వామికి నిద్ర లేకుండా చేస్తూ, భక్తుల సంఖ్యను తగ్గిస్తున్నారని విమర్శించారు. దర్శనాల సంఖ్యను 60 వేల వరకు పరిమితం చేస్తూ... రోజుకు 7 వేల నుంచి 10 వేల బ్రేక్ దర్శనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారంటూ టీటీడీని తప్పుబట్టారు. దీంతో సామాన్య భక్తులకు స్వామి దర్శనం మరింత దూరమవుతోందని రోజా ఆవేదన వ్యక్తం చేశారు. సిఫారసు లేఖలకు ప్రాధాన్యత ఇచ్చి, డబ్బు ఉన్న వారికే దర్శన అవకాశం కల్పిస్తున్నారని... ఇదేనా కూటమి, పవన్ కల్యాణ్, బీజేపీ సనాతన ధర్మం? ఇదేనా చంద్రబాబు గారి నమూనా ప్రక్షాళన? అంటూ మండిపడ్డారు. భగవంతుడు అన్నీ గమనిస్తున్నాడు అంటూ రోజా ట్వీట్ చేశారు. 'ఏడుకొండల స్వామికి కునుకు కరవు' అంటూ ఓ పత్రికలో వచ్చిన కథనాన్ని కూడా రోజా పంచుకున్నారు.

## రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయి

- చంద్రబాబు ఎంత సంపద సృష్టించారో చెప్పాలన్న అంబటి
- పీ4 పేరుతో అందరినీ ఏప్రిల్ ఫూల్ చేశారని వ్యాఖ్య
- రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కుటుంబాలే బంగారు కుటుంబాలని విమర్శ



పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుపై వైసీపీ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మరోసారి విమర్శలు గుప్పించారు. సంపద సృష్టిస్తామని చంద్రబాబు చెప్పారని... ఈ తొమ్మిది నెలల పాలనలో ఎంత సంపద సృష్టించారో చెప్పాలని అన్నారు. వైసీపీ ప్రభుత్వ పాలనలోని పథకాలకు కూడా పాతర వేశారని మండిపడ్డారు. పీ4 పేరుతో

వివరాలు 2లో..

## ఈసారి కడపలో మహానాడు... మే నెలలో టీడీపీ పండుగ

- ఉత్తమ కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్
- కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని హామీ
- భిన్నాభిప్రాయాలు ఉన్నా అందరూ కలసికట్టుగా ముందుకుసాగాలని సూచన
- జూన్ నుంచి పార్టీ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపు
- 3సార్లు ఉత్తమ కార్యకర్త అవార్డు అందుకున్న ఆదిరెడ్డికి ప్రత్యేక అభినందన




పెన్ పవర్ డెస్క్:యలమంచిలి నియోజకవర్గం అచ్యుతాపురం లో జరిగిన ఉత్తమ కార్యకర్తల సమావేశంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యద ర్శి, రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలపై జూన్ నుంచి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించా లని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పెన్షన్లు, అన్నక్యాంటీన్, స్టీల్ సిటీ, ఎన్టీపీసీ, బల్క్ డ్రగ్ పార్కు వంటి విజయగాథలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. చేసిన పనులు చెప్పుకోకపోతే ప్రత్యర్థులు చెప్పే అబద్ధాలు జనంలోకి వెళతాయని, ఈ విషయంలో పార్టీ కేడర్ అప్రమత్తంగా వ్యవహరించాలని తెలిపారు. మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... ఇటీవల నేను డిల్లీలో ఒక ఫంక్షన్ కు వెళ్లాను. అక్కడ మన సభ్యత్వం గురించే చర్చ జరుగుతోంది. మేం 5 లక్షలు కూడా చేయలేకపోతున్నాం, మీరు కోటి సభ్యత్వాలు ఎలా చేశారని అడిగారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు హయాం నుంచి సభ్యత్వం మనకు ఒక ఎమోషన్. యలమంచిలి నియోజకవర్గంలో 41 వేల సభ్యత్వాలు నమోదు చేసినందుకు అభినందనలు. యువగళం పాదయాత్రలో కష్టపడిన కార్యకర్తలను గుర్తించాలని ఇక్కడ కార్యకర్తలు నాకు చెప్పారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారంటీ, సోషల్ మీడియా, సభ్యత్వ నమోదులో మెరుగైన పనితీరు కనబర్చిన వారి వివరాలను ఆన్ లైన్ లో పెట్టా. ఎవరు పనిచేస్తున్నారో తెలుసుకునేందుకు ఈ విధానం అమలుచేస్తున్నాం. టీడీపీలో కష్టపడిన కార్యకర్తలకే నామినేటెడ్

వివరాలు 2లో..

## ఎయిర్ అంబులెన్సులో హుటాహుటిన కొడాలి నాని ముంబైకి తరలింపు... వెంట ముగ్గురు వైద్యులు

- ఈ నెల 26న గుండెపోటుకు గురైన కొడాలి నాని
- కొడాలి నానికి మూసుకుపోయిన మూడు వాల్వ్స్
- క్రిటికల్ సర్జరీ చేయాలన్న ఏఐజీ ఆసుపత్రి వైద్యులు



పెన్ పవర్ డెస్క్:వైసీపీ నేత, మాజీ మంత్రి కొడాలి నాని ఆరోగ్య పరిస్థితి కొంత విషమంగానే ఉన్నట్టు ప్రస్తుత పరిస్థితులను చూస్తుంటే అర్థమవుతుంది. ఈ నెల 26న కొడాలి నాని హైదరాబాద్ లోని నివాసంలో గుండెపోటుకు గురయ్యారు. కుటుంబ సభ్యులు ఆయనను హుటాహుటిన

వివరాలు 2లో..

## హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ ఛార్జీలు పెంపు




- నేటి నుంచి అమల్లోకి రానున్న పెరిగిన ఛార్జీలు
- కిలోమీటరుకు 10 పైసల నుంచి 70 పైసల వరకు పెంపు
- ఓఆర్ఆర్‌పై టోల్ వసూలు చేస్తోన్న ఐఆర్బీ ఇన్ఫ్రా

పెన్ పవర్ డెస్క్:హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ ఛార్జీలు పెరగనున్నాయి. వివిధ వాహనాలకు కిలోమీట రుకు 10 పైసల నుంచి 70 పైసల వరకు ఛార్జీలు పెరిగాయి.

వివరాలు 2లో..

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్, జగన్



- రంజాన్ పర్వదినం
- భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకను నిర్వహించుకుంటున్న ముస్లిం సోదరులు
- ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపిన నేతలు

పెన్ పవర్ డెస్క్: రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు ప్రజాప్రతినిధులు, నేతలు శుభాకాంక్షలు తెలుపుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి 'ఎక్స్' వేదికగా ముస్లిం సోదరులకు

వివరాలు 2లో..

## ప్రధాని మోదీకి ప్రైవేట్ కార్యదర్శిగా నిధి తివారీ

- 2014 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి నిధి తివారీ
- సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు
- ప్రస్తుతం పీఎంఓలో డిప్యూటీ సెక్రటరీగా విధులు



పెన్ పవర్ డెస్క్: ప్రధాని నరేంద్ర మోదీకి ప్రైవేట్ కార్యదర్శిగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి నిధి తివారీని నియమిస్తూ సిబ్బంది మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. 2014 బ్యాచ్ ఐఎఫ్ఎస్ అధికారి

వివరాలు 2లో..

## రోజా విమర్శలకు కౌంటర్ ఇచ్చిన మంత్రి వాసంశెట్టి సుభాష్

- తిరుమలలో డబ్బున్న వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారన్న రోజా
- గతంలో సిఫారసు లేఖపై 100 మందికి దర్శనం చేయించిన ఘనత మీదే అంటూ వాసంశెట్టి రిప్లయ్
- మీరు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శలు



పెన్ పవర్ డెస్క్:తిరుమలలో సామాన్య భక్తుల దర్శనాలను తగ్గించి బ్రేక్ దర్శనాల సంఖ్యను పెంచారని, ఇదేనా సనాతన ధర్మం? అంటూ మాజీ మంత్రి, వైసీపీ నేత రోజా విమర్శనాస్త్రాలు సంధించిన సంగతి తెలిసిందే. డబ్బున్న వాళ్లకే ప్రాధాన్యత ఇస్తున్నారంటూ

వివరాలు 2లో..

## ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లు రద్దు చేయండి ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ లేఖ



- ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లపై రాహుల్ స్పందన
- సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందని ఆందోళన
- పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా అనుమతులు ఎలా ఇస్తారని విమర్శలు

పెన్ పవర్ డెస్క్: కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల సముద్ర తీరాల్లో (ఆఫ్ షోర్ మైనింగ్) తవ్వకాలకు అనుమతిస్తూ జారీ చేసిన టెండర్లను రద్దు చేయాలని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాశారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు వాటిల్లుతుందని ఆయన ఆందోళన

వివరాలు 2లో..

## సీఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం..



- చంద్రబాబును ప్రశంసిస్తూ ఆనంద్ మహీంద్రా సోషల్ మీడియా పోస్ట్
- అరకు కాఫీ కేఫ్‌లు విస్తరిస్తున్న తీరును చూసి చంద్రబాబు సంతోషిస్తారని వ్యాఖ్య
- పారిస్‌లో అరకు కాఫీ స్టాల్ పై కూడా వ్యాపారవేత్త ట్వీట్

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై ప్ర ముఖ వ్యాపారవేత్త ఆనంద్ మహీంద్రా ప్రశంసల జల్లు కురిపించారు. ఆయన ఆలోచనలు అద్భు తంగా ఉంటాయని సోషల్ మీడియా వేదికగా పోస్ట్ చేశారు.

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం

ఆర్ఎస్ఎస్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్. ఇప్పుడు తెలంగాణలో విస్తరించడమే టార్గెట్ గా పెట్టుకుంది. ప్రతి గ్రామంలో శాఖ ఉండేలా ప్లాన్ చేస్తున్నారు. సంఘ్ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సరికొత్త లక్ష్యాలను నిర్దేశించుకున్నారు. ఇటీవలే బెంగళూరులో జరిగిన అఖిల భారతీయ ప్రతినిధి సభలో కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఏం చేయబోతున్నారు? ఎలా విస్తరణకు ప్లాన్ చేశారన్నది ఇంట్రెస్టింగ్ గా మారింది. 1925 సెప్టెంబర్ 27న నాగ్ పూర్ లో ఏర్పాటైంది. ఈ సెప్టెంబర్ 27 వస్తే వందేళ్లు. అంటే శతాబ్ది ఉత్సవాలు ఓ రేంజ్ లో ఉండేలా ప్లాన్ ప్రిపేర్ చేసింది. అంతే కాదు.. విస్తరణ కూడా ఎవరూ ఊహించని వేగంతో చేయాలనుకుంటోంది. కశ్మీర్ నుంచి కన్యాకుమారి దాకా ఈ మాస్టర్ ప్లాన్ అమలు చేయబోతోంది. ఇప్పుడు రాబోయే విజయదశమి రోజున చరిత్ర తిరగరాయాలని ఆర్ఎస్ఎస్ అనుకుంటోంది. తమిళనాడు మొదలుకుని కశ్మీర్ దాకా పథసంచలన్, శోభాయాత్రలు, ఘోష్ ఇవన్నీ చేయబోతున్నారు. ఈ ఏడాది దసరా నుంచి 2026 దసరా మధ్యలో శతాబ్ది వేడుకల కోసం సంఘ్ వేసుకున్న ప్లాన్ ఓ రేంజ్‌లో ఉంది. 1925లో సంఘ్ ప్రారంభమైనప్పటి నుంచీ చాలా సమస్యలు, సవాళ్లను ఎదుర్కొంది. దేశవ్యాప్తంగా మొత్తం 51,570 స్థలాల్లో ఖీూా రోజువారీ శాఖలు 83,129 నడిచేదాకా వెళ్లాయి. నాలుగైదేళ్లుగా శాఖలు, పాల్గొంటున్నవారి సంఖ్య దేశవ్యాప్తంగా పెరిగినట్లు సంఘ్ అంటోంది. గతేడాదితో పోల్చితే 10 వేలకు పైగా కొత్త శాఖలు ప్రారంభమయ్యాయన్నారు తెలంగాణ ప్రాంత కార్యదర్శి కాచం రమేశ్. వీటితో పాటు 32,147 వీక్లీ శాఖలు, 12,091 నెలవారీ శాఖలు నడుస్తున్నాయని, మొత్తంగా అన్నీ కలిపి 1,27,367 శాఖాపరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. గ్రామీణ లేదా పట్టణ ప్రాంతాలలో 10 వేల జనాభా ఉన్న ప్రాంతాన్ని ఒక యూనిట్‌గా పరిగణిస్తారు. ఆ లెక్కన శాఖలకు ప్లాన్ చేస్తున్నారు. వీటితో పాటే స్లమ్స్‌లో సేవాబస్తీల పేరిట సంఘ్ విస్తరణ ప్రయత్నం చేసుకుంటున్నారు. అంటే హిందూ సొసైటీలో ఏ వర్గాన్ని కూడా పక్కన పెట్టకుండా అందరినీ కవర్ చేసే ప్రయత్నం చేస్తున్నారు. గతేడాది తెలంగాణలో విజయదశమి వేడుకల సందర్భంగా 161 ప్రదేశాలలో జరిగిన రూట్ మార్చ్‌లలో 50 వేల మందికి పైగా స్వయంసేవకులు పాల్గొన్నారు. ఇందులో 28 వేల మందికి పైగా స్వయం సేవక్స్ సంఘ యూనిఫామ్‌లో పాల్గొన్నారని తెలంగాణ ఆర్ఎస్ఎస్ శాఖ అంటోంది. ఈ సెప్టెంబర్ వస్తే ఆర్ఎస్ఎస్ ఏర్పడి వందేళ్లు అవుతుంది. మరి ఈ వందేళ్లలో సంఘ్ ఏం చేసింది? నేడు దేశంలో 1 కోటి మందికి పైగా స్వయంసేవకులు ఉన్నారని చెబుతున్న సంఘ్ పెద్దలు ఎలాంటి ఫ్యూచర్ టార్గెట్స్ పెట్టుకున్నారు. ప్రస్తుతం దేశంలో ఉన్న సామాజిక సమస్యలపై సంఘ్ ప్లాన్స్ ఎలా ఉన్నాయి? తమ అనుబంధ సంస్థలకు పొలిటికల్ ప్లాట్ ఫామ్ గా ఆరెస్సెస్ శాఖలు ఉపయోగపడుతున్నాయా రాజకీయ పార్టీలతో పోలిస్తే ఆర్ఎస్ఎస్ ప్రణాళిక భిన్నంగా ఉంటుంది. హిందుత్వ భావజాల విస్తరణే ప్రధాన లక్ష్యం అయినా సామాజిక అంశాలపై స్పందించడం ద్వారా ప్రజల్లోకి వెళ్లడం సంఘ్ స్పెషాలిటీ. ఈ విషయంలో మరింత పదును పెట్టడం ద్వారా తెలంగాణ పల్లెల్లో జెండా ఎగరేయాలనేది ఆర్ఎస్ఎస్ తాజా ఆలోచన. కేవలం సంఘ్ భావజాల వ్యాప్తే కాదు.. ఇంకొన్ని లక్ష్యాలు కూడా ఇప్పటికే వారు పెట్టుకున్నారు. సామాజిక అంశాలైన ప్లాస్టిక్ వినియోగం తగ్గించడం, మొక్కల పెంపకం, జల సంరక్షణ కార్యక్రమాలు చేపట్టడం, కులాల మధ్య అంతరాల వల్ల హిందుత్వ భావజాలానికి ఇబ్బందిగా మారిందన్న ఉద్దేశంతో ఈ విషయంలో కూడా ఫోకస్ పెంచుతున్నారు. అంతే కాదు.. గ్రామ వికాస కార్యక్రమాల పేరుతో మద్యపానం తగ్గించడం, అక్షరాస్యత పెంపు, మహిళలను గౌరవించడం, వారికి ఆపద వస్తే రక్షణగా నిలబడడం, వలసల నివారణ, సేంద్రియ వ్యవసాయం, గోసంపద వృద్ధి, కుటుంబాల్లో మనస్పర్ధలు తగ్గించేలా, వృద్ధులను ఆదరించేలా, పాశ్చాత్య సంస్కృతిపై ఆకర్షణ తగ్గించేలా చేయడం, సోషల్ మీడియా అనర్థాలపైనా కార్యక్రమాల నిర్వహణ ప్రధాన లక్ష్యంగా ఉంది. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా 5 అంశాలపై యూత్ కు ట్రైనింగ్ ఇవ్వాలనుకుంటున్నారు. అందులో సామాజిక సామరస్యం, కుటుంబం, పూర్వీకులు కుల దేవత గురించి స్మరించుకోవడం, పర్యావరణ పరిరక్షణ, మాతృభాషలో మాట్లాడటం, భారతీయ సాంప్రదాయ దుస్తులు వేసుకోవడం, సంస్కృతిని కాపాడడం, ప్రజల బాధ్యతల గురించి తెలిపేలా శిక్షణ ఉండబోతోంది. సంఘ్ వందేళ్ల ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఖీూా ఆలోచనలు, భావాలను సమాజం వద్దకు తీసుకెళ్లేలా వచ్చే నవంబర్–డిసెంబర్–జనవరి నెలల్లో దేశంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి వెళ్లడానికి జన సంపర్క అభియాన్ కార్యక్రమం జరగబోతోంది. ఇందులో హిందూ సంస్థలకు భాగస్వామ్యం కల్పించి హిందుత్వాన్ని, ధర్మాన్ని సమాజంలోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తామంటున్నారు సంఘ్ పెద్దలు. గతేడాది సర్ సంఘచాలక్ మోహన్ భగవత్.. సంఘ్ కార్యకలాపాల విస్తరణ, ఏకీకరణ కోసం 2 ఏళ్లు కేటాయించే కార్యకర్తలను ఆహ్వానించారు. ఈ పిలుపుతో 2,453 మంది స్వయంసేవకులు తమ ఇళ్లు వదిలి పూర్తిస్థాయి సంఘ్ కార్యకలాపాల్లో పాల్గొన్నారు. అటు సంఘ్ కార్యకలాపాల్లో చేరే యువకుల సంఖ్య పెరుగుతోంది. ప్రతి ఏడాది, లక్షలాది మంది యూత్, ముఖ్యంగా 14–25 ఏళ్ల మధ్య వయసున్న వారే సంఘ్ లో చేరుతున్నారంటున్నారు. ఆర్ఎస్ఎస్ అంటే సామాజిక సేవలో ముందుంటుందన్న అభిప్రాయం ఉంది. వరదలు వచ్చినా, భూకంపాలు వచ్చినా, కొండ చరియలు విరిగిపడ్డా.. సమస్య ఏదైనా విపత్తుల్లో సహాయాలు చేస్తూ స్వయం సేవకులు కనిపిస్తుంటారు. ఇలాంటి సేవా కార్యక్రమాల పట్ల యువతలో ఆసక్తి పెంచేలా కార్యక్రమాలు నిర్వహించబోతున్నారు. సమాజానికి సేవ అన్నది ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో ప్రధాన అంశం. ఇటీవల కుంభమేళలోనూ వచ్చిన వారికి కంటి పరీక్షలు చేయించడం, పర్యవరణ పరిరక్షణ కోసం ఏక్ థైలా ? ఏక్ థాలి ప్రచారం చేసింది సంఘ్. ప్లాస్టిక్ ప్లేట్లు, పాలిథిన్ బ్యాగుల వాడకం తగ్గించడానికి ప్రయత్నించింది. ఇవే కాదు.. సౌత్ నార్త్ విషయాలపైనా సంఘ్ రియాక్ట్ అయింది. ఇది రాజకీయంగా ప్రేరేపితమైన విషయమన్నది. అలాగే మాతృభాష విషయంలోనూ స్పష్టత ఇచ్చింది. మాతృ భాషను విద్యలోనే కాకుండా మన దైనందిన జీవితంలోని అన్ని అంశాలలో ఉపయోగించాలన్నది ఆర్ఎస్ఎస్ మాట. మాతృ భాషపై ఆర్ఎస్ఎస్ ఒక తీర్మానాన్ని కూడా ఆమోదించింది. బహుళ భాషలు నేర్చుకుంటే ఉపయోగమని, కెరీర్ లాంగ్వేజ్ ఇంగ్లీష్ అని నేర్చుకుంటే తప్పులేదన్నది. సో సంఘ్ మ్యాటర్ ఖుల్లం ఖుల్లాగా ఉంది.

# ఈసారి కడపలో మహానాడు...
# మే నెలలో టీడీపీ పండుగ

- మొదటి పేజీ తరువాయి

పదవులు ఇ స్తాం. ఈ విషయంలో క్లారిటీతో ఉన్నాం. కష్టపడి పార్టీకోసం పనిచేయండి. ప్రస్తుత మన ప్రభుత్వం ఐదేళ్లు ఉంటుంది. తొలిసారి అవకాశం రాకపోయినా మూడు విడతల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తాం. అధైర్యపడవద్దు అని లోకేశ్ చెప్పారు.

అలకలు మాని పార్టీ కోసం పనిచేయండి...

మే తర్వాత కేడర్ అంతా ప్రజల్లోకి వెళ్లాలి. మే నెలలో కడపలో మహానాడు నిర్వహించబోతున్నాం. ఈలోగా కుటుంబ సాధికార సమితులు, బూత్, క్లస్టర్ కమిటీలు, అనుబంధ సంఘాలు, జిల్లా కమిటీల నియమకాన్ని పూర్తి చేస్తాం. మహానాడులో జాతీయ అధ్యక్షుడి ఎన్నిక తర్వాత రాష్ట్ర కమిటీ నియమాకం చేపడతాం. పార్టీ కేడర్ అంతా ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రజల్లోకి వెళ్లాలి. జగన్ పై కంటే పార్టీ కార్యకర్తల కోసమే నేను ఎక్కువగా పోరాడుతుంటాను. సమస్యలపై నిర్ణయం తీసుకునే వరకు అందరం కూర్చుని చర్చిద్దాం. ఒకసారి నిర్ణయం తీసుకున్నాక అందరం కలిసి పనిచేయాల్సిందే. అలకలుమాని నమ్ముకున్న సిద్ధాంతం కోసం ప్రతి కార్యకర్త పనిచేయాలి.

**ఇకపై నిరంతరం యువరక్తం ఎక్కిస్తాం...**

ఇకపై పార్టీలో నిరంతరం యువరక్తం నింపాలని నిర్ణయించాం. యువత రాజకీయాల్లోకి రావాలి. ఏ నాయకుడు కూడా ఒకే పదవిలో మూడుసార్లకు మించి ఉండకూడదని ప్రతిపాదిస్తున్నాం. గ్రామస్థాయి అధ్యక్షుడికి కూడా పొలిట్ బ్యూరోలో స్థానం లభించే పరిస్థితి రావాలి. పార్టీలో కరడుగట్టిన కార్యకర్తలంతా అయిదేళ్లు నరకం అనుభవించారు. ఎన్నో కేసులుపెట్టి హింసించారు. హోంమంత్రి అనితపై కూడా 23 కేసులు ఉన్నాయి. పాదయాత్ర సమయంలో పోలీసులు నాకు సెక్యూరిటీ అడిగితే ఇవ్వలేదు. ఇప్పుడు వద్దంటే వస్తున్నారు. రామతీర్థం వెళ్లడానికి బాబు గారు విశాఖ ఎయిర్ పోర్టుకు వస్తే రోడ్డుకు అడ్డుగా పొక్లయినర్లు పెట్టారు. పాదయాత్ర సమయంలో నా స్టూల్, మైక్ లాక్కున్నారు. ఈరోజు టైం బాగుంది కదా అని గతాన్ని మర్చిపోవద్దు. కుటుంబంలో మాదిరి పార్టీలో కూడా భిన్నాభిప్రాయాలు ఉంటాయి. పరిష్కరించుకొని ముందుకు సాగాలి.

**ఓర్పు, సహనంతో ప్రజల్లోకి వెళ్లండి...**

తెలుగుదేశం పార్టీలో కార్యకర్తే ఫస్ట్. కేడర్ కార్యాలయాలకు వెళ్లి చట్టపరంగా పరిష్కరించరించగలిగిన సమస్యలను స్థానికంగా పరిష్కరించేందుకు చొరవచూపాలి. మే నెల నుంచి ప్రతిరోజూ 300 మందికి చొప్పున పార్టీ కేడర్ కు శిక్షణా కార్యక్రమాలు నిర్వహిస్తాం. గ్రామ, మండల, నియోజకవర్గ స్థాయిలో సమస్యలను ఎక్కడికక్కడే పరిష్కరించుకోవాలి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 10 నెలలు అయింది. మరో రెండు నెలల్లో మహానాడు నిర్వహించుకోబోతున్నాం. ఇతర పార్టీ ఎమ్మెల్యే ఉన్నచోట సమన్వయ లోపం కారణంగా సమస్యలు వస్తున్నాయి. ఎమ్మెల్యే లేనిచోట అక్కడ ఇన్ చార్జి ప్రతి వారం కూర్చుని మాట్లాడుకోవాలి. చట్టపరిధిలోని పనుల కోసం కార్యకర్తలు కార్యాలయాలకు వెళితే పనులు చేయాల్సిందే. ఓర్పు, సహనంతో ప్రజల్లోకి వెళ్లాలి అని మంత్రి లోకేశ్ కార్యకర్తలను కోరారు. ఈ సందర్భంగా ఉత్తమ కార్యకర్తలను మంత్రి అభినందించారు. సభ్యత్వం, మన టీడీపీ, భవిష్యత్తుకు గ్యారంటీ వంటి అంశాల్లో అవార్డు అందుకున్న ధర్మాల ఆదిరెడ్డి అనే కార్యకర్తను ప్రత్యేకంగా అభినందించారు.

**తప్పుడు కేసుల ఎత్తివేతకు చర్యలు తీసుకుంటాం...**

ఈ సమావేశంలో పలు సమస్యలను కార్యకర్తలు మంత్రి లోకేశ్ దృష్టికి తెచ్చారు. వైసీపీ సర్పంచ్ లతో పాటు 10 శాతం వైసీపీ వారు కూడా టీడీపీ సభ్యత్వ కార్డులు తీసుకున్నారని తెలిపారు. అచ్యుతాపురం సెజ్ కు సంబంధించి ఆర్ అండ్ ఆర్ లో ఇంకా 200 మందికి స్థలాలు ఇవ్వలేదని, ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ నిర్మించాలని విన్నవించారు. ఉపాధి హామీ, నీరు–చెట్టు బిల్లులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తివేయాలని కోరారు. ఉపాధి హామీ, నీరు–చెట్టు బిల్లులు, తప్పుడు కేసులకు సంబంధించి పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్రత్యేక విభాగాన్ని సంప్రదించాలని మంత్రి లోకేశ్ కార్యకర్తలను సూచించారు. ఈ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ దామచర్ల సత్య, యలమంచిలి నియోజకవర్గ టీడీపీ ఇన్ చార్జి ప్రగడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయి

- మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర ప్రజలందరినీ చంద్రబాబు ఏప్రిల్ ఫూల్ చేశారని చెప్పారు. పేదలను మరింత పేదలుగా చేస్తున్నారని విమర్శించారు.

మెడికల్ సీట్లను డబ్బున్నోళ్లకు ఇస్తున్నారని దుయ్యబట్టారు. వైద్య కళాశాలలు, గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లు, పోర్టులను ప్రైవేటు పరం చేస్తున్నారని ఆరోపించారు. గత టీడీపీ ప్రభుత్వంలో 58 కార్పొరేషన్లను ప్రైవేటు పరం చేసిన ఘనత చంద్రబాబుదని చెప్పారు. పీ4 పేరుతో డబ్బులు ఉన్నవాళ్లని, బడా బాబుల్ని వేదికపై కూర్చోబెడుతున్నారని అన్నారు. గతంలో జన్మభూమి, శ్రమదానం అని ప్రచారం చేసుకున్న చంద్రబాబు... ఇప్పుడు పీ4 పేరుతో ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో రెండే రెండు బంగారు కుటుంబాలు ఉన్నాయని... ఒకటి చంద్రబాబుది, మరొకటి పవన్ కల్యాణ్ దని అంబటి దుయ్యబట్టారు. పుట్టినప్పటి నుంచి చంద్రబాబు చేసినవన్నీ తప్పులేనని అన్నారు. ఎన్టీఆర్ దగ్గర పని చేసి... ఆయన పని పూర్తి చేశారని విమర్శించారు. లోకేశ్ లాంటి అసమర్థుడిని ప్రజలపై రుద్దాలని ప్రయత్నిస్తున్నారని ఎద్దేవా చేశారు. లోకేశ్ డబ్బులు వసూలు చేసి పవన్ కు ప్యాకేజ్ ఇస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లాయని... ప్రభుత్వంపై ప్రజలు తిరగబడే రోజు దగ్గరపడిందని చెప్పారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన చంద్రబాబు, పవన్, జగన్

- మొదటి పేజీ తరువాయి

రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

నెల రోజులపాటు కఠిన ఉపవాస దీక్షలు, ఖురాన్ పఠనం, ప్రార్థనలతో రంజాన్ మాసం ముగిసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. జకాత్ పేరుతో సాటి వారిని ఆదుకునే దయాగుణం ముస్లిం వర్గంలోని మానవత్వానికి ప్రతిరూపమని ఆయన పేర్కొన్నారు. పేద కుటుంబాల సముద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలు అల్లా దయ వల్ల విజయవంతం కావాలని చంద్రబాబు ఆకాంక్షిస్తూ అందరికీ పవిత్ర రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఇస్లాంపై విశ్వాసం ఉన్న ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక రంజాన్ శుభాకాంక్షలు అంటూ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ఖురాన్ అవతరించిన పవిత్ర మాసం ఇది అని ఆయన అన్నారు. భక్తిశ్రద్ధలతో కఠినమైన ఉపవాస దీక్షలు ముగించుకుని ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన రంజాన్ పండుగను జరుపుకుంటున్న ముస్లిం సోదర సోదరీమణులందరికీ శుభాకాంక్షలు అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. అల్లా చూపిన మార్గంలో నడవాలని, అల్లా చల్లని దీవెనలు అందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు.

## ఎయిర్ అంబులెన్సులో హుటాహుటిన కొడాలి నాని ముంబైకి తరలింపు... వెంట ముగ్గురు వైద్యులు

- మొదటి పేజీ తరువాయి

గచ్చిబౌలిలోని ఏఐజీ ఆసుపత్రికి తరలించారు. అప్పటి నుంచి నాని ఏఐజీ ఆసుపత్రిలోనే చికిత్స పొందుతున్నారు.

నానికి మూడు వాల్వ్ మూసుకుపోయాయని కాసేపటి క్రితం వైద్యులు హెల్త్ బులెటిన్ ద్వారా వెల్లడించారు. క్రిటికల్ సర్జరీ చేయాలని ఆయన కుటుంబ సభ్యులకు వైద్యులు సూచించారు. దీంతో, ఆయనను ముంబైలోని ఏషియన్ హార్ట్ ఇన్స్టిట్యూట్ కు తరలించాలని కుటుంబ సభ్యులు నిర్ణయించారు. ఈ క్రమంలో, సమయం వృథా చేయకుండా ఆయనను హుటాహుటిన ముంబైకి తరలిస్తున్నారు. హైదరాబాద్ నుంచి ఎయిర్ అంబులెన్స్ ద్వారా కొడాలి నానిని లిఫ్ట్ చేశారు. ఆయనతో పాటు ఎయిర్ అంబులెన్స్ లో ఏఐజీ ఆసుపత్రికి చెందిన ముగ్గురు వైద్యులు కూడా బయల్దేరారు. కొడాలి నాని ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిపై ఆయన అనుచరులు, వైసీపీ అభిమానులు ఆందోళన చెందుతున్నారు. నానికి బైపాస్ సర్జరీ నిర్వహించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

## ఆఫ్ షోర్ మైనింగ్ టెండర్లు రద్దు చేయండి

- మొదటి పేజీ తరువాయి

వ్యక్తం చేశారు. ప్రభావాలను క్షుణ్ణంగా అంచనా వేయకుండా ప్రైవేట్ సంస్థలకు సముద్ర గనుల తవ్వకాల కేటాయింపులు చేయడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. "కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ తీరాల్లో సముద్ర గనుల తవ్వకాలకు కేంద్ర ప్రభుత్వం అనుమతించిన నిర్ణయాన్ని నేను తీవ్రంగా ఖండిస్తున్నాను" అని ప్రధాన మంత్రికి రాసిన లేఖలో ఆయన పేర్కొన్నారు. పర్యావరణ ప్రభావాలను అంచనా వేయకుండా సముద్ర గనుల తవ్వకాల టెండర్లను జారీ చేసిన విధానానికి వ్యతిరేకంగా తీర ప్రాంత ప్రజలు నిరసన తెలుపుతున్నారని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. దీనివల్ల తమ జీవనోపాధి, జీవన విధానంపై ప్రభావం చూపుతుందని లక్షలాది మంది మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారని వివరించారు. 2023లో సవరించిన ఆఫ్ షోర్ ఏరియాస్ మినరల్ (డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) చట్టంపై తీవ్ర అభ్యంతరాలు ఎదుర్కొన్నాయని రాహుల్ గాంధీ తెలిపారు. ఆఫ్ షోర్ మైనింగ్ వల్ల సముద్ర జీవులకు ముప్పు, పగడపు దిబ్బలకు నష్టం మరియు చేపల నిల్వలు తగ్గిపోవడం వంటి ప్రతికూల ప్రభావాలు కలుగుతాయని అనేక అధ్యయనాలు సూచిస్తున్నాయని పేర్కొన్నారు.

## సీఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం..

- మొదటి పేజీ తరువాయి

అరకు కేఫ్‌లు విస్తరిస్తున్న తీరును చూసి ఆయన సంతోషిస్తారని పేర్కొన్నారు. పారిస్ కేఫ్‌ల్లోని ఎలక్ట్రానిక్ స్క్రీన్లపై అరకులోని గిరిజనుల జీవనశైలికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇక్కడి కాఫీ ప్యాకేజింగ్‌ను గిరిజనుల వేషధారణ, ఇండియాలోని వైవిధ్యమైన రంగుల స్ఫూర్తితో రూపొందించినట్లు పేర్కొన్నారు. ఇక ఈ నెల 29న కూడా ఆనంద్ మహీంద్రా ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఆసక్తికర పోస్టు పెట్టిన విషయం తెలిసిందే. పారిస్‌లో మా రెండో అరకు కాఫీ స్టాల్ అంటూ ఒక వీడియోను షేర్ చేశారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందిస్తూ... పచ్చని అరకులోయ నుంచి పారిస్ నడిబొడ్డుకు మేడ్ ఇన్ ఏపీ ఉత్పత్తి చేరడం, వరల్డ్‌వైడ్‌గా తగిన గుర్తింపు లభించడం స్ఫూర్తిదాయకమని అన్నారు.

### రోజా విమర్శలకు కౌంటర్ ఇచ్చిన
## మంత్రి వాసంశెట్టి సుభాష్

- మొదటి పేజీ తరువాయి

ఆమె ధ్వజమెత్తారు. దీనిపై మంత్రి వాసంశెట్టి సుభాష్ స్పందించారు. అధికారంలో ఉన్నప్పుడు శ్రీవారి దర్శనం టికెట్లు అమ్ముకున్న వాళ్లు ఇప్పుడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని చురక అంటించారు. ఒక్కో సిఫారసు లేఖ మీద 100 మందికి దర్శనాలు చేయించిన ఘనత మీది కాదా? అని రోజాను ప్రశ్నించారు. తిరుమల లడ్డూని కూడా వదలకుండా అన్ని రకాలుగా అపవిత్రం చేసిన మీరు ఇప్పుడు నీతులు మాట్లాడడం దెయ్యాలు వేదాలు వల్లించడమే రోజా గారూ అంటూ మంత్రి వాసంశెట్టి ధ్వజమెత్తారు.

## ప్రధాని మోదీకి ప్రైవేట్ కార్యదర్శిగా నిధి తివారీ

- మొదటి పేజీ తరువాయి

అయిన నిధి తివారీ ప్రస్తుతం ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంఓ)లో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. మార్చి 29న వెలువడిన ఉత్తర్వుల ప్రకారం, కో–టెర్మినస్ ప్రాతిపదికన ప్రైవేట్ కార్యదర్శిగా తివారీ నియామకాన్ని క్యాబినెట్ నియామకాల కమిటీ ఆమోదించింది.

## హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుపై టోల్ ఛార్జీలు పెంపు

- మొదటి పేజీ తరువాయి

కారు, జీపు, లైట్ మోటార్ వాహనాలకు కిలోమీటరుకు 10 పైసలు పెంచారు. దీంతో ప్రస్తుతం ఉన్న ఛార్జీ రూ.2.34 నుంచి రూ.2.44కు పెరిగింది. మినీ బస్ మరియు ఎల్‌సీవీలకు 20 పైసలు పెంచారు. ఈ వాహనాలకు కిలోమీటరుకు ఛార్జీ రూ.3.77 నుంచి రూ.3.94కు పెరుగుతుంది. డబుల్ యాక్సిల్ బస్సులకు కిలోమీటరుకు రూ.6.69 నుంచి రూ.7కు పెంచారు. భారీ వాహనాలకు రూ.15.09 నుంచి రూ.15.78కి పెంచారు. ఓఆర్ఆర్ పై ఐఆర్బీ ఇన్‌ఫ్రా సంస్థ టోల్ వసూలు చేస్తోంది. పెరిగిన ఛార్జీలు రేపటి నుంచి అమల్లోకి వస్తాయి.

## మోదీ పదవీ విరమణ చేయాలని ఆలోచిస్తున్నట్లుగా ఉంది: సంజయ్ రౌత్



ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పదవీ విరమణ చేయాలని ఆలోచనలో ఉన్నారేమోనని, అందుకే ఆయన ఆర్ఎస్ఎస్ కార్యాలయానికి వెళ్లి ఉండవచ్చని శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ అన్నారు. మోదీ నాగ్‌పూర్‌లోని ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించడంపై సంజయ్ రౌత్ స్పందిస్తూ, గత పదేళ్లలో ఆయన ఎప్పుడూ ఆ కార్యాలయానికి వెళ్లలేదని, ఇప్పుడు వెళ్లడానికి ముఖ్య కారణం ఏదైనా ఉండి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. తన పదవీ విరమణ ప్రణాళికల గురించి ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్‌తో చర్చలు జరపడానికి ఆయన అక్కడికి వెళ్లి ఉంటారని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. ఆర్ఎస్ఎస్ దేశ నాయకత్వంలో మార్పును కోరుకుంటున్నట్లు తాను భావిస్తున్నానని, వారు తదుపరి బీజేపీ చీఫ్‌ను ఎన్నుకోవాలనుకుంటున్నారని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ఎస్ నియమాల ప్రకారం మోదీ కూడా రాజకీయాల నుంచి విరమించాలని కోరుకుంటున్నట్లుగా ఉందని ఆయన అన్నారు.

అందుకే ప్రధాని మోదీ మోహన్ భగవత్‌ను కలిసి పదవీ విరమణ పత్రాన్ని సమర్పించి ఉంటారని ఆయన పేర్కొన్నారు. మోదీ రాజకీయ వారసుడు మహారాష్ట్ర నుంచే వస్తాడని తాను బలంగా విశ్వసిస్తున్నానని సంజయ్ రౌత్ అన్నారు.

**సంజయ్ రౌత్ వ్యాఖ్యలపై స్పందించిన ఫడ్నవీస్**

సంజయ్ రౌత్ వ్యాఖ్యలపై మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ స్పందించారు. మోదీ నాయకత్వంలో తాము ఇంకా చాలా ఏళ్లు పని చేస్తామని అన్నారు. 2029లోనూ ఆయన ప్రధానిగా సేవలు అందిస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమర్థవంతమైన నాయకుడు తమను నడిపిస్తున్నప్పుడు వారసుడి కోసం వెతకాల్సిన అవసరం లేదని అన్నారు. నరేంద్ర మోదీ 11 ఏళ్ల క్రితం ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. ఆయన తొలిసారిగా ఆదివారం నాడు ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యాలయాన్ని సందర్శించారు.

# నాదెండ్ల మనోహర్ కి ఘన స్వాగతం జనసేన పార్టీ శ్రేణులు





- దీపం 2 పథకం ద్వారా 99 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించాము
- యువతకు ఉపాధి కల్పించడానికి పవన్ కళ్యాణ్ తపన పడుతున్నారు
- సీతంపేట కార్యాలయానికి భారీగా తరలివ చ్చిన జనసైనికులు, వీర మహిళలు
- పార్టీ శ్రేణులతో కాసేపు ముచ్చటించిన మంత్రివ మనోహర్
- జీవీఎంసీ కార్పొరేటర్ల తో ప్రత్యేక సమావేశం నిర్వహించిన మంత్రి

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 31** :సీతంపేటలో గల విశాఖ జనసేన పార్టీ కార్యాల యానికి విచ్చేసిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మాత్యులు మరియు పార్టీ పీఏసీ చైర్మెన్ నాదెండ్ల మనోహర్ గారికి జనసేన పార్టీ నగర అధ్యక్షులు, సౌత్ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఆదేశాలు మేరకు జనసేన పార్టీ శ్రేణులు ఘనం గా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వివిధ నియోజకవర్గాల నుంచి జనసేన పార్టీ శ్రేణులు భారీగా తరలి రావడంతో సీతంపేట పార్టీ కార్యాలయం కోలాహలంగా మారింది కార్యక్రమంలో మంత్రివర్యులు నాదెండ్ల మనోహర్ నియోజ కవర్గ నియోజకవర్గం ఇన్చార్జులు, పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ లు రీజినల్ కో ఆర్డినేటర్లు , పార్టీ అధ్యక్షులు ,జనసైనికులు , వీర మహిళలు తో మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం పార్టీ కార్యాలయం ఏర్పడిన పత్రికా సమావేశంలో పలు అంశాలపై ప్రస్తావించారు.

దీపం 2 పథకం ద్వారా ఇప్పటి వరకు 99 లక్షల మందికి ఉచిత గ్యాస్ సిలిండర్ అందించాము అని ఉత్తరాంధ్ర యువతకు ఉపాధి కల్పించడా నికి పవన్ కళ్యాణ్ తపన పడుతున్నారు అని త్వరలోనే భారీ పెట్టుబడులు వస్తాయని ధీమా వ్యక్తం చేసారు, పవన్ కళ్యాణ్ ఎప్పటినుండో అభివృద్ధి నోచుకోని గిరిజన గ్రామాలలో పర్య టించి ఆయా గ్రామాలలో రోడ్స్ వ్వేడం ద్వా రా మార్పు తీసుకొచ్చారు అని అన్నారు, మా అధినేత పవన్ కళ్యాణ్ అడుగు జాడలలో నడుస్తూ 21 నియోజకవర్గం లలో అభివృద్ధి, సంక్షేమం ప్రజలకు అందించడము కోసం కృషి చేస్తున్నామని అన్నారు,ఆవిర్భావ సభను విజ యవంతం చేసిన మా పార్టీ నాయకలకు, కార్య కర్తలు లకు, వీర మహిళలకు మా నాయకుని తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలియ జేసారు, ప్రజల పట్ల అంకిత భావంతో పనిచే యడానికి రాష్ట్రంలో చంద్రబాబుతో, దేశంలో మోడీగారితో అందరం కలసి కట్టుగా ముందుకు సాగుతున్నాం అని అన్నారు,

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, రాష్ట్ర చైర్మన్లు, రీజనల్ కోఆర్డినేటర్లు, కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, వివిధ విభాగాల జనసేన పార్టీ శ్రేణులు ,వీర మహిళలు పాల్గొన్నారు.

# పెన్ పవర్ ఉత్తరాంధ్ర

శ్రీకాకుళం। మన్యం। విజయనగరం। విశాఖపట్నం । అనకాపల్లి। అల్లూరి జిల్లా

# నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలి..

**:మన్యం జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్..**

**కురుపాం / పార్వతీపురం, పెన్ పవర్, మార్చి 31 :** జిల్లాలో నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలను ఎప్పటికప్పుడు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఆరోగ్య శాఖ, ఆర్డబ్ల్యూఎస్ శాఖల పరిధిలో చేపడుతున్న నీటి నాణ్యత పరీక్షలు పక్కాగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. రెండు శాఖలు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. వేసవి దృష్ట్యా నీటి నాణ్యత ప్రమాణాలు తప్పనిసరిగా పాటించాలన్నారు. నీటి నాణ్యత ప్రమాణాల పరీక్షలకు సంబంధించి ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో 14 రకాల టెస్టులను చేపట్టడం జరుగుతుందని, దీనిని ప్రతీ రోజు పర్యవేక్షణ చేయాలని ఆయన అన్నారు. ఇందుకు సంబంధించిన నివేదికలను సమర్పించాలని ఆయన ఆదేశించారు.

అన్ని రకాల టెస్టులను చేపట్టాలని సూచించారు. ఈ పరీక్షల విషయమై క్షేత్రస్థాయిలో అధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. బయోలాజికల్ కంటెంట్ , క్లోరిన్ లెవెల్ టెస్ట్ లను ఎలా చేపడుతున్నారని ప్రశ్నించారు. నీటి నాణ్యత పరీక్షలలో ఇప్పటిదాకా పాజిటివ్ నమోదు అంశాలను అడిగి తెలుసుకున్నారు. నీటి నాణ్యత ప్రమాణాలు సరిగా లేకపోతే ఏం చేయాలి అనే దానిపై దృష్టి సారించాలని ఆయన ఆదేశించారు. వేసవిలో కలుషితం అయ్యే అవకాశం ఉంటుందని, ప్రతి నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు.

**చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి**

వేసవి వేడిమి దృష్ట్యా చలివేంద్రాలు విస్తృతంగా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ చెప్పారు. గ్రామ పంచాయతీ, మండల స్థాయిలో అవసరమగు అన్ని ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయన అన్నారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాలు, సంస్థలు, సంఘాల సహకారం తీసుకోవాలని ఆయన చెప్పారు. మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు.

**వేసవి వేడిమి దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**



వేసవి వేడిమి పెరిగిందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అత్యవసర పనులు ఉంటే బయటకు రావాలని ఆయన అన్నారు. టోపీ, గొడుగు వంటి వస్తువులు నీడ కోసం వాడాలని ఆయన అన్నారు. తెల్లని వదులు దుస్తులు వేసుకోవడం మంచిదని ఆయన చెప్పారు. ఉపాధి హామీ ప్రదేశాల్లో సైతం నీడ ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. వేతనదారులకు నీరు అందుబాటులో ఉంచాలని ఆయన చెప్పారు. ఎండ ఎక్కువగా ఉన్న సమయంలో ఉపాధి హామీ పనులు చేపట్టకుండా సమయాల్లో మార్పులు చేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ నీరు ఎక్కువగా తాగాలని, శరీరం డీ హైడ్రేషన్ కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. వడ దెబ్బ తగలకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్త వహించాలని ఆయన చెప్పారు. ఎక్కువ సేపు ఎండలో ఉండి అతి చల్లని పదార్థాలు తీసుకోవడం ఆరోగ్యానికి మంచిది కాదని ఆయన హితవు పలికారు. ఎండలో ఎక్కువ సేపు తిరిగి చల్లని నీటిని తలపై వేసుకోవడం వలన కూడా వడ దెబ్బ తగిలే అవకాశాలు ఉంటాయని ఆయన అన్నారు. రోజు రోజుకు పెరుగుతున్న వేడిమి దృష్ట్యా ప్రతి ఒక్కరూ అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరం మేరకు ఓ ఆర్ ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవడం, కొబ్బరి బొండాలు పానీయాలు తీసుకుని ఆరోగ్యం కాపాడుకోవాలని ఆయన కోరారు.

# అనకాపల్లి అచ్చుతాపురం రహదారి మహర్దశ

- యువగళం పాదయాత్ర సమయంలో ప్రజలు రహదారి విస్తరణ చేపట్టాలని
- యువనేత లోకేష్ కు విన్నవించారు
- అనకాపల్లి -అచ్యుతాపురం రహదారి విస్తరణ పనులకు మంత్రి లోకేష్ శ్రీకారం
- ఫ్లైఓవర్ తోపాటు రెండు మైనర్ బ్రిడ్జిలు, 47 కల్వర్టులు నిర్మిస్తారు
- పారిశ్రామిక సముదాయాలకు కనెక్టివిటీ పెంచ డంలో ఈ రహదారి కీలకపాత్ర
- రూ.347 కోట్ల వ్యయంతో రెండేళ్లలో పూర్తిచేసే విధంగా ప్రణాళికలు
- యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మే రకు రహదారి విస్తరణ పనులు



**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం, మార్చి 31** :అనకాపల్లి నుంచి అచ్యుతాపురం వరకు సు మారు 14కి.మీ.ల పొడవైన రోడ్డు విస్తరణ పనులకు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. యువగళం పాదయాత్ర సమయంలో ఈ ప్రాంత ప్రజలు రహదారి విస్తరణ చేపట్టాలని యువనే త లోకేష్ కు విన్నవించారు. ఆనాడు లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం డబుల్ రోడ్డుగా ఉన్న ఈ రహదారిని రూ.347 కోట్ల ఆసియా డెవలప్ మెంట్ బ్యాంక్ (ఎడిబి) ఆర్థికసాయం తో 4లైన్ల రహదారిగా విస్తరించనున్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో చేపట్టే ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రధానంగా అచ్యుతాపురం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ తోపాటు రెండు మైనర్ బ్రిడ్జిలు, 47 కల్వర్టులు నిర్మిస్తారు. ఈ ప్రాంతం విశాఖ- చెన్నయ్ ఇండస్ట్రియల్ కారిడార్, జవహర్‌లాల్ నెహ్రూ ఫార్మా సిటీ, స్పెషల్ ఎకనమిక్ జోన్ లో భాగంగా రాంబిల్లి, అచ్యుతపురం, పరవాడ వద్ద అభివృద్ధి చేస్తున్న పారిశ్రామిక సమూహాల కు దగ్గరగా ఉంది. దీంతో భవిష్యత్ ట్రాఫిక్ రద్దీ ని దృష్టిలో పెట్టుకొని ఈరోడ్డు విస్తరణ చేపట్టా లని నిర్ణయించారు. ఈ రోడ్డు విస్తరణ ప్రాజెక్ట్ రోడ్డు అనకాపల్లి సమీపంలోని ఎన్ హెచ్-16 జంక్షన్ వద్ద ప్రారంభమై అచ్యుతాపురం వద్ద ముగుస్తుంది. ఈ రహదారి హరిపాలెం రోడ్డు, పూడిమడక రోడ్డు వెంబడి నివాసాలు, పారిశ్రా మిక సంస్థలు, మత్స్యకార గ్రామాలకు ప్రధాన కనెక్టివిటీని అందిస్తుంది. ఇది అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 5595.47 ఎకరాల విస్తీ ర్ణంలో అభివృద్ధి చేస్తున్న ఏపీ.ఎస్.సి.జెడ్ కు ప్రధాన కనెక్టివిటీని అందిస్తుంది. అనకాపల్లి సమీపాన నక్కపల్లి వద్ద ఆర్సెలర్ మిట్టల్ సంస్థ రూ.1.4లక్షల కోట్లతో కొత్తగా నిర్మించతలపెట్టిన స్టీల్ ప్లాంట్ కు కూడా కనెక్టివిటీని సులభతరం చేస్తుంది. ఈ రహదారి ఏపీ.ఎస్.సి.జెడ్ 180 పరిశ్రమల చుట్టూ ఉన్న ఇతర కీలక పారిశ్రామిక ప్రాంతాలను జిల్లా ప్రధాన కార్యాలయానికి అను సంధానించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. ప్రతి రోజూ లక్ష కంటే ఎక్కువ మంది ఉద్యోగుల రోజు వారీ రాకపోకలను సులభతరం చేస్తుంది. అ చ్యుతాపురం, మునగపాక, అనకాపల్లి మండల నివాసితులకు ట్రాఫిక్ కష్టాలను తగ్గిస్తుంది. అనకాపల్లి - అచ్యుతాపురం రహదారి ఇరుకు గా ఉండి తరచూ రోడ్డుప్రమాదాలు జరుగుతుం డటంతో రోడ్డు విస్తరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు,టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, యలమంచిలి టిడిపి ఇన్చార్జి ప్రగఢ నాగేశ్వర రావు, హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ తాతయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.




## జోలపుట్టులో ఘనంగా రంజాన్ వేడుకలు



**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 31.**మండలంలో గల ఆంధ్ర ఒడిస్సా సరిహద్దు ప్రాంతమైన జోలపుట్టులో రంజాన్ పర్వదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదులు హిమమ్ జాకీర్ హుస్సేన్ ఆధ్వర్యంలో గత నెల రోజులు పాటు ముస్లిం సహోదరులు ఎంతో భక్తి శ్రద్ధాలతో ఉపవాసం దినాలు పాటించి రంజాన్ వేడుకను ఘనంగా నిర్వహించుకున్నారు. త్యాగానికి, భక్తికి, పరమార్థనికి, పవిత్రతకు ప్రతీకగా, సేవా భావానికి మతసామరాస్యానికి చక్కటి నిర్వచనమే ఈ రంజన్ పండుగ గొప్పతనమని అన్నారు. ముస్లిం సోదరులు ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ ప్రేమ ఐక్యతతో సోదరా భావంగా మెలగలన్నారు. రంజాన్ అంటే స్నేహానికి గుర్తుగా నేనున్నాను అని భరోసా ఇవ్వడమే అని అన్నారు. కుల మతాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ రంజాన్ అనీ పలువురు అన్నారు. అల్లాహ్ అనుగ్రహం ప్రతీ యొక్క కుటుంబాలకు ఉండాలని, ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ రంజాన్ వేడుకల్లో ఎండి సులేమాన్, మున్నా, అన్వర్ మహమ్మద్, అజ్జు, కమురుద్దీన్, చున్నుతో పాటు బిస్మిల్లా యువజన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక కేంద్రంగా నా.. బొమ్మాళిని తీర్చిదిద్దుతా!





- నాకు ఇష్టమైన గ్రామాల్లో ఒకటి ఈ సంతబొమ్మాలి. మంత్రి అచ్చెన్న.
- ఒకటి రెండు రోజుల్లో కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి రహదారి పనులకు శంకుస్థాపన.
- నరసన్నపేట నుంచి వెంకటాపురం వరకు రూ.120 కోట్లు అంచనాతో అధునాతన రహదారి నిర్మాణం.
- నా అన్నే.. నా అదృష్టం.ఇటువంటి అవకాశం పూర్వ జన్మ సుకృతం.

**సంతబొమ్మలి, పెన్ పవర్, మార్చి 31.**సంతబొమ్మాళి మండల కేంద్రాన్ని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చి దిద్దే బాధ్యత తాను తీసూకుంటాని, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భరోసానిచ్చారు. సోమవారం శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయ శంకుస్థాపన మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందాన్నిచ్చిందని అన్నారు.

దివంగత మహానేత కింజరాపు ఎర్రన్నాయుడు,ప్రజలు, నాయకులు, కార్యకర్తల, ఆశీస్సులు మెండుగా ఉన్నాయని నమ్ముతున్నాని అన్నారు. నా అన్న కృషి ఫలితం సంతబొమ్మాళి ని మండల కేంద్రంగా ఏర్పాటు చేశానని తెలుపుతూ కోటబొమ్మాళి నుంచి సంతబొమ్మాళి రహదారి పనులకు ఒకటి రెండు రోజుల్లో శంకుస్థాపన చేయడం జరుగుతుందని, అదేవిధంగా నరసన్నపేట నుంచి వెంకటాపురం వరకు రూ.120 కోట్ల అంచనా వ్యయంతో రహదారి నిర్మాణ పనులు అతి త్వరలోనే ప్రారంభించడం జరుగుతుందని అన్నారు. టెక్కలి, నౌపడ, వడ్డివాడ రైల్వే వంతెన పనులు త్వరితగతిన ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని, అందుకు అవసరమైన టెండర్ల ప్రక్రియ కూడా పూర్తి చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం సోలార్ విద్యుత్ ను ప్రొత్సహించేందుకు చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగానే నియోజవర్గానికి 10 పదివేల సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేయనుందని, ఇందులో ప్రజల భాగస్వామ్యం కీలకమని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని పారిశ్రామిక హబ్ గా తీర్చిదిద్దేందుకు గాను 10 వేల ఎకరాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నామని, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నార లోకేష్, కేంద్రం పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, సహకారంతో అభివృద్ధి చేసేందుకు కృషి చేయడం జరుగుతుందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడం జరుగుతుందని, మత్స్యకార భరోసా, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాన్ని కూడా అతి త్వరలోనే అమలు చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా అందరూ సమిష్టిగా ఉండి అభివృద్ధి పథంలో తీసుకువెళ్దామని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో పిఏసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

# మూడు రోడ్లకు రూ.30 కోట్లు మంజూరు





**కురుపాం /సాలూరు, పెన్ పవర్, (పార్వతీపురం మన్యం), మార్చి 31 :** గిరిజన గ్రామాలన్నింటికీ రోడ్డు సౌకర్యం కల్పిస్తామని స్త్రీ శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. సోమవారం సాలూరు మండలం తోణం పంచాయతీ సిమిడివలస నుంచి కొత్తూరు వరకు వేసిన రోడ్డును సంధ్యారాణి ప్రారంభించారు. రూ.1.25 కోట్లతో రోడ్డు వేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ తన హయాంలో రహదారి సౌకర్యం లేని అన్ని గ్రామాలకు రోడ్లు వేస్తామని తెలిపారు. సాలూరు మండలంలో మూడు రోడ్లకు మరో రూ.30 కోట్లు మంజూరయ్యాయని ఆమె తెలిపారు. ఈ నిధులతో కురుకుట్టి నుంచి సంపంగిపాడు వరకు రూ.17.20 కోట్లతో 14 కిలోమీటర్ల రోడ్డు, కొదమ నుంచి చింతమల వరకు రూ.7.90 కోట్లతో ఆరు కిలోమీటర్ల రోడ్డు, మరో రహదారిని ఏర్పాటు చేస్తున్నారు. డోలి సమస్యలు తలెత్తకుండా గిరిజన గ్రామాలన్నింటికీ రహదారులు ఏర్పాటు చేసేందుకు ముఖ్యమంత్రి అంగీకరించారని ఆమె తెలిపారు. కొదమ రహదారి అత్యంత కష్టతరమైనదని, ప్రజలతో మమేకమయ్యేందుకు, వారి సమస్యలను తెలుసుకోవడానికి తాను ఆటోలో ప్రయాణించానని ఆమె చెప్పారు. సిమిడివలస ప్రజలు పాఠశాల, అంగన్వాడీ కేంద్రాలు కావాలని కోరగా ఆమె స్పందిస్తూ.. విద్యార్థుల సంఖ్య, నిబంధనలు అనుకూలిస్తే గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు.

**పిల్లల్లో నైతికత పెంపొందించండి**

పిల్లల్లో ముఖ్యంగా మగపిల్లల్లో కనీస నైతికత పెంపొందించాలని మంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. రోజు రోజుకు ఆడపిల్లలు, మహిళలపై అనేక సంఘటనలు జరుగుతున్నాయని, అందుకు సమాజమే కారణమని ఆమె వాపోయారు. కుటుంబంలోనే నీతి బోధించాలని ఆమె అన్నారు. కుటుంబ సమాజంలో ప్రతి అబ్బాయికి తల్లి, సోదరి మరియు చాలా మంది బంధువులు ఉంటారని, ఆడపిల్లలు, మహిళలపై క్రూరత్వం జరగకూడదని ఆమె అన్నారు. తల్లిదండ్రులు వారికి బోధించాలని, ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు వారు పాటించాల్సిన కనీస నైతికత, జాగ్రత్తలు సూచించాలని ఆమె ఉద్బోధించారు. కార్యక్రమంలో అధికారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు

**కురుపాం / పార్వతీపురం,పెన్ పవర్, మార్చి 31 :** నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ ఎస్ ఎస్ శోబిక తెలిపారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా వ్యాప్తంగ రబీ సీజన్ లో సాగు చేసిన అపరాల కొనుగోలుకు సంబందించి పేరు నమోదు ప్రక్రియ ప్రారంభించామని ఆమె
తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాఫెడ్, మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో మినుములు కొనుగోలు చేస్తామని ఆమె చెప్పారు. క్వింటా మినుములకు రూ.7,400 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని ఆమె పేర్కొన్నారు. ఈ-క్రాప్, ఈ-కెవైసీ చేయించుకున్న రైతులు తమ పరిధిలోని రైతు సేవాకేంద్రాలలో సియం యాప్ (%ఎఝజూజూ%) లో పేర్లను నమోదు చేయించుకోవాలని ఆమె కోరారు. నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా పంటను విక్రయించాలని జేసీ శోబిక సూచించారు.

## ఐటీడీఏ పాలకవర్గ సమావేశమెప్పుడు...?

- సుమారు ఐదేళ్లయిన కానరాని పాలకవర్గ సమావేశం...!
- గిరిజనుల పట్ల వైసిపి, కూటమి పాలకుల సవతి ప్రేమ..
- పక్కదారి పడుతున్న గిరిజన సంక్షేమానికి చెందిన ఐటిడిఏ నిధులు
- గిరిజనేతరుల పాలవుతున్న నిధులు, ఉద్యోగాలు
- అప్పుడు డిప్యూటీ సీఎంలు, ఇప్పుడు గిరిజన శాఖ మంత్రి ఉన్నా ఫలితం సున్నా...
- పార్వతీపురం ఐటిడిఏ పై ప్రభుత్వం దృష్టి సారించాలని కోరిన కాంగ్రెస్ పార్టీ నాయకులు..



**కురుపాం / పార్వతీపురం: పెన్ పవర్, మార్చి -31,** పార్వతీపురం ఐటీడీఏ పాలకవర్గ సమావేశమెప్పుడని భారత జాతీయ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రశ్నించారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ ఓబీసీ జిల్లా చైర్మన్ వంగల దాలి నాయుడు, నియోజకవర్గం చైర్మన్ సిరిసిపల్లి సాయి శ్రీనివాస్, జిల్లా నాయకులు కోలా కిరణ్, మండల అధ్యక్షులు తీళ్ళ గౌరీ శంకర్రావు తదితరులు పార్వతీపురంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని తమ పార్టీ ఇన్చార్జ్ బత్తిన మోహనరావు ఆదేశాల మేరకు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు ఐదేళ్లు కావస్తున్నా పార్వతీపురం ఐటీడీఏ పాలకవర్గ సమావేశం నిర్వహించకపోవటం పట్ల వారు అసంతృప్తి వ్యక్తం చేశారు. దీన్ని బట్టి చూస్తే వైసిపి, కూటమి పాలకులు గిరిజనులపై సవతి ప్రేమ చూపిస్తున్నారని స్పష్టమవుతోందన్నారు . వైసిపి కాలంలో డిప్యూటీ సీఎంలు, కూటమి పాలనలో గిరిజన శాఖ మంత్రి ఉన్నప్పటికీ పాలకవర్గ సమావేశాలు నిర్వహించలేదన్నారు. గిరిజనులమని చెప్పుకొని, గిరిజనుల ఓట్లతో పదవులు పొందిన వైసిపి, టిడిపి పాలకులు గిరిజనాభివృద్ధి కోసం, గిరిజన సంక్షేమం కోసం పాటుపడాల్సిన ఐటీడీఏ నిర్వీర్యం అవుతుంటే కనీస చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. గిరిజనుల సమస్యలను చర్చించి, వాటికి చక్కని ప్రణాళికలు రచించి, వారి అభివృద్ధి కోసం ఎంతో దాహద పడే పాలకవర్గ సమావేశాలు జరపకపోవడం అన్యాయమన్నారు. పాలకవర్గ సమావేశాలు జరిపితే ఐటీడీఏ లో జరిగిన అవినీతి, అవకతవకులు బయటపడతాయన్నారు. ఇదిలా ఉండగా గిరిజన సంక్షేమానికి వినియోగించాల్సిన ఐటిడిఏ నిధులు పక్కదారి పడుతున్నాయని ఆరోపించారు. సుమారు 6 కోట్లకు పైబడి ఐటీడీఏ నిధులు కలెక్టరేట్ కు తరలిపోయినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. అలాగే ప్రభుత్వ బ్యాంకుల్లో ఉన్న ఐటిడిఏ నిధులు ప్రైవేట్ బ్యాంకులకు మారినట్లు పార్వతీపురంలో గుసగుసలు వినిపిస్తున్నాయన్నారు. ప్రభుత్వ నిధులు పై వచ్చిన వడ్డీ ఏమవుతుందని ప్రశ్నించారు. అది కూడా గిరిజన సంక్షేమానికి వినియోగించకుండా పక్కదారి పడుతోందని ఆరోపించారు. ఐటీడీఏ ఫిక్స్ డ్ డిపాజిట్లు కూడా మాయమవుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఐటీడీఏ నిధులు అధికారుల భవనాల సోయగాలకు వినియోగిస్తున్నారని ఆరోపణలు లేకపోలేదన్నారు. ఒకప్పుడు కళకళలాడే ఐటిడిఏ జిల్లా కలెక్టరేట్ వచ్చాక మసకబారి వెలవెలబోతోందన్నారు. కీలకమైన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారితో పాటు ఏవో, డిడి, గురుకులం పోస్టులు ఇన్చార్జిలతో నెట్టుకొస్తున్నారు. ఇదిలా ఉండగా అవినీతిని ఎదుర్కొంటున్న అధికారులపై చర్యలు దాదాపు శూన్యంగానే ఉన్నాయన్నారు. గత రెండేళ్లుగా గిరి వెలుగు ఏపీడి పై వస్తున్న అవినీతి ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. ఇక తాగునీరు, చెక్ డ్యాములు, గిరిజన అటవీ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర మాట తదితరవి వరసకు కూడా కానరావడం లేదన్నారు. జిసిసి దాదాపు అంపశయ్యపై ఉందని ఆరోపించారు. గిరిజనులకు చెందాల్సిన నిధులు గిరిజనేతలకు వినియోగిస్తున్నారని ఆరోపించారు. గిరిజనుల ఉద్యోగాలు హాయిగా గిరిజనేతరులు అనుభవిస్తున్నారన్నారు. దీనికి ఉదాహరణగా గిరిజనేతరుడైన ఓ విలేకరి కుమార్తె కు ఉద్యోగం ఇచ్చారని గిరిజన సంఘాలు ఐటిడిఏ వద్ద చేసిన ధర్నాను గుర్తుకు తెచ్చారు. ఏటా గిరిజన విద్యార్థుల మృత్యు ఘోష ఆగడం లేదన్నారు. ఐటీడీఏ పెట్రోల్ బంక్ ద్వారా వస్తున్న లాభాలు ఏమవుతున్నాయని ప్రశ్నించారు. వచ్చిన లాభాలు గిరిజన సంక్షేమానికి వినియోగించాలన్నారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కనీసం జీతాలు కూడా పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం పార్వతీపురం ఐటిడిఏ పై దృష్టి సారించి, పక్కదారి పట్టిన నిధులపై, అవినీతి, అవకతవకలపై దర్యాప్తు చేసి గిరిజనులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ముస్లీం సోదరులకు రంజాన్ పండుగ శుభకాంక్షలు తెలిపిన నాయకులు...





**కురుపాం, పెన్ పవర్,మార్చి -31,**ముస్లీం సోదరులకు సోమవారం రంజాన్ పండుగ సందర్భంగా మాజీ కేంద్రం మంత్రి వైరిచర్ల కిషోర్ దేవ్, మాజీ ఉప ముఖ్యమంత్రి పుష్ప శ్రీవాణి లును పండగ సంధర్భంగా కురుపాం, చిన మేరంగి గ్రామాల్లో తమను తమ స్వగ్రామాల్లో మర్యాద పూర్వకంగా కలిసిన ముస్లీం సోదరులకు రంజాన్ పండుగ శుభాకాంక్షల ను తెలిపారు. సోదర భావం తో అంతా ఐక్యంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముస్లీం సోదరులు , మత పెద్దలు పాల్గొన్నారు.

## ఈద్-ఉల్-ఫితర్ సందర్బంగా ముస్లింలు శాంతి యాత్ర





**గాజువాక :పెన్ పవర్ ,మార్చి 31** ఉల్-ఫితర్ రంజాన్ పండుగ సందర్భంగా అజిమాబాద్ సున్ని జామా మసీదు నుండి ముస్లిం సోదరులు శాంతియాత్ర నిర్వహించారు. శాంతియాత్ర కణితి రోడ్ మీదుగా మదీనా మసీదు ,కొత్తగాజువాక జంక్షన్లో గౌస్య మసీదు ముస్లిం సోదరులు బాబా సయ్యద్ మదీనా షా హౌలియా దర్గా వద్దకు చేరుకొని అక్కడనుండి బీసీ రోడ్డు మీదుగా బీసీ రోడ్ల గల ఈద్గా మైదానం చేరుకొన్నారు . అజిమబాద్ సున్ని జామా మసీదు మౌలానా మహమ్మద్ షాకీర్ ఈద్ నమాజ్ ను ముస్లిం కు వినిపించారు . అనంతరం అల్లా కు ప్రార్థనలు చేశారు . ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యుడు తిప్పల నాగిరెడ్డి, 67 వార్డ్ కార్పొరేటర్ పల్లా శీనివాస్, విశాఖపట్నం తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు 66 వార్డ్ మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ ,66 కార్పొరేటర్ ఇమ్రాన్,షౌకత్ అలీ, గౌస్, ఎండి ముర్తజ జామా మసీద్ సభ్యులు మదీనా వలి రిజ్వాన్ అన్సర్ వలి మోతి జహంగీర్ జబ్బర్ ఇసాక్ హాజీ అమీర్ నన్న సాల్వీన్ గున్న అన్వర్ మున్నా మున్వర్ ఇమామ్ అక్బర్ ఫరీద్ బాబా సిరాజ్ వజీర్ మౌలాలి బుజ్జి ఖాదర్ వలీ మరియు యూత్ కమిటీలు అంజుమనే సీరతున్ నబి నూర్ పార్టీ అంజుమనే గౌస్ పార్టీ మదీనా పార్టీ కే జి ఎన్ పార్టీ రాజా పార్టీ గౌసియా నౌ జవాన్ సొసైటీ మరియు అజీమాబాదులో ఉన్న ముస్లిం యూత్ లు ఈద్ నమాజ్ ప్రార్థనలో వేలాది మంది ముస్లిం సోదరులు పాల్గొన్నారు

## నీటి తొట్టెల నిర్మాణాలు ప్రారంభించాలి..

**కురుపాం /పార్వతీపురం, పెన్ పవర్, మార్చి 31 :** జిల్లాల్లో పశువుల నీటి తొట్టెల నిర్మాణాలు మంగళవారం ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఏ శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సంబంధిత అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశు సంవర్ధక శాఖ ప్రతిపాదనల మేరకు
జిల్లాలో 411 పశువుల తొట్టెలు మంజూరు చేయడం జరిగిందన్నారు. పంచాయతీ రాజ్ సంచాలకులు తక్షణం నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని ఆయన ఆదేశించారు. పశు తాగు నీటి తొట్టెలు వేసవి దృష్ట్యా చాలా అవసరమని ఆయన చెప్పారు. పశువులకు తాగు నీరు అందుటకు ఏర్పాటు చేస్తున్న తొట్టెలు నిర్మాణంలో నాణ్యతలో రాజీ పడరాదని ఆయన స్పష్టం చేశారు.

**తాగు నీటి సమస్యలపై తక్షణం స్పందించాలి**

మండలాల్లో తాగు నీటి సమస్యలపై వస్తున్న అంశాలు పట్ల తక్షణం స్పందించాలని జిల్లా కలెక్టర్ మండల పరిషత్ అభివృద్ధి అధికారులను ఆదేశించారు. ఎక్కడ తాగు నీటి ఎద్దడి తలెత్తరాదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే ఎండల తీవ్రత ఎక్కువగా ఉందని, వచ్చే మూడు నెలల పాటు అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. మండలాల్లో తాగు నీటి సంబంధిత పిర్యాదులకు ప్రత్యేక సెల్ నిర్వహించి పిర్యాదులు ఫోన్ ద్వారా గాని, స్వయంగా గాని స్వీకరించి 24 గంటల్లో పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఇందుకు ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని ఆయన అన్నారు. ఈ టెలి కాన్ఫరెన్స్ లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## విద్యాశాఖ అధికారుల అండదండలతో పది పరీక్షలు ప్రశాంతంగా నేటితో ముగింపు

- ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా పరీక్షా కేంద్రాల లోపలె మాస్ కాఫీ యింగ్ కు రంగం సిద్ధం చేసుకున్న విద్యాశాఖ అధికారులు
- జిల్లా అధికారులకు తప్పా లోపల ప్రవేశం ఎవరికి లేదు.
- గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది ఎలాగైనా ఉత్తీర్ణ శాతం పెంచేందుకు జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తులు.
- ఈ ఏడాది అధికారుల అండదండల మధ్య జరిగిన పది పరీక్షల ఉతీర్ణ శాతం ఆశ్రమ పాఠశాలల్లో పది పర్సంటేజ్ ఏ విధంగా వస్తుందో వేచి చూడాల్సిందే.



**అనంతగిరి పెన్ పవర్ మార్చి 31.** అధికారులు అండదండల మధ్య ఈ ఏడాది పది పరీక్షలు నిర్వహించిన విద్యాశాఖాధి కారులు ఎవరికి ఎటువంటి అనుమానం రాకుండా పది పరీక్ష కేంద్రాల లోపలే మాస్ కాఫీ కి రంగం సిద్ధం చేసిన అధికారులు గత ఏడాది ఆశ్రమ పాఠశాలల్లో ఉత్తీర్ణ శాతం పూర్తిగా పడి పోవడంతో, ఈ ఏడాది పది ఉత్తీర్ణ శాతం ఎలాగైనా పెంచాలి, జిల్లా అదికారుల నుంచి, జిల్లా విద్యా శాఖాధికారి కారులనుంచి ఆదేశాలు రావడంతో ఎలాగైనా ఉత్తీర్ణ శాతం పెంచేందుకు ఆశ్రమాల్లో విద్యార్థులకు అందాల్సిన మెను కోత విధించి, ఇన్విజలెటర్స్, స్క్వాడ్ కు కొంత మొత్తంలో చెల్లించి. పరీక్ష ప్రారంభం అయ్యి గంటన్నర తరువాత విద్యాశాఖ అధికారులు విద్యార్థులకు పూర్తి స్థాయిలో మాస్ కాఫింగ్ కు సాయ సహకారాలు అందిస్తున్నారు. కొంత మంది ఉపాధ్యాయుద్వార బయటకు వచ్చిన సమాచారం.అధికారులు, పదవ తరగతి పరిక్షా కేంద్రాల లోపల అయితే ఎవరి ఎటువంటి అనుమానం రాదని, లోపలకు పత్రిక విలేకరులకు ప్రవేశం లేకపోవడంతో పరీక్షకు సంబంధించిన పుస్తకాలు లోపల కొన్ని రహస్య ప్రదేశాల్లో ఉంచి విద్యార్థులకు అందించే ప్రణాళికలు సిద్ధం చేసుకున్న విద్యాశాఖ అధికారులంటు బయట గుసగుసలు వినిపిస్తున్నాయి. పరీక్ష ప్రారంభమై గంటన్నర తర్వాత సిసి ఫుటేజ్లు నిలిపివేసి మాస్ కాపీయింగ్ ప్రారంభిస్తున్నట్లు లోలో పల ఉపాధ్యాయుల నుంచే పరీక్షలు రాసే పదో తరగతి విద్యార్థులకు మాస్ కాపీయింగ్ చేసే విధంగా సాయి సహకారాలు పూర్తిగా అందిస్తున్నట్లు సమాచారం. ఈ సమాచారం జిల్లా అధికారులకు తెలిసినప్పటకి ఎటువంటి మాస్కాఫింగ్ జరగకుండా పరీక్షలు పకడ్బందీగా జరుగుతున్నాయని, మాస్ కాపీయింగ్ జరగడం లేదంటూ మెహర్బానీ గా అధికారులు చెప్తున్నారు. ఇలా అయితే మెరిట్ విద్యార్థులకు ర్యాంకులు ఏ విధంగా వస్తాయని పూర్తిగా పై చదువులు కి వెళ్ళిన ఇటువంటి వాటిపైనే వాళ్ళు ఆధారపడతారని, దయవుంచి జిల్లా అధికారులు ఇటువంటి వారిపై చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రుల నుంచి ఆరోపణలు వినిపిస్తున్నాయి, జిల్లా అధికారులు పూర్తిస్థాయిలో స్క్వాడలను నిర్వహించి మాస్కాఫింగ్ సహకరిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆయా తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విధంగా వారికి సహకరిస్తే మెరిట్ ఉన్న విద్యార్థులు ఇబ్బందులకు గురవుతారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు.

## ఏపీ ట్రైకర్ డైరెక్టర్ కూడ కృష్ణ రావు మండలంలో పర్యటన



**గూడెం కొత్తవీధి,పెన్ పవర్,మార్చ్31:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ట్రైకర్ డైరెక్టర్ బిజెపి పాడేరు ఇంచార్జ్ కూడ కృష్ణారావు గూడెం కొత్త వీధి గ్రామంలో పర్యటించడం జరిగింది. బిజెపి నాయకులతో సమావేశ అనంతరం కూటమి నాయకులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు.పలు అంశాలపై చర్చించారు.ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబెర్ గొర్లె వీరవెంకట్,టిడిపి మండల అధ్యక్షులు ముక్కలి రమేష్,బీజేపీ మండల అధ్యక్షులు కాకూరు శేఖర్, జీకేవీధి ఎంపిటిసి రీమల రాజేశ్వరి,బీజేపీ నాయకులు చల్లంగి అచ్యుత్,రీమల పాలు పాల్గొన్నారు.

## హుకుంపేట సంత ఆశీలు వస్తువులకు వేలంపాట..



**హుకుంపేట పెన్ పవర్ మార్చి 31.** హుకుంపేట సంత ఆశీలు చేయుటకు. ఏప్రిల్ 2 వ తేదీ బుధవారం ఉదయం 11 గంటలకు సచివాలయం లో 2025 బి2026 ఆర్థిక సంవత్సరానికి గాను సంత ఆశీలు వసూలు చేయుటకు. వేలంపాట నిర్వహిస్తున్నట్లు హుకుంపేట పంచాయతీ సర్పంచ్ సమీడ వెంకట పూర్ణిమ. మీడియాకు తెలిపారు. ఆశీలు వసూలు చేయుటకు కొరకు ఆసక్తి గలవారు వేలం పాటలో పాల్గొనదలచిన వారు స్థానిక పంచాయతీ గిరిజన వాసులై ఉండాలని, అలాగే 5000 రూపాయలు ధరవాత్తు చెల్లించి పాటలో పాల్గొనాల్సి ఉంటుందని ఆమె తెలిపారు.. ఆసక్తి కలవారు వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

# మంత్రి నారా లోకేష్ 60 వ రోజు ప్రజాదర్బార్





- మంత్రి లోకేష్ ను కలిసి సమస్యలు విన్నవించిన ప్రజలు
- అర్జీల త్వరితగతిన పరిష్కారానికి మంత్రి హామీ

**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 31 :**విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ తన రెండో రోజు పర్యటనలో సోమవారం ఉదయం విశాఖ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో 60వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. వివిధ సమ స్యలతో బాధపడుతున్న సామాన్య ప్రజానీకం నుంచి మంత్రి నారా లోకేష్ అర్జీలు స్వీకరించారు. కూటమి ప్రభుత్వం అందరికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ లో కూడా ఇతర రాష్ట్రాల మాదిరిగా రెగ్యులరైజేషన్ కాకుండా ప్రత్యేక ఉపాధ్యాయుల నియామకాలను కేవలం డైరెక్ట్ రిక్రూట్ మెంట్(డీఎస్సీ నోటిఫికేష న్) పద్ధతిలో మాత్రమే భర్తీ చేయాలని ఆంధ్రప్ర దేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయ సమాఖ్య ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. సమైక్యాంధ్ర ఉద్యమ సమయం లో ఏపీఎస్ఆర్టీసీ నర్సీపట్నం డిపోలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పనిచేస్తూ తన భర్త మరణించాడ ని, కాంట్రాక్ట్ కార్మికుల కుటుంబాలకు బ్రెడ్ వి న్నర్ స్కీమ్ వర్తింపజేస్తామని 2013లో యూ నియన్ తో జరిగిన అగ్రిమెంట అమలుచేయక పోవడంతో తమ కుటుంబం రోడ్డున పడిందని విశాఖకు చెందిన కె.రమాదేవి మంత్రి నారా లోకేష్ ను కలిసి ఆవేదన వ్యక్తం చేశారు. బ్రెడ్ విన్నర్ స్కీమ్ ను అమలుచేసి తమకు న్యాయం జరిగేలా చూడాలని విన్నవించారు. విశాఖ పెందుర్తి నియోజకవర్గం వేపగుంట జెడ్ పీహెచ్ స్కూల్ వెనుక ఉన్న ప్రభుత్వ స్థలాన్ని గత వైసీపీ ప్రభుత్వ అండతో కబ్జా చేసి భవనాలు నిర్మించారని, సదరు స్థలాన్ని కబ్జాదారుల నుంచి కాపాడాలని విశాఖకు చెందిన రేపర్తి రాజు విజ్ఞప్తి చేశారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినప్పటికీ ఫలితం లేదని వాపో యారు. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, రెవెన్యూ డీటీగా పనిచేసి రిటైర్డ్ అయినప్పటికీ ఏఎస్ఆర్ జిల్లా సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ ఐటీడీఏలో పనిచేస్తూ వైసీపీకి అనుకూలంగా పనిచేస్తున్న టి.అప్పారావు, ఈశ్వర్ రావులను తొలగించి అర్హులను నియమించాలని పాడేరుకు చెందిన ఎన్.శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. కార్పెంటర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్న తాము విశాఖ పెందుర్తిలోని సుజాత నగర్ టీచర్స్ లేఅవుట్ లో 150 గజాల స్థలాన్ని కొనుగోలు చేశామని, అయితే సదరు స్థలాన్ని అబిత్ రాజు అనే వ్యక్తి దౌర్జన్యం చేసి ఆక్రమించారని ఆర్. లక్ష్మి మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటి పర్యంతమయ్యారు. అధికారులకు ఫిర్యాదుచే సినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారుల నుంచి తమ స్థలాన్ని కాపాడాలని విన్నవించారు. ఇంజనీరింగ్ చదివిన తనకు ఉద్యోగ అవకాశం కల్పించాలని విశాఖపట్నానికి చెందిన కె.సౌజన్య విజ్ఞప్తి చేశారు. ఆయా అర్జీలను పరిశీలించి త్వరితగతిన పరిష్కారానికి కృషిచేస్తామని మంత్రి లోకేష్ హామీ ఇచ్చారు.

## లింగంపేట నూకాలమ్మ ఆలయం వద్ద డొక్కా సీతమ్మ మజ్జిగ పంపిణీ కార్యక్రమం....

ముఖ్య అతిథిగా పాల్గొన్న జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి సూర్య చంద్ర.....




**గొలుగొండ,పెన్ పవర్ (మార్చి 31)** మండలంలో లింగంపేట నూకాలమ్మ అమ్మవారు గుడి వద్ద జనసేన,కూటమి నాయకులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ మజ్జిగ పంపిణీ కార్యక్రమంను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్, బీసీ కార్పొరేషన్ స్టేట్ డైరెక్టర్ రాజాన వీర సూర్యచంద్ర హాజరై మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరుతో నూకాలమ్మ జాతరను పురస్కరించుకొని మజ్జిగ పంపిణీ చేపట్టడం హర్షణీయమన్నారు. జనసేన ఆధ్వర్యంలో మరెన్ని సేవా కార్యక్రమం చేయడం జరుగుతుందని వెల్లడించారు. అనంతరం నూకాలమ్మ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు
ఊడి చక్రవర్తి,జిల్లా సంయుక్త కార్యదర్శి అల్లాడ సురేష్, గొలుగొండ మండల అధ్యక్షులు గండెం దొరబాబు,గొలుగొండ మండల ప్రధాన కార్యదర్శి సలాదుల ప్రసాద్ బాబు,సీనియర్ నాయకులు రేగుబల్ల శివ, నియోజకవర్గ ఎస్సీ సెల్ కన్వీనర్ డాక్టర్ కోన నారాయణరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు బోయిన చిరంజీవి,పాతాళ కుశరాజు, బొడ్డు లవప్రసాద్,స్వామి నాయుడు, మద్దపు కామనాయుడు,మాడెం నాగేశ్వరరావు,పెద్దాడ ప్రసాద విజయ్ కృష్ణ,మరిసా వినయ్, ఆలయ కమిటీ చైర్మన్ కొడమంచిలి వరలక్ష్మి, కూటమి నాయకులు భక్తులు పాల్గొన్నారు.

## శ్రీ వీరాంజనేయ విగ్రహ ప్రతిష్టలో పాల్గొన్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు.



**మండపేట.పెన్ పవర్.మార్చ్ 31 :**మండల కేంద్రం కపిలేశ్వరపురం గ్రామ శివారు సత్యనారాయణపురం లో అగ్నికులక్షత్రియులుచే నూతనంగా నిర్మించిన శ్రీ వీరా ఆంజనేయ, సిద్ధివినాయక, శ్రీ రామమందిర నూతన శిఖర ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. వారికి ఉత్సవ కమిటీ వారు ఘన స్వాగతం పలికారు. అనంతరం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. కపిలేశ్వరపురం పరిసర గ్రామాల నుండి మహిళలు తో సహా వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారినీ దర్శించి తీర్థ, అన్నప్రసాదాలు స్వీకరించారు. అగ్నికులక్షత్రియుల సంఘీయులు, యువకులు ఆలయ శిఖర ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కపిలేశ్వరపురం ఎంపీటీసీ సోనియా, కపిలేశ్వరపురం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ కె మురళీ, మాజీ సర్పంచ్ నూకరాజు, ఈదల శ్రావణి కుమార్ ,శ్రీదేవి, సంపత్రావు ,మాజీ సొసైటీ చైర్మన్ వెంకన్న బాబు, ఎం సూరిబాబు, కేదార్లంకా ఎంపీటీసీ నాగేశ్వరరావు, గణేష్, బి సాయిరాం, సలాది శ్రీను, పి త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

### మండలంలో పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులు

## అధికారులపైనే దాడులు?

**గోకవరం, పెన్ పవర్, మార్చి 31 :** మండలంలో అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయి. తమ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ప్రశ్నించినవారిపై దాడులకు దిగుతూ సామాన్యులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వీరు సామాన్యుల పైన కాకుండా అధికారులపై కూడా దాడులు చేసేందుకు ప్రయత్నించారన్న వార్తలు వినిపిస్తున్నాయి.ఇటీవల జరిగిన సంఘటనలు ఈ వార్తలకు బలాన్నిస్తున్నాయి. వీరికి ఆయా గ్రామాల్లో చోటా నాయకులు మద్దతు పలకడంతో వీరి ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. గ్రామాల్లో నాటుసారా, కోడి పందేలు పేకాట వంటి జూదాలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అసాంఘిక శక్తులను అడ్డుకునేందుకు ఎవరైనా ప్రయత్నిస్తే తిరిగి వారి పైనే దాడులు చేయడానికి ఏమాత్రం వెనకాడటంలేదు. ఈ క్రమంలో అధికారుల పైన దాడులు చేసేందుకు ప్రత్నిస్తున్నారంటే శాంతిభద్రతల పరిస్థితి ఎంతకు దిగజారిపోయిందో అర్థమవుతోంది.గ్రామస్థాయి నాయకులు అండతోనే అసాంఘిక శక్తులు పేట్రేగిపోతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి .అసాంఘిక శక్తులను అదుపు చేయవలసిన నాయకులు, కొందరు సంబంధిత క్రింది స్థాయి సిబ్బంది వీరికి అండగా నిలవడంతోనే వారు రెచ్చిపోతున్నట్లు ప్రజలు చెబుతున్నారు.జూదాలపై అధికారులు జరపనున్న దాడులు సమాచారాన్ని కొందరు కిందిస్థాయి సిబ్బంది ముందుగానే జూదరులకు చేరవేస్తున్నారన్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీరి అసాంఘిక కార్యకలాపాలకు ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు అడ్డాగా మారుతున్నాయి. గ్రామాల్లో నాటుసారా యదేచ్ఛగా పారుతుంది. అడపాదడపా అధికారులు దాడులు నిర్వహించినా సమావేశాలు పెట్టి అవగాహన కార్యక్రమాలు నిర్వహించినా అవి తూతూ మంత్రంగానే సాగుతున్నాయి. గ్రామాల్లో నాటుసారా పేకాట కోడిపందాలు లాంటి జూదాలు స్థానిక నాయకుల కనుసనల్లోనే జరుగుతున్నట్లు ప్రజలనుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.తమ కార్యకలాపాలకు అసాంఘిక శక్తులు అండగా నిలుస్తుంటాయనే కారణంతోనే స్థానిక నాయకులు వీరికి అండగా నిలుస్తున్నారని, నాయకులు తలచుకుంటే ఇరవైనాలుగు గంటల్లో అసాంఘిక శక్తుల ఆటకట్టించవచ్చని ప్రజలు చెబుతున్నారు.మండలకేంద్రం గోకవరంలో కొందరు పట్టపగలు వీధుల్లో ఇళ్ళమధ్యనే మద్యం సేవిస్తూ ప్రశ్నించిన మహిళలపై అసభ్య పదజాలంతో ధూషలకు దిగుతున్నారని మహిళలు వాపోతున్నారు.ఇక మోటార్ బైక్ లపై అతివేగంతో దూసుకుపోతూ ఇతర వాహనదారులను భయభ్రాంతులకు గురిచేస్తున్న వారికి అడ్డుకట్ట వేసేవారు లేకుండాపోయారు.వీరి నిర్లక్ష్యపు రైడింగ్ కు నిత్యం అమాయకులు బలి అవుతూనే ఉన్నారు.పరిస్థితులు ఈ విధంగానే కొనసాగినట్లయితే ప్రజలకు నాయకులపైన అధికారులపైన నమ్మకం కోల్పోయే ప్రమాదముంది.అసాంఘిక శక్తుల ఆగడాలను అణిచివేసి మండలంలో నాటుసారా,జూదాలను అరికట్టి సామాన్యులు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు తీసుకురావాలని అధికారులను, నాయకులను ప్రజలు వేడుకొంటున్నారు.

## ఆంధ్ర మెడికల్ కాలేజ్ విద్యార్థి డాక్టర్ విశాల్కి

- ఇంటర్నేషనల్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ లో అంతర్జాతీయ రజత పథకం




**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 31 :**ఆంధ్ర మెడికల్ కాలేజీ విశాఖపట్నం మూడో సంవత్సరం చదువుతున్న విశాల్ ఆనంద్ ముత్యాల కి తైవాన్ లో 27 మార్చి 2025 నుండి 30 మార్చ్ 2025 వరకు జరుగుచున్న ఇంటర్నేషనల్ స్కేటింగ్ ఛాంపియన్షిప్ లో రజత (సిల్వర్) పథకం సాధించాడు . ఈ ఛాంపియ న్షిప్ లో భారతదేశంతో పాటు పలు దేశాలు అ యిన జపాన్, తైవాన్, కొరియా, ఇటలీ, ఆస్ట్రేలి యా, న్యూజిలాండ్, ఇంగ్లాండ్ మొదలగు 9 దేశాలు పాల్గొన్నాయి. ఈ విజయం పట్ల ఆంధ్ర మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్, యాజమాన్యం మరియు విద్యార్థులు అభినందనలు తెలియ జేశారు. ఈ విజయం పట్ల కోచింగ్ అందించిన ఇండియన్ కోచ్ సత్యం గారు మరియు చిట్టిబా బు సంతోషం వ్యక్తపరిచారు. రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ, విశాఖ డిస్ట్రిక్ట్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ మరియు ఏపీ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్, విశాల్ ఆనంద్ ముత్యాల కి అభినందనలు తెలియపరిచారు.భారతదేశానికి మరియు ఆంధ్ర రాష్ట్రాని కి రజత పతకం అందించినందుకు పలువురు ప్రముఖులు విశాల్ ఆనంద్ ముత్యాల కి అభి నందనలు తెలియజేశారు. ఇటువంటి పథకాలు మరిన్ని సాధించాలని అభినందించారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతి ఘటన పై నిఘా తేల్చండి.



**గుమ్మలక్ష్మీపురం 31, మార్చి పెన్ పవర్ :** పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి ఘటనపై కుటుంబ సభ్యులతో పాటు రెండు తెలుగు రాష్ట్రాల్లో గల క్రైస్తవ సంఘాల యావత్తు పలు అనుమానాలకు తావిచ్చే ఈ విషాదకరమైన ప్రమాదంపై నిఘా తేల్చాలని కురుపా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కో-ఆర్డినేటర్ అడ్డాకుల చిన్నారావు సోమవారం డిమాండ్ చేశారు.
ఈ మేరకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండల కేంద్రాల్లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రవీణ్ పగడాల తన నికార్సైన వాగ్దాటి సద్భోనాలతో క్రైస్తవ ఆధ్యాత్మిక భక్తిలో అనేకులకు మార్గ దర్శనం చేసిన సద్బోధనతో కూడని ఈయన మృతి క్రైస్తవ ప్రపంచానికి తీరనిలోటని పేర్కొన్నారు. అంతే కాకుండా పలు సందేహాలకు కారణమైన ఈ ఘటనపై పోలీసులు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విచారణ మరియు రాజమహేంద్రవరం జి.జి.హెచ్ సీనియర్ వైద్యులు నిర్ధారించిన పోస్టుమార్టం వివరాలను, మృత్తిని కుటుంబ సభ్యులతో పాటు బాహ్య ప్రపంచానికి వెల్లడి చేస్తూ నిశృతి చేయాలని ఆయన అభ్యసించారు. ప్రబోధకుడైన పాస్టర్ ప్రవీణు పగడాల మృతి పట్ల తీవ్ర విచారం వ్యక్తం పరుస్తూ మృతుని కుటుంబా సభ్యులకు తన ప్రాగాడ సానుభూతిని ఆయన తెలియ జేశారు.

## చింతపల్లి క్యూబా మసీదులో రంజాన్ వేడుకలు





**చింతపల్లి పెన్ పవర్ మార్చి 31:-** చింతపల్లిమండల కేంద్రమైన మజీద్ ఏ క్యూబా లో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ పర్వదిన ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్లింలు ఒకరి కొకరు ఆలింగనం చేసుకొని, రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. మండలం లోని ఇతర ప్రాంతాల నుంచి ముస్లిములు ఉదయాన్నే మజీద్ ఏ క్యూబా వద్దకు చేరుకొని నమాజ్ (ప్రార్థనలు) చేసారు.ఇస్లామియా క్యాలెండర్ లోని 9వ నెల పర్వదినమైన రంజాన్ మాసం నెలవంక రాకతో నెలరోజులపాటు కటోర ఉపవాస దీక్ష చేసి, మరలా నెలవంక చూసి జరుపుకునే అతి పవిత్రమైన పర్వదినం గా భావించి"రంజాన్".పర్వదినాన్నిముస్లింలుప్రతీఏటాఘనంగాజరుపుకుంటున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా
ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ పర్వ దినాన్ని చిన్న, పెద్ద తారతమ్య బేధాలు లేకుండా ప్రతీ ఒక్కరూ భక్తి శ్రద్ధలతో నమాజ్ చేసి పవిత్రంగాపండుగనుజరుపుకున్నారు. ఈ సందర్భంగా మత గురువు మహమ్మద్ సాహిద్ ప్రత్యేక ప్రార్థనలునిర్వహించడంతోపాటుక్రమశిక్షణ, దాతృత్వం, ధార్మిక ,చింతనల యొక్క కలయికే ఈ రంజాన్ మాసపు సారాంశమని గుర్తు చేశారు.రంజాన్ నెల ప్రారంభమైన నాటి నుంచి ముగిసే వరకు, ఉపవాస దీక్షలతో అల్లాహ్ ను స్మరించుకోవడం నియమాలను ఆచరించడం జరిగిందన్నారు..అంతేకాకుండా
ఈ ఉపవాస దీక్ష యొక్క లక్ష్యం మనసులో దైవ భీతి, అల్లా పట్ల నమ్మకం, చెడు నుంచి దూరంగా ఉండడం మొదలైన మహోత్సమైన సుగుణాలను పెంపొందింప చేయడమేనని అన్నారు.రంజాన్ అనగానే ఉపవాస దీక్షలో మాత్రమే కాదు. అది మనిషిలోని చెడు భావాన్ని, అధర్మాన్ని , ద్వేషాన్ని రూపుమాపేదన్నారు.ఈ మాసంలో పేదవాడికి ఒక పూట నీవు ఆహారం పెడితే నీకు అల్లా అనేక పుణ్యాలు ప్రసాదిస్తాడని ఉద్దేశింపబడిందని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ అధ్యకులు షేక్ మీరా సాహెబ్, మండల కో ఆప్షన్ సభ్యుడు నాజర్ వల్లి, సభ్యులు షేక్ ఖాసింవలీ, నూర్ సాహెబ్, షేక్ సత్తార్, వల్లి, అధిక సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు..

## జీకే వీధి బిజెపి మండల కమిటీని ప్రకటించిన అధిష్టానం




ముఖ్యఅతిథిగా ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు

**గూడెం కొత్త వీధి,పెన్ పవర్, మార్చ్ 31:** అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్త వీధి బీజేపీ మండల స్థాయి సమావేశం జీకే వీధిలో నిర్వహించారు.ఈ సమావేశానికి ఆంధ్రప్రదేశ్ ట్రైకర్ డైరెక్టర్ పాడేరు అసెంబ్లీ బిజెపి ఇన్చార్జ్ కూడా కృష్ణారావు ముఖ్య అతిథిగా పాల్గొని బిజెపి మండల కమిటీని అధికారికంగా ప్రకటించారు. మండల అధ్యక్షులుగా కాకూరు శేఖర్ కాగా, ఉపాధ్యక్షులుగా కరణం రామచంద్ర, కుమ్మిడు ముంది, జర్త రాజు, వంతల మోహన్, బూడిద ధారాలమ్మ, చెదల విజయ్ కుమారి. జనరల్ సెక్రెటరీగా చల్లంగి అచ్యుత్, గడుతూరి రాజ్ కోటి, కోశాధికారిగా లకే ప్రసాద్, సెక్రటరీలుగా తగ్గి వీరభద్రం, దేవరపల్లి చిన్నబాబు, బూడిద సలోని, కొర్ర తెల్లన్న, జర్త నగేష్, కందుల భీమన్న, బౌదు వెంకటరమణ లతో బిజెపి మండల పూర్తిస్థాయి కమిటీని నియమించడం జరిగింది. ఈ కమిటీని ట్రైకర్ డైరెక్టర్ కూడా కృష్ణారావు అధికారికంగా ప్రకటించారు. ఈ సమావేశంలో స్థానిక బిజెపి ఎంపీటీసీ రీమల రాజేశ్వరి, అరకు నియోజకవర్గ సాగర పంచాయతీ ఎంపీటీసీ వంతల దేవదాస్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బోండ్ల చిరంజీవి, సోషల్ మీడియా కన్వీనర్ పండా పాల్ ఈశ్వర్, ఆర్ఎస్ఎస్ సంఘ కార్యకర్త సుభాషిని, సతీష్, దొర, రామ్ కిరణ్, లక్ష్మీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## చింతపల్లి మండలంలో మంచినీటి కష్టాలు







- నీటి పారుదల శాఖ అధికారుల విచిత్ర దోరణి.
- అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహారం

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 31:-** మన్యంలో నీటి పారుదల శాఖ అధికారుల విచిత్ర దోరణి కారణంగా ప్రస్తుతం మన్య వాసులకు తాగునీటి కష్టాలు ఎక్కువవుతున్నాయి. ప్రకటనలలో ముందు వరసలో ఉండే నీటి పారుదల శాఖ అధికారులు, పని చేయడంలో చివరి వరసలో నిలుస్తున్నారు. ప్రస్తుతం మన్యంలో ఎక్కడా తాగునీటి ఎద్దడి లేదనీ అక్కడక్కడా చిన్న సమస్యలు తలెత్తితే! వెంటనే తమ శాఖ అధికారులు స్పందించి తక్షణమే సమస్య పరిష్కరిస్తున్నారని ఆ శాఖ అధికారులు ప్రకటనలు గుప్పిస్తుండగా! క్షేత్రస్థాయిలో ఆ పరిస్థితి ఎక్కడా కనిపించడం లేదు. చింతపల్లి మండలం కొత్తపాలెం పంచాయితి రామ్‌నగర్ కాలనీలో పది రోజుల క్రితం వీధి కోళాయిలు మరమ్మత్తులకు గురయ్యాయి. దానితో గ్రామంలో పదిరోజులుగా నీటి సరఫరా పూర్తిగా స్తంభించిపోయింది. గ్రామంలో తాగు నీటి సమస్య పరిష్కరించాలని అధికారులను పలుమార్లు కోరినా అదికారులు స్పందించలేదని గ్రామస్థులు తెలిపారు. దీనితో గ్రామస్థులు తాగు నీటి కోసం మైళ్ల దూరం వెళ్ళవలసి వస్తుందని వారు వాపోయారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి మరమ్మత్తులకు గురైన వీధి కోళాయిలకు మరమ్మత్తు పనులు చేపట్టి తాగునీటి సరఫరా కల్పించాలని వారు కోరారు.

## రూ.14.50 లక్షల నిధులతో వీధి రోడ్డు, కాలువలకు భూమి పూజ





**గోపాలపట్నం, పెన్ పవర్, మార్చి 31 :** జీవీఎంసీ 92వ వార్డు, పద్మనాభనగర్ చర్చి పక్కన గల వీధి రోడ్డు, కాలువలకు రూ.14.50 లక్షల వ్యయంతో కూడిన పనులకు భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమానికి విశాఖ తెలుగుదేశం పార్టీ పార్లమెంటరీ ఉపాధ్యక్షులు నందవరపు సోములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వమిచ్చిన హామీల వరకు ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పనకు కట్టుబడి ఉందని, ఈ సందర్భంగా తెలియజేశారు. ఒక్కొక్కటిగా ప్రతి కాలనీలో సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏ.ఈ వెంకటలక్ష్మి, 92వ వార్డు ప్రధాన కార్యదర్శి కంపర ఆనంద్, కంపర కనకరాజు, ఇల్లపు తాతబాబు, చింతాడ పద్మ, కంచిపాటి నాగమణి, బుదిరెడ్ల అప్పలరాజు, గొంతిన శ్రీను, గంట్ల సోమేశ్, రుద్రరాజు నారాయణరాజు, సుబ్బు ఉరుకూటి సతీష్, రమేష్ రాజ, కాకి అప్పారావు, వర్మ, వర్క్ ఇన్స్పెక్టర్ రామకృష్ణ స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ రద్దు చేయాలి

- ఏప్రిల్ 9 న "చలో ఏఓబీ" ని జయప్రదం చేయండి




**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, మార్చి 31 :**
విశాఖపట్నం పోర్టు హాస్పిటల్ను ప్రైవేటీకరిం చేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ, యునైటెడ్ పోర్టు %డ% డాక్ వర్కర్స్ యూనియన్, వీడిఎల్బి %డ% డాక్ వర్కర్స్ యూని యన్ ఆధ్వర్యంలో సోమవారం హాస్పిటల్ వద్ద దీక్ష నిర్వహించబడింది.ఈ దీక్షలో కార్మికులు, ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని, పబ్లిక్ ప్రైవేట్ పార్ట్నర్ షిప్ ద్వారా హాస్పిటల్ను ప్రైవేట్ చేతికి అప్ప గించే కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని ఖండించారు.
యూనియన్ జనరల్ సెక్రెటరీ కే. సత్యన్నారా యణ ప్రసంగం ఈ సందర్భంగా యూనియన్ జనరల్ సెక్రెటరీ కే. సత్యన్నారాయణ మాట్లా డుతూ,"పోర్టు కార్మికుల ఆరోగ్య భద్రతను మూల్యంగా మార్చే ప్రయత్నాన్ని మేము ఒప్పు కోము. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ వల్ల ఉ ద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు తగినంత వైద్యం పొందలేరు. హాస్పిట ల్ను ప్రైవేట్ సంస్థలకు అప్పగించడమే కాకుం డా, కార్మికుల ఆరోగ్యాన్ని వ్యాపారంగా మార్చే కుట్ర జరుగుతోంది. మేము దీన్ని తీవ్రంగా వ్యతి రేకిస్తున్నాం. ప్రభుత్వం తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి. లేనిచో, పోరాటాన్ని మరిం త ఉధృతం చేస్తాం!" అని హెచ్చరించారు.
మా డిమాండ్లు,పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణను తక్షణమే రద్దు చేయాలి.రీటెండర్ ప్రక్రియను వెంటనే నిలిపివేయాలి.పోర్టు యాజమాన్యం స్వంత నిధులతోనే హాస్పిటల్ను అభివృద్ధి చేయాలి.నిపుణులైన డాక్టర్లు, సిబ్బందిని నియమించి, అధునాతన వైద్య పరికరాలను సమకూర్చాలి.ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమం కొనసాగించాలి. భవిష్యత్తు కార్యాచరణ
ఏప్రిల్ 1 నుండి: ఉద్యోగుల నివాస ప్రాంతాల్లో నిరసనలు ఏప్రిల్ 9 ఉదయం 9 గంటలకు: "చలో ఏఓబీ" కార్యక్రమం పోర్టు హాస్పిటల్ను ప్రైవేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ ఈ ఉద్యమా న్ని మరింత ఉధృతం చేయాలని, కార్మికులంతా ఐక్యంగా పోరాడాలని ఈ ప్రెస్ నోట్ ద్వారా పిలు పునిస్తున్నాం.
ఈ కార్యక్రమంలో కె ఎస్ కుమార్, జి. వి.హెచ్ నాయుడు, శంకర్, అమిరింద్ర, సరస్వతి తదితరులు పాల్గొన్నారు

# రంజాన్ పండగ హిందూ - ముస్లిం సోదరుల






- మధ్య పెల్లుబికిన సోదర భావం,స్నేహం
- మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన రంజాన్ పండగ
- రంజాన్ పర్వదినాన హిందూ ముస్లిం సోదరుల మధ్య పెల్లుబికిన సోదర భావం, స్నేహం
- జిల్లా ఎస్పీ ఆదేశాలతో జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసిన అధికారులు
- విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందల్,
- జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఆదేశాలతో భద్రతను డ్రోన్స్ తో పర్యవేక్షించిన పోలీసు అధికారులు

**క్రైమ్ బ్యూరో, పెన్ పవర్, విజయనగరం, మార్చి 31 :** జిల్లాలో రంజాన్ పండగ హిందూ - ముస్లిం సోద రుల మధ్య సోదర భావం పెల్లుబికి, పండగలో ఎటువంటి మత విద్వేషాలు, సంఘర్షణలు, అల్ల ర్లు జరగకుండా రంజాన్ పండగ ప్రశాంతయు తంగా ముగిసినట్లుగా జిల్లా ఎస్పీ వకుల జిం దల్ మార్చి 31న తెలిపారు.జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ - జిల్లాలో రంజాన్ పర్వది నాన జిల్లాలో ఎటువంటి మత ఘర్షణలు తలెత్త కుండా జిల్లా పోలీసుశాఖ ముందస్తు భద్రత చర్యలు చేపట్టిన సత్ఫలితాలిచ్చాయని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. రంజాన్ పర్వది నాన్ని దృష్టిలో పెట్టుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని మసీదుల వద్ద పోలీసు,బందోబస్తు ఏర్పాటు చేసినట్లు, భద్రత ఏర్పాట్లును సంబంధిత పోలీ సు అధికారులు డ్రోన్స్ తో పర్యవేక్షించారన్నా రు. మసీదుల వద్ద ప్రార్ధనలకు విచ్చేసిన ముస్లిం సోదరులకు హిందూ సోదరులు రంజాన్ శు భా కాంక్షలు తెలుపుతూ,మత సామరస్యానికి ప్రతీకగా నిలిచారన్నారు. కొన్ని మసీదుల వద్ద హిందువులు, ముస్లింలు సోదర భావంతో ఒకరి నొకరుఆలింగనం చేసుకొని, శు భాకాంక్షలు తెలుపుకొన్నారన్నారు. పట్టణంలో ముఖ్యమైన మసీదుల వద్ద డ్రోన్స్ తో నిఘా ఏర్పాటు చేసి, ప్రార్ధనలకు వచ్చే ముస్లిం సోదరుల వాహనాల వలన ఎటువంటి ట్రాఫిక్కు ఇబ్బందులు తలెత్త కుండా పోలీసులు చర్యలు చేపట్టారని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ తెలిపారు.భారత దేశం విభిన్న సంస్కృతుల సమ్మేళనమని, రంజాన్ పండగ రోజున హిందూ - ముస్లిం సోదరులు ఒకరి సంస్కృతిని ఒకరు గౌరవించు కొంటూ, శుభాకాంక్షలు తెలుపుకొంటూ మతసామరస్యా నికి ప్రతీకగా నిలిచారన్నారు.రంజాన్ ముస్లింల పవిత్రమైన మాసమని, ప్రతీ రోజు ఉపవాస దీక్ష చేస్తూ, ప్రార్ధనలు చేస్తూ, ముస్లిం సోదరులు తమ దాతృత్వాన్ని చాటుకుంటారన్నారు. ఈ మాసంలో నిర్వహించే ఇఫ్తార్ విందులో ముస్లిం సోదరులు తమకు అప్తులైన హిందువులను ఆహ్వానించి, వారితో కలిసి భోజనం చేయడం పరస్పర ఐక్యతకు, సమాజంలో శాంతి, సహ నం, ప్రేమకు నిదర్శనంగా నిలుస్తుందని జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు.జిల్లా వ్యాప్తంగా వివిధ మసీదుల వద్ద సంబంధిత పోలీసు అధి కారులు, సిబ్బంది భద్రత విధులు నిర్వహించగా, విజయనగరం డిఎస్పీ ఎం.శ్రీనివాసరావు, బొబ్బి లి డిఎస్పీ జి.భవ్యరెడ్డి, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు బందోబస్తు, భద్రత ఏర్పాట్లును పర్యవేక్షించారు.

## అంగరంగ వైభముగా స్వామివారి నిత్య కల్యాణం





**సింహాచలం, పెన్ పవర్, మార్చి 31 :** ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం ప్రముఖ పుణ్యక్షేత్రముగా విరాజిల్లుతున్న సింహాచలం శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామివారి నిత్య కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. ఆర్జిత సేవల్లో భాగంగా అర్చక స్వాములు ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో మండపంలో అధిష్టింపజేశారు. నిత్య కళ్యాణములో పాల్గొన్న భక్తుల, గోత్రనామా లతో సంకల్పం చెప్పి పాంచరాత్రాగమశాస్త్రం విధానంలో విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనాలతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కంకణధారణ, నూతన యజ్ఞోపవీత సమర్పణ, జీలకర్ర, బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ప్రక్రియలను కమనీయంగా జరిపించారు. మంత్రపుష్పం, మంగళాశాసనాల తర్వాత భక్తులకు వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అనంతరముస్వామివారి అంతరాలయ దర్శనం కల్పించారు.

## శ్రీ స్వామివారి చందనోత్సవం ఏర్పాట్లపై సమావేశం





**సింహాచలం, పెన్ పవర్, మార్చి 31 :** శ్రీ వరాహలక్ష్మి నరసింహస్వామివారి దేవస్థానం, సింహాచలంలో శ్రీ స్వామివారి నిజరూప దర్శనం చందనోత్సవం సందర్భంగా చేయవలసిన ఏర్పాట్లు పై ఆలయ కార్యనిర్వహణాధికారి కె సుబ్బారావు , సివిఫిట్, డి.బ్రమరాంబ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వామివారి నిజరూప దర్శనం భక్తులు వీక్షించుటకు అవసరమగు ఏర్పాటును ఆలయ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు, ఆలయ ఏఈఓలు పర్యవేక్షణ అధికారులతో సమావేశం నిర్వహించి, చందనోత్సవ ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలను ప్రస్తావిస్తూ భక్తులు చందనోత్సవం రోజు ఎక్కువ మంది భక్తులకు దర్శనం కల్పించాలని, సంకల్పంతో ఉన్నట్లుగా తెలియజేశారు. ముఖ్యంగా శుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ, క్యూ లైన్ మెయింటెనెన్స్, క్యూ లైన్లో భక్తులకు మజ్జిగ పంపిణీ, మంచినీరు సౌకర్యం, ప్రతి క్యూలైన్ కు పెల్లర్లు ఏర్పాటు, కొండపైన మరియు కొండ దిగువ తాత్కాలికి మరుగుదొడ్లు ఏర్పాటు పై చర్చించారు. ఉత్సవం మొత్తం సీసీ కెమెరా పర్యవేక్షణ ఉంటుందని, ప్రతి క్యూలైన్ ప్రత్యేక మార్గం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు, స్వచ్ఛంద సంస్థలవారి సహకారంతో ప్రతి ప్రదేశం వద్ద పానీయములు సరఫరా, వివిధ అంశాలపై సమావేశంలో చర్చించడం జరిగింది. సదరు సమావేశంనకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసరాజు రాంబాబు, సహాయ కార్యనిర్వాహణాధికారి ఎన్ ఆనంద్ కుమార్, పిల్లా శ్రీనివాసావు, ఏఈఓ హరి, పర్యవేక్షణ అధికారులు పాలూరి నర్సింగరావు, గాయత్రి, రాజ్యలక్ష్మి, ప్రసన్న లక్ష్మి, సత్యవాణి, శ్రీనివాస్ ఏఈఓ తాతాజీ, బంగారు రాజు, రవి రాజు, బాబ్జి, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా భావనాఋషి భద్రావతి పూజా మహోత్సవం



- రాష్ట్రంలో వెనకబడిన సామాజిక వర్గాలలో "పద్మశాలి"
- ఒక్కటి,ఐక్యతతో సంఘటితమవుదాం
- పద్మశాలి యువజన సేవా సంఘం ప్రతినిధి కాకి గంగరాజు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్నం మార్చి 31:** రాష్ట్రంలోనే వెనకబడిన వర్గాలలో అత్యధిక జనాభా కలిగిన "పద్మశాలి"నేడు రాజకీయ వర్గ విభేదాల కారణంగా త్రొక్కబడుతూ ఇతర సామాజిక వర్గాల ఎదుగుదలకు కారణం "పద్మశాలి".అనేక శాఖలుగా విస్తరించి ఉన్న పద్మశాలి నేడు రాజకీయ ఆదరణ లేక అంతర్గత విభేదాలతో ఎదుగుదల లేక ఒకరి మోచేతి క్రింది నీరు త్రాగవలసి వస్తుందని,ఇకనైనా వర్గాలు విడనాడి పద్మశాలి మనుగడకు బలం చేకూరుస్తూ రాజకీయపరంగా ఎదుగుదలకు'నిలిచే'వారికి సామాజిక వర్గం వెన్ను దన్నుగా నిలబడాలని,వాటికి ఇలాంటి వేదికల ద్వారా ఐక్యతను కనపరచకోవాలని శ్రీ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం ప్రతినిధి కాకి గంగరాజు అన్నారు.తూర్పు నియోజకవర్గం 11వ వార్డు పరిధి ఆరిలోవ ఒకటో సెక్టార్ గాంధీనగర్లో శ్రీ శ్రీ భక్త మార్కండేయ పద్మశాలి యువజన సేవా సంఘం సంఘం ప్రతినిధి కాకి గంగ రాజు,సభ్యుల ఆధ్వర్యంలో భావనారుషి భద్రావతి పూజా మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆరిలోవ, పరిసర ప్రాంతాల నుంచి సుమారు వెయ్యి మంది పద్మశాలి కుటుంబ ఆత్మీయ సమ్మేళనం లో పాల్గొన్నారు. కార్యక్రమంలో పద్మశాలి సామాజిక పెద్దలు పప్పు రాజారావు,కులపాక సన్యాసిరావు,నూకిరెడ్డి సూరిబాబు,కరణం వెంకటేశ్వరరావు,బుడి వెంకటేశ్వరరావు,తెల్లపు కళ్యాణి,వానపల్లి గాయత్రి, కొప్పల రమేష్, నీలి అప్పలరాజు.,కొప్పల రాంకుమార్,అయ్యంకల శ్రీనివాస్,వానపల్లి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లి లో షారోమ్ టీమ్, ఫెలోషిప్ పాస్టర్లు, భారీ ర్యాలీ

### పాస్టర్ ప్రవీణ్ కుమార్ మృతికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తాం.

**చింతపల్లి పెన్ పవర్ మార్చి 31:-** రాజమండ్రి సమీపంలో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ప్రగడాల ప్రవీణ్ కుమార్ మృతిపై పూర్తి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని షారోమ్ టీమ్ మత బోధకుడు డేవిడ్ రాజు డిమాండ్ చేశారు.
సోమవారం షారోమ్ టీమ్ ఆధ్వర్యంలో హనుమాన్ జంక్షన్ కూడలి నుండి సంత బయలు వీధి వరకు భారీ శాంతి ర్యాలీ నిర్వహించారు. చింతపల్లి జికే వీధి కొయ్యూరు పెదబయలు పాడేరు జిమాడుగుల తదితర మండలాల నుండి క్రైస్తవ పాస్టర్లు, క్రైస్తవ అభిమానులు భారీ ఎత్తున చింతపల్లిలో ర్యాలీ చేసినారు ప్రవీణ్ కుమార్ మత బోధకుడిగా ప్రజలకు ఎనలేని సేవలు అందించారని, ఆయన మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రవీణ్ కుమార్ మృతితో క్రైస్తవ సమాజం తీవ్ర మనోవేదనకు గురైందని, మత బోధకుల భద్రతకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మత మార్పిడి చట్టాన్ని రద్దు చేయాలని, ప్రజలు తమ మతాన్ని స్వేచ్ఛగా అనుసరించే హక్కును ప్రభుత్వం హరించరాదని ఆయన అన్నారు. ప్రవీణ్ కుమార్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని షారోమ్ టీమ్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, షారోమ్ టీమ్ సభ్యులు ఎస్.వనరాజు పాస్టర్ డేవిడ్ రాజ్ పాస్టర్ ఫిలిప్ అధ్యక్షులు పాస్టర్ కాలేబు పాస్టర్,చెల్లారావు మారోస్,జాన్ పాల్, బెనర్జీ జ్యోతిరాజు తిమోతి, చల్లారావ్, రాజు, డేవిడ్, పీటర్, సాంసన్, పద్మాకర్ రావు, అప్పలరాజు, జోసెఫ్ బాబురావు, పాస్టర్లు, ఆర్.సత్యనారాయణ (అర్జున్)







## ఆరిలోవ ప్రెస్ క్లబ్ సభ్యులకు ఉగాది శుభాకాంక్షలు

ప్రముఖ వ్యాపారవేత్త,సోషల్ వర్కర్ కాకి గంగరాజు



**స్టాఫ్ రిపోర్టర్ పెన్ పవర్, విశాఖపట్నం మార్చి 31:** ఆరిలోవ జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులకు ఉగాది సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేసిన వి జువెలరీ మార్ట్, ఓం సాయిరాం క్యాటరింగ్ పార్ట్నర్ కాకి గంగరాజు. ఈ సందర్భంగా ఆయన మీడియా మిత్రులకు విశ్వవసు నామ సంవత్సర సందర్భంగా ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రజలందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని కోరుతూ,మీడియా మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేసి అనంతరం మిఠాయిలు పంపిణీ చేశారు.జర్నలిస్టులు అందరూ కలిసి ఐకమత్యంగా ఒక క్లబ్ ని ఏర్పాటు చేసుకోవడం సంతోషకరమని, జర్నలిస్టుల సంక్షేమానికి తన వంతు సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక విలేకరులు,సభ్యులు పాల్గొన్నారు.

## ఉచిత శాస్త్రీయ సంగీత శిక్షణా తరగతులు



**విశాఖ దక్షిణం, పెన్ పవర్, మార్చి 31** :డాబాగార్డెన్స్ ప్రాంతంలో గల ఐ వివిఎల్ శాస్త్రి సంగీత సమితి కమిటీ వారి ఆధ్వర్యంలో సంవత్సర కాలం పాటు శాస్త్రీయ సంగీతం, అన్నమాచార్య సంకీర్తనలు, పురందరదాసు సంకీర్తనలు , వేణుగానంపై ఉచితంగా సంగీత శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి పి.జగన్ మోహన్ రావు తెలిపారు. 5 సంవత్సరాల నుండి పై 50 సంవత్సరాల వరకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల కళాశాలల విద్యార్థిని విద్యార్థులు స్త్రీ పురుషులు ఎవరైనా కులమతాలకు అతీతంగా పాల్గొనవచ్చును. నగరానికి చెందిన ప్రముఖ సంగీత విద్వాం సులు ఆకొండి వెంకటరావు శాస్త్రీయ సంగీతంపై చక్కని శిక్షణ ఇస్తారు. సంవత్సర కాలం పాటు ఉచితంగా నిర్వహిస్తున్న సంగీత శిక్షణా తరగ తులలో పాల్గొనదలచినవారు సెల్ నంబర్లు 6302661211 , 8309220060 నందు సంప్రదించవలెను. ప్రవేశానికి సంబంధించిన దరఖాస్తులను ఏప్రిల్ 6 లోగా శ్రీరామనవమి నాడు ఉదయం 6 గంటల నుండి 8 గంటల లోపు రాంనగర్ మెయిన్ రోడ్డు శ్రీ రాఘవేంద్ర స్వామి ఆలయంలో పొందగలరని సంస్థ కార్యదర్శి పి.జగన్ మోహనరావు తెలిపారు.

## శిధిలావస్థలో కల్వర్టు - కన్నెత్తి చూడని అధికారులు

వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆయా ప్రాంత వాసులు డిమాండ్.





**ముంచంగిపుట్టు, పెన్ పవర్, మార్చి 31.** శిధిలావస్థలో చేరిన కల్వర్టు వైపు కనీసం కన్నెత్తి చూడని అధికారుల పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గల సుజనకోట పంచాయతీ సుజనపేట గ్రామ సమీపంలో గల ముత్యాలమ్మ గుడికి సమీపంలో కల్వర్టు కూలిపోయి ప్రమాద భరితంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారిందని ఆ గ్రామ ప్రజలు పేర్కొన్నారు. గత ఎనిమిది నెలలుగా కల్వర్టు కూలిపోయి ప్రమాద భరితంగా మారాయి. ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే ఆటోలు, ద్విచక్ర వాహనాలు, జీపులకు ప్రమాదం పొంచి ఉంది. చేసేది లేక తప్పని పరిస్థితుల్లో రాకపోకలు సాగిస్తున్న పరిస్థితి నెలకొంది. కల్వర్టు కూలిపోయిన విషయం అధికారులకు తెలిసినప్పటికీ చూసి చూడనట్లుగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆయా గ్రామ ప్రజలు తీవ్రంగా విమర్శిస్తున్నారు. ఆ కల్వర్టులో వాహనదారులు పడిపోయి ప్రమాదాలు జరిగితే కానీ అధికారులు స్పందించరా అని మండిపడుతున్నారు. ఇప్పటికైన కూలిపోయిన కల్వర్టును మరమ్మతులు చేపట్టి నూతన కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ తో "తెలుగు శక్తి" భేటీ





- అధికారులు కూటమి ప్రభుత్వానికి చెడ్డ పేరు తీసుకువస్తున్నారు
- ఇప్పటికీ అధికారులు వైయస్ జగన్ భజన చేస్తున్నారు
- తాజాగా శారదా పీఠం ఆక్రమణల తొలగింపు విషయంలోనూ ఉదాశీన వైఖరి
- తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్

**విశాఖ ఉత్తరం, పెన్ పవర్, మార్చి 31** :రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ను.. తెలుగు శక్తి అధ్యక్షుడు బి.వి.రామ్ సోమవారం విడి విడి గా కలుసుకున్నారు. ముందుగా నారా లోకేష్ ను రామ్ నగర్ లోని తెలుగుదేశం పార్టీ విశాఖ ప్రధాన కార్యాలయంలోనూ, నాదెండ్ల మనోహర్ ను సీతమ్మ పేట లోని జనసేన కార్యాలయం లోనూ కలుసుకున్నారు. ఈ సందర్భంగా బి.వి. రామ్ మీడియాతో మాట్లాడుతూ.. అధికారులు అనుసరిస్తున్న విధానాలు కూటమి ప్రభుత్వాని కి చెడ్డపేరు తెచ్చే విధంగా ఉన్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ప్రస్తుత స్పీకర్ చింతకాయ ల అయ్యన్నపాత్రుడు, టిడిపి రాష్ట్ర అధ్యక్షు డు పల్లా శ్రీనివాసరావు, జీవీఎంసీ మాజీ మేయర్ సబ్బం హరి నివాస గృహాలతో పాటు.. ప్రపంచ ప్రఖ్యాతి పొందిన గీతం విశ్వవిద్యాలయంలో కొంత భాగాన్ని కూడా ఎటువంటి నోటీసులు జారీ చేయకుండానే అధికారులు కూల్చివేతల కు పాల్పడ్డారన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్.. పంతులు గారి మేడ ప్రాంతంలో అక్రమ నిర్మాణం నిర్మిస్తున్నప్ప టికీ వెంటనే కూల్చివేయకుండా నోటీసులు జారీ చేశారన్నారు. ఈ క్రమంలోనే అమర్నాథ్ హైకో ర్టుకు వెళ్లి కూల్చివేతలను అడ్డుకున్నారని తెలిపారు. ఈ ప్రక్రియకు పరోక్షంగా అధికారుల వైఖరే కారణమని బి.వి.రామ్ ఆరోపించారు. అధికారులు ఇప్పటికీ ఎందుకు వైసీపీకి కొమ్ము కాస్తున్నారో అర్థం కావడం లేదని విచారం వ్యక్తం చేశారు. తాజాగా.. కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వం కాబట్టి.. శారదా పీఠానికి ముందుగా నోటీసులు జారీ చేసిందన్నారు. అయినప్పటికీ మరో మూడు వారాలు గడువు కావాలని పీఠం కోరడం అందుకు.. తహసీల్దార్ అంగీకరించడం సబబు కాదన్నారు. ఇదిలా ఉండగా పెందుర్తి లోని ఆక్రమిత భూములలో శారదాపీఠం నిర్మించారని.. ప్రభుత్వం దృష్టి సారించారని గత అక్టోబర్ నుంచి పోరాటం చేస్తున్నామని తెలిపారు.ఆ ఆలయాలను ప్రభుత్వమే నిర్వహిం చాలి,హిందూ వాదిగా ఆలయాల కూల్చివేత తమ అభిమతం కాదని.. ఆక్రమిత భూమిలో ఉన్న ఆలయాలను ప్రభుత్వమే స్వాధీనం చేసు కొని నిర్వహించాలని కోరుతున్నామ న్నారు. అధికారులు అనుసరిస్తున్న వైఖరి,శారదా పీఠం అంశాన్ని నారా లోకేష్, నాదెండ్ల మనోహర్ దృష్టి కి తీసుకు వెళ్లామన్నారు. అధికారుల వైఖరిలో మార్పు రాకపోతే సమస్యను ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్తామని రామ్ హెచ్చరించారు.

తెలుగు శక్తి యువత అభివృద్ధి సలహాదారు వి. వంశీ బాబు, పి.శ్రీనివాసరావు, పి.రితేష్ తది తరులు కలిసిన వారిలో ఉన్నారు.

# ప్రజాతీర్పు సంక్షేమం, అభి వృద్ధి జోడెద్దుల బండిలా !







- అభివృద్ధి, సంక్షేమం కోసం కసితో పనిచేస్తు న్నాం!
- ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయా ల్సిన బాధ్యత కూటమిపై ఉంది!
- అందుకే కూటమికి 94శాతం సీట్లతో విప్లవాత్మ కమైన గెలుపు నందించారు
- దక్షిణ భారతదేశంలో ఎక్కడా లేనివిధంగా ఆంధ్రప్రదేశ్ లో పెద్దఎత్తున అభివృద్ధి
- ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు మాట నిలబెట్టుకుంటాం
- అనకాపల్లి- అచ్యుతాపురం రోడ్డు విస్తరణ పనుల శంకుస్థాపన కార్యక్రమంలో లోకేష్

**స్టాఫ్ రిపోర్టర్, పెన్ పవర్, విశాఖపట్నం మార్చి 31 :** ప్రజల ఆశయాలు, ఆకాంక్షలను నెరవేర్చాల్సిన బాధ్యత మనందరిపై ఉంది, 151 సీట్లు 11 కావడానికి గత పాలకుల అరాచకమే కారణం, ఈ విప్లవాత్మకమైన ప్రజాతీర్పు సంక్షేమం, అభి వృద్ధి జోడెద్దుల బండిలా నడిపించేందుకు ఇచ్చారు. అరాచకపాలన నుంచి విముక్తికోసమే గత ఎన్నికల్లో 94శాతం సీట్లు కూటమికి ఇచ్చా రని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. యువగళం లో ఇచ్చిన హామీ మేరకు రూ. 347కోట్ల అంచ నా వ్యయంతో అనకాపల్లి నుంచి అచ్యుతా పురం వరకు సుమారు 14కి.మీ.ల పొడవైన రోడ్డు విస్తరణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూయువగళం పాదయాత్ర కుప్పం నియోజకవర్గంలో ప్రారం భించా.ఆనాడు ప్రజలు పెద్దఎత్తున నా సభలకు వస్తే స్టూలుపై నించుని మాట్లాడా. ఆనాడు ఇదే పోలీసు అధికారులు నా మైక్ లాక్కున్నారు. ఎన్నికల్లో అందరికీ దిమ్మదిరిగేలా తీర్పువచ్చింది. ఆనాడు ప్రజాప్రతినిధులను కలిసేందుకు ప్రజలకు అవకాశం ఉండేదికాదు. ఫేస్ బుక్ లో పోస్టు పెడితే జైలుకు పంపారు. నాపై 23 కేసులు పెట్టారు, హోం మంత్రి అనితపై కూడా ఆనాటి ప్రభుత్వం 23 కేసులు పెట్టింది. పులివెందులలో దళితమహిళను హత్యచేస్తే చూడటానికి వెళ్తే కూడా ఆమెపై తప్పుడుకేసు పెట్టారు. డైనమిక్ లీడర్ అయ్యన్నపాత్రుడు ప్రజలతరపున పోరాడితే ఆయనపై నిర్భయ కేసు పెట్టారు. ఎన్నికేసులు పెట్టినా ప్రజలు మా వెనుక ఉండి నడిపించారు. మాకు మీరు అండగా నిలిచారు. చంద్రబాబునాయుడును 53రోజులు బంధిస్తే మీరు అండగా నిలబడ్డారు.అభివృద్ధి, సంక్షేమం కోసం కసితో పనిచేస్తున్నాం రాష్ట్రంలో పెద్దఎ త్తున సంక్షేమం, అభివృద్ధి చేయాలనే కసితో పనిచేస్తున్నాం. వృద్ధాప్య పెన్షన్ 4వేలు పెంచి ప్రతినెలా ఇంటికి వెళ్లి అందిస్తున్నాం. దేశంలో ఏ రాష్ట్రం ఇంత పెద్దమొత్తంలో పెన్షన్ అందించడంలేదు. అన్నక్యాంటీన్లను తెరిపించాం, గ్యాస్ సిలండర్లు అందిస్తున్నాం. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ రెండునెలల్లో అందిస్తాం. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నిలబె ట్టుకుంటూ అభివృద్ధిని ముందుకు తీసుకెళ్తు న్నాం. ఆనాడు అచ్యుతాపురం %-% అనకాపల్లి రోడ్డులో గోతులను స్కేలు పెట్టి కొలవాల్సి వచ్చింది, ఏ గుంతలో ఎప్పుడు పడతామో తెలియని పరిస్థితి. ఎన్ డిఎ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గోతులు పూడ్చడానికి నిధులు మంజూరుచేశాం. ఈ రోడ్డును 4లైన్ల రోడ్డుగా విస్తరిస్తానని యువగళంలో హామీ ఇచ్చాను. ఈరోడ్డు కోసం మీ ఎమ్మెల్యే వెంటాడారు. ఆయన ప్రోద్భలంతో ఈ రోడ్డును ప్రభుత్వం మంజూరు చేసింది. ఇక్కడి ప్రజల షాపులు, ఇళ్లకు ఇబ్బంది లేకుండా కలెక్టర్, రెవిన్యూ అధికారులు ఆమోదయోగ్యమైన పరిష్కారం చూపుతారు. అభివృద్ధి కార్యక్రమాలు మళ్లీమళ్లీ రావు, ప్రజలంతా సహకరించండి. ఎన్ టిపిసి గ్రీన్, ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్కు మీ ప్రాంతానికి వస్తున్నాయి. వీటివల్లపెద్దఎత్తున నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు లభిస్తాయి. ఎంపిగా సిఎం రమేష్, ఎమ్మెల్యేగా సుందరపు విజయకుమార్ ను అఖండ మెజారిటీతో గెలిపించారు. ఆనాడు ప్రధాని మోడీ ఎన్నిసీట్లు వస్తాయని అడిగితే 22 గెలుస్తామని చెప్పా. ప్రమాణ స్వీకారం సమయంలో ప్రధాని వద్దకు వెళ్లి ఒకటి తక్కువ వచ్చినందుకు క్షమాపణలు కోరాను.అయిదేళ్లలో అనకాపల్లి, యలమంచిలి రూపురేఖలు మారుస్తాం,రాష్ట్రాన్ని కలిసికట్టుగా అభివృద్ధి చేద్దామని ప్రధాని మోడీ భుజం తట్టారు. గత పాలకులు రాష్ట్రాన్ని అప్పుల కుప్ప చేస్తే, కూటమి ప్రభుత్వం వచ్చాక దక్షిణ భారతంలో లేనివిధంగా అభివృద్ధి చేస్తున్నాం. అయిదేళ్లలో అనకాపల్లి, యలమంచిలి ప్రాంత రూపురేఖలు మార్చే బాధ్యత ఎన్ డిఎ ప్రభుత్వం తీసుకుంటుంది. టిడిపి, కూటమి కార్యకర్తలు కసితో ప్రజలకోసం అహర్నిశలు కష్టపడాలి. ప్రతినెలా 1వతేదీన ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పెన్షన్ ఇవ్వాలి. గ్రామాల్లో సమస్యలను ఎంపి, ఎమ్మెల్యేలకు తెలియజేసి పరిష్కరించాలని కూటమి కార్యకర్తలను కోరుతున్నా. గత అయిదేళ్లలో ప్రజలపై అడ్డగోలుగా కేసులు పెట్టారు. బాబుగారి ఇంటి గేటుకు తాళ్లుకట్టారు. ఆయన రామతీర్థం వెళ్లేందుకు విశాఖ ఎయిర్ పోర్టుకు వస్తే వెళ్లకుండా ఎస్పీనే టిప్పర్లు అడ్డుపెట్టారు. అలాంటి పరిస్థితుల్లో రాష్ట్ర ప్రయోజనాలకోసం మనం కలసికట్టుగా పోరాడాం. చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేస్తే కలసి పోరాడదాం, సైకో ప్రభుత్వాన్ని ఇంటికి పంపుదామని పవనన్న చెప్పారు. ఈ కార్యక్రమంలో శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు వంగలపూడి అనిత, కొల్లు రవీంద్ర, ఎంపి సిఎం రమేష్, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, టిడిపి ఇన్ చార్జి ప్రగడ నాగేశ్వరరావు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ తాతయ్యబాబు తదితరులు పాల్గొన్నారు.



# వంగలపూడి లో ఘనంగా రంజాన్ వేడుకలు





**సీతానగరం, పెన్ పవర్, మార్చి31:**సీతానగరం మండలంలోని వంగలపూడి గ్రామంలో నూర్ ముబారక్ మసీదులో అంతర్జాతీయ అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ఆధ్వర్యంలో ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మసీదు గురువు మహమ్మద్ అక్బర్ ప్రసంగిస్తూ, రంజాన్ పండుగ ప్రతి ముస్లిం ముప్పై రోజులు కఠిన ఉపవాస వ్రతాన్ని పాటించి, సంతోషంతో జరుపుకునే పవిత్ర వేడుక అని తెల్పుతూ, ఈద్ పండుగకు ఉన్న విశిష్టతను వివరిస్తూ, పరస్పర ప్రేమ, సామరస్యాన్ని పెంపొందించే సందేశాన్ని ఇచ్చారు. అదేవిధంగా మానవాళిని దేవునితో అనుసంధానం చేయడం, పరస్పర హక్కులను గౌరవించడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈద్ సందర్భంగా పేదలకు దానం చేసే ఫిత్రానా దానధర్మాల యొక్క ప్రాముఖ్యతను గుర్తుచేశారు. అహ్మదీయ ముస్లిం కమ్యూనిటీ ప్రస్తుత ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఇచ్చిన సందేశాన్ని తెలియజేస్తూ, ఈద్ అంటే కేవలం ఉత్సవం మాత్రమే కాకుండా, తోటి మానవుల పట్ల ప్రేమ, కరుణ, సహాయ సహకారాలకు ప్రతీక అని తెలిపారు. ఈ వేడుకల్లో గ్రామ ముస్లిలందరూ పాల్గొని ప్రపంచ శాంతిని కోరుతూ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు, సామూహిక ప్రార్ధన అనంతరం పరస్పరం ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపుకున్నారు. అనంతరం గ్రామస్తులకు సేమియా పాయసం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మసీదు అధ్యక్షులు షేక్ ఖాసిం ఫరూక్, షేక్ నాగూర్ సాహెబ్, షేక్ అహ్మద్ అలీ ఉద్దీన్, షేక్ లాల్ సాహెబ్, షేక్ నబి సాహెబ్, గాలిబ్ సాహెబ్, షేక్ దాదాసాహెబ్ షేక్ షేక్ తాజుద్దీన్, షేక్ మస్తాన్ గాంధీ కాసిం సాహెబ్ సుర సాహెబ్ పిల్లలు పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు,

## పర్యావరణానికి,శారీరక ఆరోగ్యానికి దోహదం చేసేది పూర్వీకుల తాటి విసనకర్ర

● ప్రముఖ నటులు గౌతమ్ రాజు, జోగి నాయుడు





**ఆత్రేయపురం పెన్ పవర్ మార్చి 31:** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలి అనూస్ హోమ్ వద్ద సోమ వారం రావులపాలెం సామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ అండ్ రిహాబిలిటేషన్ సెంటర్ ఆధ్వర్యంలో తాటి ఆకుల విసినికర్రలు పంపిణీ కార్యక్రమాన్ని ప్రముఖ సినీ నటులు గౌతమ్ రాజు, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాటి ఆకుల విసిన కర్ర ల వాడకం వల్ల పర్యావరణ పరిరక్షణతో పాటు శారీరక ఆరోగ్యాన్ని, విద్యుత్ ఆదా చేసుకోవచ్చు అని అంతే కాకుండా కొంతమందికి జీవనోపాధిని కూడా కల్పించవచ్చునని కాబట్టి ఈ వేసవి తాపాన్ని తట్టుకోవడానికి పూర్వీకుల తాటి విసిన కర్రలను అందరూ ఉపయోగించాలని కోరుకుంటూ వీటిని పంపిణీ చేస్తున్న నిర్వాహకులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రముఖ సినీ నటులు గౌతమ్ రాజు, జోగి నాయుడు, నెల్లూరు హరిబాబు, జైపూర్ రాంబాబు, పెద్దింటి రామం, సిద్ధాంతి సత్తిబాబు, మేస్త్రి నాగు, ఆత్మకూరు కాశి, శేషయ్య, లండన్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ మోహిత్ సీత, డాక్టర్ సూర్య చంద్ర రావు,శ్యామ్, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ డిగ్రీ పూర్తి చేసి ముందుకు అడుగులు వేస్తున్న యువత

● మండలానికి మంచి పేరు తెచ్చిన ఎం.వెరీహన విష్ణు ప్రియాంక



**వి.ఆర్.పురం పెన్.పవర్.మార్చి31:**ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో వ్యవసాయ అనుబంధ విభాగాల్లో పాలిటెక్నిక్ డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు ఇటీవల 45 రోజులుగా నిర్వహిస్తున్న అగ్రి క్లినిక్స్ అండ్ అగ్రిబి సీనెస్ పై ఏర్పాటు చేసిన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ద్వారా సర్టిఫికెట్ పొందిన వారిలో మండలంలోని చింతరేగుపల్లి గ్రామానికి చెందిన ముత్యాల మోహన విష్ణు ప్రియాంక ధృవీకరణ పత్రం పొందారు.యువత ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా వ్యవసాయ రంగం వైపు అడుగులు వేయాలని వ్యవసాయ ఆధారిత ఆహార అనుబంధ ఉత్పత్తులు తయారు చేసే పరిశ్రమలు నెల కోల్పోవడం ద్వారా పారిశ్రామిక వెత్తాలుగా ఎదగాలని విద్యా విజ్ఞాన అగ్రికల్చర్ యూనివర్సిటీ(గుంటూరు )ఎలీఫ్ ఇండియా వారి ఎంటర్ ప్రేన్యూర్ షిప్ డెవలప్మెంట్ ( సిఈడి ) ఆధ్వర్యంలో ఆత్కూరు స్వర్ణ భారత్ ట్రస్ట్ లో వ్యవసాయ అనుబంధ విభాగాల్లో పాలిటెక్నిక్ డిగ్రీ పూర్తి చేసి ముందు కు అడుగులు వేస్తున్న యువత,వి.ఆర్.పురం మండల వాసులు సోమవారం మన మండలానికి పేరు తెచ్చిన ఎం.వెరీహన విష్ణు ప్రియాంక,ను అభినందించారు.

## చింతలూరు నూకాలమ్మను దర్శించుకున్న సినీ గాయని శ్రీలలిత



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 31:**చింతలూరు నూకాంబిక అమ్మవారిని సోమవారం ప్రముఖ సినీ గాయని శ్రీ లలిత కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. నేపథ్య గాయనిగా ప్రస్థానాన్ని ప్రారంభించిన అనంతరం ఆమె గతంలో చింతలూరు నూకాంబికా అమ్మవారి ఆలయంలో కచేరి నిర్వహించారు. ఆ సందర్భాన్ని గుర్తు చేసుకున్నారు. అమ్మవారి ఆశీస్సుల కోసం వచ్చినట్లు తెలిపారు. దర్శనం అనంతరం శ్రీ లలిత అమ్మవారిపై భక్తియుతంగా చక్కని కీర్తన ఆలపించారు. శ్రీ లలిత, సీతారాం కేసరి దంపతులను ఈవో ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావు దేవస్థాన మర్యాదలతో గౌరవించారు. కార్యక్రమంలో గుడిపాటి శ్రీరామచంద్ర దత్తు,లక్ష్మీ గణేష్ , చింతలూరు ఫణీంద్రకుమార్, ద్విభాష్యం దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన గండి పోచమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలు....





### ఆలయ అధికారి లక్ష్మీ కుమార్...



**దేవీపట్నం,పెన్ పవర్,మార్చి31:**మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం గొందూరు గ్రామంలో వెలసిన మాతృశ్రీ గండి పోచమ్మ ఆలయం వద్ద జాతర మహోత్సవాలు ఆలయ అధికారి లక్ష్మీ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఆలయ అధికారి లక్ష్మీ కుమార్ మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో చుట్టూ గోదావరి, ఎత్తైన కొండలు పచ్చని పంట పొలాల మధ్య వెలసిన మాతృశ్రీ గండి పోచమ్మ ఆలయం వద్ద ప్రతి సంవత్సరం జాతర మహోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని,ఈ జాతర ఐదు రోజులు పాటు జరుగుతాయని,రాష్ట్రం నలుమూలల నుండి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుంటారని అన్నారు. ఈ ఐదు రోజులపాటు విశేషమైన పూజలు నిర్వహించి,పలు రకాల పుష్పాలతో అమ్మవారిని అర్చకులు అలంకరించి ముస్తాబు చేస్తారని అన్నారు.గరగ నృత్యాలు,డప్పు వాయిద్యాలు,విష్ణు సహస్రనామాలు,లలిత సహస్రనామాలు నిర్వహించడం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో దేవీపట్నం మండల అధ్యక్షుడు మరిశేట్ల వెంకటేశ్వరరావు(బుజ్జిబాబు), దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి,గ్రామస్తులు,భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# డి.రామవరం రోడ్డు శంకుస్థాపన....



**అడ్డతీగల,పెన్ పవర్, మార్చి31:** అడ్డతీగల మండలం డి.రామవరం నుంచి వీరంపాలెం గ్రామం వరకు 3.2 కీ.లో రోడ్డు కు 2.47 కోట్ల రూపాయలతో చేపడుతున్న తారు రోడ్డు పనులకు, రంపచోడవరం నియోజకవర్గ ఎమ్మెల్యే మిరియాల.శిరీష విజయభాస్కర్ దంపతులు కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ, రాష్ట్రం ప్రగతి పథంలో నడవాలన్నా ప్రతి పల్లె అభివృద్ధి చెందాలన్నా ముఖ్యమంత్రి చంద్రబాబు తోనే సాధ్యమని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది కాలంలోనే రాష్ట్రం ప్రగతి పదం పై నడుస్తుందని, ఇక ముమ్ముందు రంపచోడవరం నియోజకవర్గం లో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూటమి ప్రభుత్వానికి కొత్త పనులను గుర్తించి నివేదికలు అందజేస్తున్నాం అన్నారు. అనుమతులు రాగానే మరింతగా అభివృద్ధి పదంలో నియోజకవర్గం నడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. డి రామవరం గ్రామంలో పార్టీ కార్యకర్తలు వెంకటరమణ, ఎస్ నాగమణి కుటుంబాలకు ఎమ్మెల్యే దంపతులు పరామర్శించారు.

ఈ కార్యక్రమంలో నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షులు మఠం. విజయభాస్కర్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు జర్తా. వెంకటరమణారెడ్డి, బిజెపి జిల్లా కార్యదర్శి స్వప్న కుమారి, బిజెపి పార్టీ ప్రెసిడెంట్ రాజబాబు, తెలుగుదేశం నాయకులు బాలయోగి, జనసేన నాయకులు రాజేంద్ర, స్థానిక సర్పంచ్, ఎన్డీఏ కూటమి పార్టీల నాయకులు కార్యకర్తలు అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## పల్లె అందాలు అమోఘం. సురుచి లో గాయని శ్రీలలిత సందడి.



**మండపేట. పెన్ పవర్. మార్చ్ 31:**పల్లె అందాలు అద్భుతం గా ఉన్నాయని ప్రముఖ గాయని శ్రీ లలిత పేర్కొన్నారు. మండపేట మండలం తాపేశ్వరం సురుచి ఫుడ్స్ ను సందర్శించారు. 6 సంవత్సరాల వయస్సు నుండి సినిమా లో పాడుతూ, తన గాన ప్రతిభను చాటుకుంటున్నారు. శ్రీలలిత సరిగమపద, పాడుతా తీయగా, సూపర్ సింగర్స్, బోల్ బేబీ బోల్ స్వరాభిషేకం వంటి అనేక ప్రజాదరణ పొందిన టెలివిజన్ రియాలిటీ షోలలో తన మధుర గానంతో ప్రేక్షకులను అలరించారు. ఆమె తన సొంత యూట్యూబ్ ఛానెల్ ద్వారా కూడా అనేక పాటలను పాడుతూ, సంగీత ప్రియులను ఆకట్టుకుంటున్నారు.

ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి తాపేశ్వరం వచ్చిన గాయని శ్రీలలిత, సురుచి ని సందర్శించారు. సురుచి అధినేత పోలిశెట్టి మల్లిబాబు ఆమెకు స్వాగతం పలికి తాపేశ్వరం కాజా ప్రత్యేకతను దాని చరిత్రను వివరించారు. తాపేశ్వరం కాజా అంటే తనకు చాలా ఇష్టమని, దాని రుచి అద్భుతంగా ఉందని ఆమె తన ఆనందాన్ని వ్యక్తం చేశారు.

మల్లిబాబు ఆమెను బాహుబలి కాజాతో సత్కరించారు. అనంతరం శ్రీలలిత స్టాఫ్ తో కాసేపు ముచ్చటించగా సురుచి స్టాఫ్ ఆమెతో సెల్ఫీలు తీసుకున్నారు.

# మడికి అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్ సమయాలు మార్పు

### ఉదయం 5 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు

### ఏప్రిల్ 1 నుంచి అమలు

**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 31:**ఆలమూరు మండలం మడికి నాలుగు లైన్ల జాతీయ రహదారి చెంతనున్న అంతరాష్ట్ర కూరగాయల మార్కెట్ వేళలను మార్పు చేసినట్లు ఆ మార్కెట్ కమిటీ అధ్యక్షులు పాలూరి సత్తిబాబు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఉదయం 5 గంటల నుంచి ఈ మార్కెట్లో కొనుగోలు అమ్మకాలు జరుగుతాయి. అలాగే మధ్యాహ్నం ఒంటిగంట నుంచి తిరిగి మార్కెట్ ప్రారంభం అవుతుంది. రోజుకు రెండు సార్లు ఈ మార్కెట్ నిర్వహించబడుతుంది.ఈ మారిన వేళలు ఏప్రిల్ 1వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని సత్తిబాబు తెలిపారు. ఈ వేళలు పాటించకుండా రైతులు లేదా వ్యాపారాలు మార్కెట్లో అమ్మకాలు, కొనుగోలు చేస్తే రూ.2 వేలు జరిమానా విధిస్తున్నట్లు వారు హెచ్చరించారు. ఇప్పటివరకు ఈ మార్కెట్లో వేలాపాల లేకపోవడం వల్ల అటు రైతులకు ఇటు కొనుగోలుదారులకు సమన్వయం కుదరక ఇరువురికి నష్టం వాటిల్లుతుంది. ఈ విషయాన్ని గుర్తించిన మార్కెట్ కమిటీ వారు ఈ నిర్ణయాన్ని తీసుకున్నారు.ఈ మార్కెట్ కు ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కూరగాయలను రైతులు తీసుకొస్తారు. అలాగే వీటికి కొనే వ్యాపారస్తులు కూడా వివిధ జిల్లాలు, దూర ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. ఖచ్చితమైన సమయాలు ఇప్పటివరకు పాటించకపోవడం వల్ల రైతుల ఎప్పుడు కూరగాయలు తేవాలో కొనుగోలుదారులు ఎప్పుడు రావాలో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. అందుకనే ఈ సమయాలను నిర్ణయించామని ఆ సమయాల్లోనే అమ్మకాలు కొనుగోలు జరుగుతాయని మార్కెట్ కమిటీ అధ్యక్షులు సత్తిబాబు వివరించారు.దూర ప్రాంతాల నుంచి వచ్చే రైతులు, వ్యాపారస్తులు ఈ మారిన వేళలను గుర్తించాలని ఆయన సూచించారు.



## రంజాన్ సందర్భంగా కాంగ్రెస్ నేత ఆపన్న హస్తం



**ప్రత్తిపాడు, పెన్ పవర్, మార్చి 31 :**ప్రత్తిపాడు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రంజాన్ పండుగ సందర్భంగా పిసిసి సభ్యులు ధర్నాలకోట శ్రీను పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. నిరుపేద ముస్లిం కుటుంబాలకు బియ్యం, కూరగాయలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాకు తోచిన సాయాన్ని నేను చేయగలిగే సాయాన్ని చేస్తునాన్నని, ప్రతి ఒక్కరూ కష్టాల్లో ఉన్న వారికి ఎవరికీ తోచిన రీతిలో వారు సాయన్న అందించడం ద్వారా నిరుపేదలకు చేయూత నిచ్చినవారు అవుతారని అన్నారు.

## అడపా భరత్ కు అభినందనలు తెలిపిన టిడిపి నాయకులు



**గోకవరం,పెన్ పవర్, మార్చి 31 :** జగ్గంపేట మార్కెట్ యార్డ్ చైర్మన్ గా నియమింపబడిన గోకవరం మండలం కామరాజుపేట గ్రామానికి చెందిన అడపా భరత్ కుమార్ ను మండల టిడిపి నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాకప్పి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్యకర్తల కష్టాన్ని గుర్తించే ఏకైక పార్టీ తెలుగుదేశం పార్టీయేనని, బడుగు బలహీన వర్గాల వారికి , మధ్యతరగతి ప్రజలకు అవకాశాలు కల్పించేది చంద్రబాబునాయుడు ప్రభుత్వమని అన్నారు . టిడిపి పార్టీకి భరత్ కుమార్ చేసిన సేవలను గుర్తించి మార్కెట్ యార్డ్ చైర్మన్ గా ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆదేశాల మేరకు నియమించడం జరిగింది అన్నారు. ఈ కార్యక్రమంలో గోకవరం టౌన్ ఉపాధ్యక్షులు పాలాడి శ్రీనివాసరావు , మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు మోర్తా చిట్టి బాబు , ఎస్సీ సెల్ టౌన్ కన్వీనర్ మోటపర్తి ఆనంద్ వరసాల యేసు చీకట్ల సత్యానందం
సామంతుల పాపారావు లంకా పెద వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు



**కుక్కునూరు,పెన్ పవర్,మార్చి 31** :మండల కేంద్రంలోని రంజాన్ పర్వదిన వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు,సోదరీమణులు, పిల్లలు,పెద్దలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈద్గా లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. ఒకరికినొకరు ఆలింగనం చేసుకొని రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం పలువురు పేదలకు ఆర్థిక సహాయం చేసారు. నెల రోజుల ఉపవాసదీక్ష అనంతరం మొదలయ్యే షవ్వాల్ నెల ఆరంభమైన మొదటి రోజున జరుపుకునే పండుగే ఈద్ ఉల్ ఫితర్ అని నమాజ్ చదివించిన ఇమామ్ లు తారిక్ అన్వర్,నయీమ్ లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మదీనా మస్జిద్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా,వైస్ ప్రెసిడెంట్ ఖాదర్ బాబా,ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

## వైసిపి బలోపేతానికి తమ వంతు కృషి చేయాలి.

-ప్రత్తిపాడు నియోజకవర్గం వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు.



**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి31:** నియోజకవర్గంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గం ఆర్టిఐ అధ్యక్షులుగా నియమితులైన రామిశెట్టి దొరబాబు, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షులుగా నియమితులైన పలివెల నాగేంద్ర లు వైసిపి కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు ను, కిర్లంపూడి ముద్రగడ స్వగృహంలో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా పార్టీ పదవుల పొందిన నాయకులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా గిరిబాబు మాట్లాడుతూ పార్టీ శ్రేణులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేయడమే కాకుండా, నియోజకవర్గంలో పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రతిపాడు నియోజకవర్గంలోని పలువురు వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

# నవ సమాజ అభివృద్ధి లో భాగస్వాములు కావాలి..






● నారాయణ రెడ్డి దంపతుల సన్మానం సభ లో ఎమ్మెల్యే...

**అనపర్తి,పెన్ పవర్,మార్చి 31**
సమాజ సేవ చేయాలనే కాంక్షతో గ్రామభివృద్ధికి విశేష సేవలు అందిస్తున్న ద్వారంపూడి నారాయణరెడ్డి అభినందనీయులని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణరెడ్డి కొనియాడారు. శారదా సంగీత కళానికేతన్ ఆధ్వర్యంలో పొలమూరు లో ఉగాది సందర్భంగా ప్రముఖ వ్యాపారావేత్త ద్వారం పూడి నారాయణరెడ్డి మాణిక్యం దంపతులకు జరిగిన సన్మాన కార్యక్రమాలు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. జన్మించిన గ్రామ అభివృద్ధి కి అన్ని విధాలా సహాయం అందిస్తూ, సామాజిక సేవ కార్యక్రమాలు ద్వారా నారాయణరెడ్డి ఎందరికో స్ఫూర్తి గా నిలుస్తున్నారని రామకృష్ణారెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరూ సమాజ సేవ లో భాగస్వాములు కావాలని అయన కోరారు. సబ్ రిజిస్ట్రార్ తమలంపూడి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యాపారవేత్తలు సబ్బెళ్ళ అమ్మిరెడ్డి, సత్తి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, సేవ చేయాలనే తపన తో నారాయణ రెడ్డి చేస్తున్న కృషి స్ఫూర్తిదయాకమన్నారు. గ్రామాభివృద్ధి, ఆధ్యాత్మిక, సమాజ సేవ రంగాల్లో నారాయణరెడ్డి ఎన్నో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని వారు కొనియాడారు. అనంతరం నారాయణరెడ్డి దంపతులను అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి దంపతులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ అల్లూరి సీతారామరాజు స్మారక కళావేదిక అధ్యక్షులు కర్రి అచ్యుత రామారెడ్డి, తెలుగుదేశం పార్టీ గ్రామ అధ్యక్షులు ద్వారంపూడి ఈశ్వర్ రెడ్డి, తూర్పుగోదావరి జిల్లా సాంస్కృతిక విభాగం అధ్యక్షులు సత్తి దేవానంద రెడ్డి(బాబా), పొలమూరు హై స్కూల్ విద్యా కమిటీ చైర్మన్ వాసంశెట్టి నాగేశ్వరరావు, పూర్వపు ఎంపీటీసీ కొవ్వూరు వెంకటరెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు సత్తి సత్యనారాయణ రెడ్డి, తెలుగుదేశం పార్టీ మండల బీసీ సెల్ అధ్యక్షులు నీలం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

**ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకతను చాటిన "బంధాల బరువెంత"...**

మానవ సంబంధాలకు విలువ లేకుండా పోతున్న నేటి రోజుల్లో ఉమ్మడి కుటుంబాల ఆవశ్యకతను చాటి చెబుతూ సందేశాత్మకంగా సాగిన బంధాల బరువెంత నాటిక అధ్యంతం ఆకట్టుకుంది.
పొలమూరు డి ఎన్ ఆర్ గ్రౌండ్స్ లో శ్రీ శారదా కళానికేతన్ ఆధ్వర్యంలో సాంఘిక నాటిక ప్రదర్శన నిర్వహించారు. గ్రామానికి చెందిన సీనియర్ కళాకారుడు తాడి సుబ్బారెడ్డి దర్శకత్వం లో చెలికాని వెంకట్రావు రచించిన ఈ నాటిక లో పాత్రధారులు తమ నటనతో అహుతులను రంజింపజేశారు..
ముఖ్యంగా పార్వతీశం పాత్రలో సుబ్బారెడ్డి నటన నాటికకి మరింత వన్నె తెచ్చింది. ఉమ్మడి కుటుంబంలో కొడుకులు, కోడళ్ళు, మనవలు తో ఆప్యాయంగా జీవించే ఒక ఉమ్మడి కుటుంబంలో చిన్న కోడలు ప్రవర్తన కారణంగా వారు కుటుంబాన్ని వీడి నగరానికి వెళ్లిపోవడం తో నాటిక ఆరంభమవుతుంది. ఈ క్రమంలో తండ్రికి అనారోగ్యం కలగడం, వ్యవసాయం లో నష్టాలు రావడం తో పెద్ద కొడుకు అన్ని విధాలా ఇబ్బందులు పడుతున్నా, నగరంలో ఉన్న
చిన్న కోడలు ఏ విధంగా సహాయం చేయకుండా మానవత్వం చూపకపోవడం వంటి సన్నివేశాలు కన్నీళ్లు పెట్టిస్తాయి. తమ్ముడు కష్టాల్లో ఉన్నాడని మరదలు చెప్పిన మాటలకు పొలం అమ్మి డబ్బులు సాయం చేసే అన్నయ్య, చిన్న కోడలు ప్రవర్తన చూసి బాధ పడి ఆమెకు బుద్ధి చెప్పే పాత్రలో ఆమె తండ్రి చేసిన ప్రయత్నం అందరూ కలిసి ఉండటం వల్ల మానవీయ బంధాలు మరింత బలపడతాయని సందేశాన్ని అందించింది నాటిక..
పార్వతీశం పాత్రలో తాడి సుబ్బారెడ్డి, పార్ధసారధిగా చేవలి శ్రీనివాస్, జనార్దన్ గా కే. రామారెడ్డి, రైతుగా పి. శ్రీనివాసరావు, శివరావు గా సత్తిబాబు,సీతగా టి. శ్రీలేఖ, పావని గా ఎస్, సుజాత రెడ్డి తమ పాత్రలకు జీవం పోశారు. ప్రదర్శనను సొసైటీ మాజీ ఛైర్మెన్ సత్తి వీర రాఘవరెడ్డి, మల్లిడి నాగిరెడ్డి పర్యవేక్షించగా, తాడి శ్రీనివాస్ రెడ్డి, తాడి నాగిరెడ్డి, తాడి సత్యనారాయణ రెడ్డి, నల్లమిల్లి కొండబాబు సహకారం అందించారు. అనంతరం కళాకారులను ఘనంగా సత్కరించారు.

# కిర్లంపూడిలో ఘనంగా రంజాన్ వేడుకలు







**-ముద్రగడ ఇంట ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు.**

**కిర్లంపూడి, పెన్ పవర్, మార్చి:31:** మండల కేంద్రమైన కిర్లంపూడి మదీనా జామియా మసీద్ లో ముస్లిం సోదరులు రంజాన్ వేడుకలను సోమవారం అత్యంత ఘనంగా నిర్వహించుకున్నారు. రంజాన్ వేడుకలను పురస్కరించుకొని మండలంలోని ముస్లిం సోదరులు కిర్లంపూడి మదీనా జామియా మసీదుకు చేరుకుని భక్తిశ్రద్ధలతో నమాజ్ ప్రక్రియను పూర్తి చేసుకున్నారు. ముస్లిం మత గురువు సంషుల్ హుక్ రంజాన్ మాసం ప్రత్యేకతను వివరించడమే కాకుండా, ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ముస్లిం సోదరులు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం స్వగృహానికి చేరుకుని ఆయన నివాసములో ముద్రగడ కుటుంబం ఆరోగ్యం కోసం, ఆయన కుమారుడు ముద్రగడ గిరిబాబు రాజకీయ అభివృద్ధి కోసం ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ముద్రగడ పద్మనాభం మాట్లాడుతూ సర్వ మానవ సమానత్వానికి, మతసామరస్యానికి, కరుణకు, దాతృత్వానికి రంజాన్ పండుగ ఎంతగానో దోహదపడుతుందన్నారు. రంజాన్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదరులకు మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభంతో పాటు, ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కన్వీనర్ ముద్రగడ గిరిబాబు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసారు. అనంతరం ముద్రగడ ఏర్పాటుచేసిన అల్పాహార విందును ముస్లిం సోదరులు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం ముస్లిం సోదరులపై చూపిస్తున్న ఆదరణ, ఆప్యాయత ఎప్పటికి మరువలేనిదన్నారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరులు ముద్రగడకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మసీద్ కమిటీ ప్రెసిడెంట్,మహమ్మద్ షాబుద్దీన్, ముస్లిం పెద్దలు మహమ్మద్ ఖయ్యూం భాషా ఎస్ కె కాలేషా, హైదరాబాద్ షరీఫ్ సాబ్, ఇబ్రహీం (ఐ జి ),బషీర్, ఎస్ కె ఖాజా,పలువురు కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ వేడుకలు



ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ముస్లిం సోదరులు



**టి నర్సాపురం, పెన్ పవర్, మార్చ్31:** ఉగాది-రంజాన్ సందర్భంగా
ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న టీనర్సాపురం. మండల కేంద్రంలో భక్తి శ్రద్ధలతో ముస్లిం సోదరులు వారి కుటుంబ సభ్యులతో కలిసి ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. పెద్ద ఎత్తున స్థానిక ముస్లింలు స్థానిక మసీదులో ప్రత్యేక ప్రార్థనలో నిమగ్నమయ్యారు. ముప్పయి రోజుల కఠోర రోజా ఉపవాస దీక్షల అనంతరం షవ్వాల్ నెల ప్రారంభం తొలి రోజున ఆదివారం రాత్రి ఆకాశంలో నెలవంక దర్శనంతో సోమవారం రోజున ఈద్-ఉల్-ఫితర్ రంజాన్ వేడుకలు జరుపుకున్నారు. మండుటెండలు సైతం లెక్కచేయక సహరి- ఇఫ్తార్ లతో నెల రోజులపాటు దీక్షలు కొనసాగించిన ముస్లింలు ఈద్-ఉల్-ఫితర్ ఆధ్యాత్మిక ఉత్సవంలో చిన్న పెద్ద తేడా లేకుండా కుటుంబ సభ్యులందరూ ఎంతో ఉత్సాహంగా హాజరయ్యారు .
ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనల్లో మసీదు ఇస్లాం మత ప్రబోధకులు ముంతాజ్ అన్సారీ, హఫీజ్ నదీమ్ రంజాన్ పండుగ ప్రత్యేకతను ముస్లింలకు బోధించారు. పేదవాడి ఆకలిని గుర్తించి ఫిత్రా, జకాత్ లతో పేదలకు దానధర్మాలు చేయాల్సిన బాధ్యతను మహమ్మద్ ప్రవక్త ప్రవచనాలను ముస్లింల బాధ్యతలను ప్రత్యేకించి పరమత సహనాన్ని ఈ సందర్భంగా తమ సందేశంలో వారు ముస్లింలకు గుర్తు చేసి వివరించారు. పరస్పరం ముస్లిం సోదరులు అలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు హృదయపూర్వకముగా తెలుపుకున్నారు. అనంతరం స్థానిక ఖబరస్తాన్ చేరుకుని అమరులకు శ్రద్ధాంజలి ఘటించారు. రంజాన్ సందర్భంగా నూతన వస్త్రాలతో అత్తరు-సెంటు సువాసనలతో ముస్తాబైన ముస్లిం సోదరులు రంజాన్ స్పెషల్ ప్రత్యేక వంటకం సేమియా (ఖీర్ ఖుర్మా) బంధువులతో హిందూ మరియు క్రైస్తవ మిత్రులతో కలిసి విందు ఆరగించారు. ఆదివారం ఉగాది సోమవారం రంజాన్ సందర్భంగా టి నరసాపురం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో మత పెద్దలు షేక్ అబ్బాస్, షేక్ షరీఫ్, సామాజిక కార్యకర్త యస్ డి నా సర్ పాషా, మస్తాన్,షేక్ అబూబకర్, షేక్ లాలు,సయ్యద్ మీర్ సాహెబ్ (గులాబీ), ఖాదర్, సయీద్,షేక్ కరీముల్లా, ఉస్మాన్ సాహెబ్, నవాబ్, షమ్మీకపూర్,షేక్ వజీర్,షేక్ యాసిన్, సయ్యద్ అమానుల్లా, అబ్దుల్లా, ఇషా వలి, షేక్ రహీం, ఉమర్,హేర్షద్ బాబు, హుమాయున్, అమీర్ జానీ, బాబి, మౌలానా, బహుదూర్, బ్యాటరీషరీఫ్,మీరావలి,నిజాం ,మొహమ్మద్ అలీ, రషీద్,అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా బడే వెంకటకృష్ణ జన్మదిన వేడుకలు





- నిరంతర ప్రజా సేవకుడు బడే వెంకటకృష్ణ
- రాష్ట్ర సివిల్ సప్లైస్ చైర్మన్ తోట సుధీర్

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 31:**ప్రతి ఏటా తన జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకుంటూ ప్రజా సేవా కార్యక్రమాలు చేపడుతున్న జనసేన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి బడే వెంకటకృష్ణ అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తారని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక జగన్నాధపురం 17 వ డివిజన్ లో జనసేన పార్టీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సంయుక్త కార్యదర్శి బడే వేంకట కృష్ణ జన్మదిన వేడుకల్లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్ని ఉచిత వైద్య శిబిరాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక సేవ, ప్రజా సేవా సిద్ధాంత లక్ష్యాయాలతో ముందుకు సాగుతున్న జనసేన పార్టీకి బడే వేంకట కృష్ణ లాంటి నిస్వార్ధ సేవకుడు నాయకుడిగా లభించడం వల్ల పార్టీకి మరింత లబ్ది చేకూరుతుందని పేర్కొన్నారు. ఈ జన్మదిన వేడుకల్లో నగరంలో ప్రసిద్ధి చెందిన ఆసుపత్రుల నుండి వైద్య బృందం పాల్గొని ఉచితంగా పేదలకు అన్నీ రకాల ఆరోగ్య పరమైన పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేయడం జరిగిందని చైర్మన్ సుదీర్ పేర్కొన్నారు. అలాగే ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ నారాయణ రావు, తెలుగు దేశం పార్టీ యువ నాయకులు వనమాడి ఉమాశంకర్, సూపర్ బజారు చైర్మన్ పెస్సంగి ఆదినారాయణ, కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. డాక్టర్ చిట్ల కిరణ్ ఈ ఉచిత వైద్య శిబిరాలను పర్యవేక్షణ చేసారు.

## మెగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్, మార్చి 31:**పట్టణంలో నిర్వహించే మెగా క్రికెట్ టోర్నమెంటును జనసేన నాయకులు బొలిశెట్టి రాజేష్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన బొలిశెట్టి రాజేష్ మాట్లా డుతూ క్రీడాకారులకు, శుభాకాంక్షలు తెలిపారు. టోర్నమెంట్ నిర్వహిస్తున్న చిన్న, కరీం, సలాంతో పాటు వారికి సపోర్ట్ చేస్తున్న వారికి అభినందనలు తెలిపారు. పిల్లలకు తల్లిదండ్రులు చిన్ననాటి నుంచి ఆటలు నేర్పించడం వల్ల వారి శరీరం ధృఢంగా ఉంటుందన్నారు. దేశానికి మంచి పౌరులుగా తీర్చిదిద్దే పిల్లలను పెంచాలని ఇటువంటి ఆటల పోటీలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ మెండుగా ఉంటాయని రాజేష్ తెలిపారు.

## సాలా గ్రామ శివలింగం ప్రతిష్ట





**గంగవరం, పెన్ పవర్, మార్చి 31 :** శ్రీశ్రీశ్రీ బాల త్రిపుర సుందరి సమేత ముకేశ్వర శివలింగం ప్రతిష్టను సోమవారం భక్తుల ఆధ్వర్యంలో వెదురు నగరంలో ప్రతిష్టించడం జరిగిందని సాయిరాం గురూజీ తెలిపారు.

శ్రీ శివ సాయి భువనేశ్వరి ఆశ్రమంలో నేపాల్ లోని గండకీ నదిలో లభించిన సాలగ్రామ శివలింగం ప్రతిష్టించడం జరిగిందని తెలిపారు. శివలింగం ప్రతిష్టాపనకు ముందుగా హెూమం నిర్వహించడం జరిగిందన్నారు. నేపాల్ దేశంలో గండకీ నదిలో సాలగ్రామ శివలింగం లభ్యమైందని, వెదురు నగరం గ్రామంలో ప్రతిష్టించడం జరిగిందని తెలిపారు. శివలింగం ప్రతిష్టాపన అనంతరం భక్తులకు అన్నదాన సంతర్పణ చేయడం జరిగిందని తెలిపారు.

# నర్సిపూడి - సంధిపూడి ఆర్ అండ్ బి రోడ్డుకు మహార్ధశ

- రెండు పొరల రోడ్డు నిర్మాణానికి రూ.5 కోట్లు
- ఎమ్మెల్యే బండారు సత్యానందరావు



**ఆలమూరు, పెన్ పవర్, మార్చి 31:**కొత్తపేట నియోజవర్గం ఆలమూరు మండలం నర్సిపూడి నుండి సంధిపూడి వరకు గల ఆర్ అండ్ బి రోడ్ కు మహర్ధశ రానుంది. అధ్వానంగా ఉన్న ఈ రోడ్డు ను పునః నిర్మించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రభుత్వానికి నివేదించడంతో ఐదు కోట్ల రూపాయలు మంజూరు చేశారు. కడియం-వెదురుమూడి రోడ్లులో గల 10 వ నెంబరు కిలోమీటరు రాయి(నర్సిపూడి) నుంచి 23.880 కిలోమీటరు రాయి(సంధిపూడి) వరకూ అంటే 13.88 కిలోమీటర్ల దూరంలో రెండు పొరలతో బిటి రోడ్డు నిర్మాణం చేపడతారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే నర్సిపూడి గ్రామస్తులతో పాటు నవాబుపేట, పెనికేరు, కలవచర్ల,కొత్తూరు సెంటర్, చింతలూరు, పెద్దపల్ల,పినపళ్ళ, సంధిపూడి గ్రామాల ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉంటుంది. అంతేగాక కొత్తపేట, మండపేట, రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గాల ప్రయాణికులకు కూడా ఎంతో అనువుగా మారనుంది.త్వరలోనే ఈ రోడ్డు నిర్మాణానికి టెండర్లు పూర్తి చేసి పనులు మొదలు పెడతారని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్థానిక విలేకరులకు తెలిపారు.

## భక్తి శ్రద్ధలతో రంజాన్ పర్వదినం

పాల్గొన్న నగర ఎమ్మెల్యే వనమాడి





**కాకినాడ.పెన్ పవర్ మార్చి 31 :**ముస్లింల పవిత్ర పండుగ అయిన రంజాన్ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాకినాడ ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ ప్రత్యేక నమాజ్ కార్యక్రమానికి కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. సోమవారం ఉదయం జరిగిన ఈ నమాజ్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు పాల్గొని ముస్లిం సోదరులకు రంజాన్ శు భాకాంక్షలు తెలియజేశారు.ముస్లింలందరికీ మంచి జరగాలని కాకినాడ స్మార్ట్ సిటీ ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు (కొండబాబు) ఆకాంక్షించారు. సోమవారం కాకినాడ ఈద్గా మైదానంలో జరిగిన నమాజ్ లో పాల్గొన్న కొండబాబు అనంతరం మీడియాతో మాట్లాడుతూ ముస్లింల సమస్యలను అల్లా తీరుస్తాడు అన్నారు. ముస్లిం సోదరులు కోరిన కోర్కెలను అల్లా నెరవేర్చాలని ఆకాంక్షించారు.

## మత విద్వేషాలను విడనాడుదాం శాంతియుతంగా జీవిద్దాం





- కాకినాడ క్రైస్తవ సమాజం
- పాస్టర్ ప్రవీణ్ మరణానికి సంఘీభావంగా శాంతి యుత ర్యాలీ

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 31 :**ప్రముఖ సువార్తికులు, క్రీస్తు ప్రేమ ప్రబోధకులు బ్రదర్ ప్రవీణ్ పగడాల మృతికి సంతాపంగా కాకినాడ క్రైస్తవ సమాజం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం కాకినాడ భానుగుడి జంక్షన్ నుంచి కొండయ్య పాలెం ముత్తా గోపాలకృష్ణ వారిది మీదుగా కలెక్టర్ కార్యాలయానికి "శాంతి ర్యాలీ" చేసారు.ఈ సందర్భంగా సివైఎఫ్ అడ్వైజర్ బిషప్ రెడ్డి జ్యోతి కుమార్, సి.వై.ఎఫ్ మూర్తి రాజు,బిషప్ జోసఫ్ బెన్ని మాట్లాడుతూ "ప్రతీకారం వద్దు - ప్రేమ తత్వమే ముద్దు"అని మృతుని కుటుంబానికి ధైర్యం కోసం, సమాజానికి రక్షణ కోసం, శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పౌర సంక్షేమ సంఘం అధ్యక్షులు దూసర్లపూడి రమణ రాజు, సిపిఎం నాయకులు పలివెల వీరబాబు, శేష బాబ్జీ సంఘీభావం ప్రకటించారు.ఈ కార్యక్రమంలో నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు మోసా అబ్రహం, పరిమి ఐజాక్, కె. జాన్ ప్రసాద్, ఎస్.సామ్యూల్, దొమ్మేటి సాగర్, కె మోజెస్ కుమార్, ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్ నాయకులు రిక్కీ గూటం, సిటీ పాస్టర్స్ ఫెలోషిప్ కార్యవర్గం పాల్గొన్నారు.

# ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత.





-సప్తాహ మహెూత్సవ కార్యక్రమంలో ముద్రగడ గిరిబాబు.

**కిర్లంపూడి, పెన్ పవర్ మార్చి 31:** ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత చేకూరుతుందని ప్రత్తిపాడు నియోజకవర్గం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు.సోమవారం కిర్లంపూడి మండలం చిల్లంగి, జగపతినగరం గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆయా గ్రామాల రామాలయాల్లో ఏడు రోజులపాటు ఏర్పాటు చేసిన సప్తాహ మహెూత్సవ కార్యక్రమంలో ముద్రగడ గిరిబాబు పాల్గొన్నారు.చిల్లంగి రామాలయంలోను జగపతినగరం కొండయ్యపేట శ్రీ పట్టాభి సీతారామయ్య రామాలయంలోను గిరిబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా ముద్రగడ గిరిబాబు మాట్లాడుతూ ఆ భగవంతుడు ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, ఒక్కరూ సుఖ సంతోషాలతో గడపాలని కోరారు. ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగంగా రామాలయాల్లో ఏడు రోజులపాటు సప్తాహ మహెూత్సవ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న కమిటీ సభ్యులను, గ్రామస్తులను గిరిబాబు ఈ సందర్భంగా అభినందించారు. ఈ సందర్భంగా పలువురు రామాలయ కమిటీ పెద్దలు మాట్లాడుతూ కిర్లంపూడి, జగపతినగరం,చిల్లంగి గ్రామాల్లో తమ తండ్రి, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం రామాలయాల అభివృద్ధికి చేసిన కృషి మరువలేనిదని గిరిబాబుకి వివరించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ సర్పంచ్ పెంటకోట నాగబాబు,రాపేటి పెద్ద, కాళ్ళ వెంకటేష్, దాడి రాఘవ, శరకణం శ్రీను,మళ్ల నాగు, దుర్గ శ్రీను,ఆయా రామాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు చెల్లూరు ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు.

పంచాంగ వితరణ

**కాకినాడ.పెన్ పవర్ మార్చి 31 :**స్థానిక సూర్యనారాయణపురం 27వ వార్డు కాపుల వీధిలో భారతీయ జనతా పార్టీ ఇన్చార్జి, కాకినాడ రూరల్ అర్బన్ విశ్వబ్రాహ్మణ సంక్షేమ సంఘం అధ్యక్షుడు చెల్లూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో విశ్వా వసు నామ సంవత్సర ఉగాది పంచాంగ శ్రవణం, పంచాంగ వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాజపా జిల్లా అధ్యక్షుల బిక్కిన విశ్వేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైందవ సనాతన ధర్మంప్రజలంతా పాటించాలని, హిందూమతంలో ఉన్నటువంటి ధర్మం ఏ మతంలోనూ లేదన్నారు. ఇటువంటి సాంప్రదాయ పంచాంగ శ్రవణం కార్యక్రమం కేవలం దేవాలయాలలో మాత్రమే చేసే కార్యక్రమమని అయితే చెల్లూరిసత్యనారాయణ ప్రజలకు అందరికీ అందుబాటులో ఉండే విధంగా పంచాంగ శ్రవణం ద్వారా వారి భూత,వర్తమాన భవిష్యత్తుని వివరించే విధంగా బృహత్తర కార్యక్రమం వార్డులో ప్రజల మధ్య నిర్వహించడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమం నిర్వాహకుడు చెల్లూరు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నిర్వహించే పంచాంగ శ్రవణం, పంచాంగ వితరణ చేస్తున్నానని తమ విశ్వబ్రాహ్మణ వేద పండితులచే రాయబడిన పంచాంగం విశ్వబ్రాహ్మణ జాతి పంచ వృత్తులే కాకుండా వేదం కూడా మాదేనని ఉనికిని తెలియజేసే విధంగాయావత్ సృష్టికి మూలకారుడు విశ్వకర్మనేని ఈ సందర్భంగా తెలియజేశారు.భారతీయ జనతా పార్టీ సిటీ కన్వీనర్ గట్టి సత్యనారాయణ , ముత్త నవీన్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులుఎనిమిరెడ్డి మాలకొండయ్య , ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సివిల్ సప్లై డైరెక్టర్ తుమ్మల పద్మజా , సీనియర్ న్యాయవాది పెండెం శ్రీదేవి, దేవాదాయ ధర్మాదాయ శాఖ డిప్యూటీ స్థపతి గోరస శ్రీనివాసచార్యులు, తెలుగుదేశం 27వ వార్డు ఇన్చార్జి కోడూరి కుమార స్వామి ( పెద్ద),28వ వార్డు తెలుగుదేశం ఇన్చార్జ్ రెడ్నం సత్తిబాబు, 29వ వార్డు తెలుగుదేశం ఇన్చార్జి అమ్మలకంటి బలరాం తెలుగుదేశం యూత్ ప్రెసిడెంట్ చింతలపూడి రవి, గొన్నాబత్తుల ఫణీంద్ర, జనసేన అబ్బాయి , ఆవుపాటి ఉమా శంకర్, అత్తిలి వీరబ్రహ్మం , విజయలక్ష్మి , బందరు మిఠాయి నెహ్రూ , మాకిరెడ్డి భాస్కర్ గణేష్ , చెక్కా రమేష్ , వీరేంద్ర , భారతీయ జనతా పార్టీ నాయకులు, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, ఈ కార్యక్రమం విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి చిరు సత్కారం చేసి సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పంచాంగ వితరణ చేశారు.



## ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరం.

-జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జి తుమ్మలపల్లి రమేష్.





**కిర్లంపూడి,పెన్ పవర్ మార్చి 31:** ప్రతి ఒక్కరికి ఆధ్యాత్మిక చింతన ఎంతో అవసరమని, ఆధ్యాత్మిక చింతనతోనే ఎంతో ప్రశాంతత చేకూరుతుందని జగ్గంపేట నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్చార్జ్ తుమ్మలపల్లి రమేష్ అన్నారు. శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా కిర్లంపూడి మండలం చిల్లంగి రామాలయంలో నిర్వహిస్తున్న పంచమ సప్తాహ భజన కార్యక్రమానికి జగపతినగరం కొండయ్యపేట శ్రీపట్టాభి సీతారామయ్య రామాలయంలో నిర్వహిస్తున్న సప్తాహ మహెూత్సవ కార్యక్రమానికి తుమ్మలపల్లి రమేష్ హాజరయ్యారు. ఆయా కార్యక్రమంలో ఆయన వెంట మాదారపు వీరబాబు, ఎల్లపు దొరబాబు, దాడి చిన్న బుజ్జి, గంధం ప్రభాకర్, చిక్కాల భగవాను,బొండా నందిబాబు, పాలెం బాబి, బొండా రమణ, నాగబోయిన శివ, కొట్టేటి గణేష్,బొడ్డేటి రాజు,కాళ్ళ వెంకటేష్, కాళ్ళ తాతీలు తదితరులు పాల్గొన్నారు.

## వ్యభిచార రాకెట్ పై ఈడీ గురి

**లక్నో, మార్చి 31, పెన్ పవర్ :** ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన ఉజ్వల్ కిషోర్, అతని భార్య నీలు శ్రీవాస్తవ.. ఏకంగా వ్యభిచార రాకెట్ నడుపుతూ అడ్డంగా బుక్కయ్యారు. గత ఐదేళ్లుగా గుట్టుచప్పుడు కాకుండా.. తమ నివాసంలోనే ఈ దందాను నిర్వహిస్తున్న ఉజ్వల్ కిషోర్ జంట బాగోతాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్(ఈడీ) అధికారులు బహిర్గతం చేశారు. అసభ్యకర వీడియోలను ప్రసారం చేస్తూ డబ్బులు సంపాదిస్తున్న దంపతులను నోయిడా పోలీసులు అరెస్ట్ చేశారు.దేశ రాజధాని ఢిల్లీ శివారు నోయిడాలో మార్కెటింగ్, అడ్వర్‌టైజింగ్ రీసెర్చ్ పేరుతో తప్పుడు వివరాలను సృష్టించి డబ్బులను విదేశీ కంపెనీలకు తరలిస్తున్నారన్న సమాచారంతో ఈడీ అధికారులు.. దంపతుల నివాసంలో దాడులు చేశారు. దాంతో.. సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. సైప్రస్ దేశానికి చెందిన టెక్నియస్ లిమిటెడ్ అనే సంస్థతో ఈ జంటకు సంబంధాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. అడల్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ వెబ్‌సైట్‌లను నిర్వహిస్తున్నట్లు తేల్చారు. ఈడీ దాడుల్లో 15.66 కోట్ల రూపాయల అక్రమ విదేశీ నిధులను స్వాధీనం చేసుకున్నారు.ఇక.. ఈ జంట ఇచాటో డాట్ కమ్) పేరుతో ఒక పేజీని సృష్టించి, ఆకర్షణీయమైన జీతాలు ఇస్తామనే ప్రకటనలతో యువతులను అట్రాక్ట్ చేసి మోసం చేస్తున్నట్లు గుర్తించారు. ఢిల్లీ-ఎన్‌సిఆర్ ప్రాంతానికి చెందిన చాలామంది మహిళలు ఇలాంటి యాడ్స్‌తోనే ఆకర్షితులయ్యారని.. వారికి నెలకు లక్ష నుండి 2 లక్షల రూపాయల వరకు ఇస్తామని ఆశ చూపి వ్యభిచార కూపంలోకి దింపారని ఈడీ అధికారులు వెల్లడించారు. దాడి సమయంలో అక్కడే ఉన్న ముగ్గురు మహిళల నుంచి ఈడీ స్టేట్ మెంట్ రికార్డ్ చేసింది. ఈ దందా ద్వారా సంపాదించిన ఆదాయంలో 75 శాతం ఉంచుకుని.. 25 శాతం మాత్రమే మోడల్స్‌కు ఇస్తూ గుట్టుచప్పుడు కాకుండా దందా నడుపుతున్నారని ఈడీ అధికారులు తెలిపారు. ఈ రాకెట్ దందాలో వేలాదిమంది మహిళలు చిక్కుకుని ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు సంబంధించి ఈడీ అధికారులు పూర్తి స్థాయి దర్యాప్తు చేపట్టారు.

## నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టిన బురిడీ కొట్టిస్తున్న పొట్టి కళ్యాణ్

**మేడ్చల్ పెన్ పవర్:** మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ పరిధి గీత నగర్ రాఘవేంద్ర థియేటర్ ఎదురుగా ఉన్న జైన్ జువెలరీ షాపు యజమా అరవింద్ దగ్గర పొట్టి కళ్యాణ్ నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టి 18లక్షల రూపాయలు తీసుకున్నాడు. షాపు యజమాని ఆ బంగారాన్ని తీసుకొని ఫెడరల్ బ్యాంకు వెళ్లి ఆ బంగారాన్ని అక్కడ తాకట్టు పెట్టగా బ్యాంక్ సిబ్బంది బంగారాన్ని చూసి ఇది నకిలీ బంగారమని తేల్చేసారు. నేను మోసపోయానని షాపు యమజామని మల్కాజిగిరి పోలీస్ స్టేషన్ వెళ్లి ఆ వ్యక్తిపై ఫిర్యాదు చేసాడు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మదనపల్లెలో భక్తిశ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**మదనపల్లె పెన్ పవర్:** పవిత్ర రంజాన్ పండుగను మదనపల్లెలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పట్టణ,రూరల్లోని ఈద్గాలవద్దకు సోమవారం ఉదయం7.30కే వెళ్లారు. నెల రోజులు ఉపవాస దీక్షలుచేపట్టిన ముస్లింలు, నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ పండుగను వాడవాడలా జరుపుకుంటున్నారు. పట్టణంలోని ముస్లింలు బెంగళూరుబస్టాండ్ నుంచి, వేలాదిమంది అల్లా హుఅక్బర్ అంటూ బెంగుళూరు రోడ్డులోని నక్కలదిన్నె ఈద్గాకు చేరుకుని ఆలింగనం చేసుకుని ప్రార్థనలు చేశారు..

## విశాఖలో ఐసిసి ఛైర్మన్ పర్యటన

**విశాఖపట్నం పెన్ పవర్:** విశాఖ అంతర్జాతీయ క్రికెట్ స్టేడి యంలో ఐసీసీ ఛైర్మన్ జైషాతో కలిసి ఢిల్లీ-హైదరాబాద్ మ్యాచ్ మంత్రి లోకేశ్ వీక్షించారు. అంతకు ముందు క్రికెట్ స్టేడియానికి చేరు కున్న మంత్రి లోకేశ్, ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీలకు ఆంధ్ర క్రికెట్ అసోసియే షన్ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని, ఇతర సభ్యులు ఘనస్వాగతం పలికారు. ఈ క్రమంలో మంత్రి లోకేశ్ను ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని చిన్ని శాలువాతో సత్కరించి మొమెంటో బహూకరిం చారు. అనంతరం రాష్ట్రంలో అంత ర్జాతీయ క్రికెట్ స్టేడియం ఏర్పాటుపై జైషాతో మంత్రి లోకేశ్ చర్చలు జరిపారు. స్టేడియం పునరుద్ధరణ, ఆధునీకరణను పురస్కరించుకుని ఐసీసీ ఛైర్మన్ జైషా, బీసీసీఐ ప్రెసిడెంట్ రోజర్ బిన్నీ, ఏసీఏ ప్రెసిడెంట్ కేశినేని చిన్నితో కలిసి మంత్రి లోకశ్ శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి రామ్మోహన్, డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు, ఎంపీ శ్రీ భరత్, మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మాజీ క్రికెటర్ చాముండేశ్వరినాథ్, బీసీసీఐ వైస్ ప్రెసిడెంట్ రాజీవ్ శుక్లా, భారత మహిళా క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్, ఏసీఏ సెక్రటరీ సానా సతీష్, ట్రెజరర్ దండమూడి శ్రీనివాస్, ఇతర ఏసీఈ అపెక్స్ మెంబర్స్ పాల్గొన్నారు.

## తిరుమలలో తగ్గని భక్తుల రద్దీ

తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతుంది. సోమవారం అయినప్పటికీ భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు వస్తున్నారు. వరస సెలవులు రావడంతో భక్తులు అధిక సంఖ్యలో తిరుమలకు చేరుకుంటున్నట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. ఉగాది, రంజాన్ తో పాటు వరస సెలవులతో భక్తులు శ్రీవారి దర్శనం కోసం తిరుమలలో బారులు తీరారు. తమ మొక్కులు తీర్చుకునేందుకు ఇతర రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి ఏడుకొండల వాడిని దర్శించుకుంటున్నారని టీటీడీ అధికారులు తెలిపారు. వరస సెలవులతో పాటు ఈ నెలలో పెళ్లిళ్ల సీజన్ కూడా ఉండటం కూడా తిరుమలలో భక్తులు రద్దీ పెరగడానికి ఒక కారణమని చెబుతున్నారు. అందుకే ఎక్కడ చూసినా భక్తులతో తిరుమల వీధులన్నీ కిటకిటలాడిపోతున్నాయి. తలనీలాలను సమర్పించే కేంద్రాలు కూడా రద్దీగా ఉన్నాయి. ఇక లడ్డూ కేంద్రాల వద్ద కూడా అధిక శాతం మంది భక్తులు ఉండటంతో క్యూ కౌంటర్లను పెంచాల్సి వచ్చిందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. అలాగే అన్నదానం సత్రం వద్ద కూడా అదే రద్దీ కొనసాగుతుంది. తిరుమలోని వైకుంఠం క్యూ కాంప్లెక్స్ లోని 31 కంపార్ట్ మెంట్లలో భక్తులు శ్రీవారి దర్శనం కోసం వేచి ఉన్నారు. ఉచిత దర్శనం క్యూ లైన్ లోకి ఉదయం ఏడున్నర గంటలకు టోకెన్లు లేకుండా ప్రవేశించిన భక్తులకు శ్రీవారి దర్శనం పద్దెనిమిది గంటల సమయం పడుతుందని తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు తెలిపారు. టైమ్ స్లాట్ దర్శనానికి ఆరు గంటల సమయం పడుతుంది. మూడు వందల రూపాయల ప్రత్యేక దర్శనం టిక్కెట్లు కొనుగోలు చేసిన భక్తులకు శ్రీవారి దర్శనం మూడు గంటలకు పైగానే పడుతుంది. నిన్న తిరుమల శ్రీవారిని 62,263 మంది భక్తులు దర్శించుకున్నారు. వీరిలో 25,733 మంది భక్తులు తమ తలనీలాలను సమర్పించుకున్నారు. నిన్న తిరుమల శ్రీవారి హుండీ ఆదాయం 3.65 కోట్ల రూపాయలు వచ్చిందని అధికారులు తెలిపారు.

# దువ్వాడపై చర్యలేవీ... కేడర్ లో అసంతృప్తి జ్వాలలు

**శ్రీకాకుళం, మార్చి 31, పెన్ పవర్:** ఇటీవల కాలంలో వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారం మరింత ముదిరిపోయింది. ఆమధ్య ఆయన ఏదో ఊరూపేరూ లేని యూనివర్శిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. అది కూడా తన స్నేహితురాలు మాధురితో కలసి. ఆ తర్వాత ఉగాది పురస్కారాలు అంటూ దువ్వాడ-మాధురి స్టేజ్ మీదే దండలు మార్చుకున్నారు. తాజాగా విద్యుత్ శాఖ ఏఈపై దువ్వాడ బూతులతో విరుచుకుపడ్డారు. ఇవన్నీ చూస్తున్నా ఇంకా దువ్వాడ విషయంలో జగన్ నోరు మెదప లేదు, కనీసం పార్టీ క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోవడం లేదు. భార్యని వదిలిపెట్టి, ప్రియురాలితో పబ్లిక్ గా తిరుగుతున్న దువ్వాడ ఏపీ పెద్దల సభలో తమ పార్టీ సభ్యుడు అని చెప్పుకోడానికి కూడా వైసీపీకి పరువు తక్కువే.రాజకీయ నాయకులైనంత మాత్రాన కుటుంబ కలహాలు ఉండకూడదు అనుకోలేం. ఆ మాటకొస్తే వివాహాల విషయంలో కూడా ఎవరి వ్యక్తిగత నిర్ణయాన్ని ఇంకెవరూ తప్పుబట్టడానికి లేదు. అయితే దానికి కూడా ఓ పద్ధతుంటుంది. రెండో వివాహం చేసుకోవాలంటే మొదటి భార్యకు విడాకులు ఇవ్వాలనేది చట్టం. కానీ ఆచట్టాన్ని పక్కనపెట్టి, భార్యని వదిలిపెట్టి, ఎంచక్కా ప్రియురాలితో చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్. ఈమధ్య వీరి జోరు బాగా ఎక్కువైంది. మీడియా వీరిద్దర్నీ హైలైట్ చేయడంతో దువ్వాడ ఏమాత్రం వెనక్కి తగ్గడంలేదు. మాధురి జంటగా ఆయన కెమెరాలముందు ఇస్తున్న ఫోజులు వైరల్ గా మారుతున్నాయి.కూతురు వయసున్న మహిళతో దువ్వాడ సాన్నిహిత్యం ఎంతవరకు కరెక్ట్..? ఆ విషయం తెలిసినా కూడా ఆయన్ను వైసీపీ వెనకేసుకు రావడం ఇంకెంత వరకు కరెక్ట్. గతంలో పవన్ కల్యాణ్ వివాహాల గురించి తీవ్ర విమర్శలు చేసిన జగన్, దువ్వాడ కథపై మాత్రం నోరు మెదపడం లేదు. కనీసం ఆయనపై పార్టీ పరంగా క్రమశిక్షణ చర్యలు కూడా తీసుకోకపోవడం



విశేషం.దువ్వాడలో ప్రేమాయణం అనే యాంగిల్ మాత్రమే కాదు, బూతుల కోణం కూడా ఉంది. కరెంటు బిల్లు కట్టకుండా ఆపేసి, కనెక్షన్ తొలగించినందుకు ప్రభుత్వ అధికారిపై ఆయన దుర్భాషలాడిన ఆడియో ఇప్పుడు వైరల్ గా మారింది. ఈ ఆడియో బయటపడిన తర్వాత వైసీపీని జనం మరింతగా చీదరించుకుంటున్నారు. ఇలాంటి వారందర్నీ ఆ పార్టీలో జగన్ ఎందుకు ఇంకా ఎంటర్టైన్ చేస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.మూడు నెలలు విద్యుత్ బిల్లులు చెల్లించని దువ్వాడ, కనెక్షన్ తీసేసినందుకు ఏఈపై బూతులతో విరుచుకుపడ్డారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలి విద్యుత్ శాఖ ఏఈ మురళీమోహన్ కి ఫోన్ చేసి బూతులు తిట్టి బెదిరించారు. మురళీమోహన్ దళిత వర్గానికి చెందిన అధికారి కావడంతో ఆ సామాజిక వర్గం భగ్గుమంది. దళితులంటే అంత చులకనా అని వారు మండిపడ్డారు. కనీసం ఈ విషయంలో అయినా జగన్ స్పందించాలని, దళిత అధికారిని బూతులు తిట్టిన దువ్వాడపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.దువ్వాడ వ్యక్తిగత విషయాలను ఎవరూ పెద్దగా ప్రశ్నించకపోయినా, ఇప్పుడిలా అధికారులపై బూతుల దండకంతో విరుచుకుపడటం మాత్రం కచ్చితంగా ఖండించాల్సిన విషయమే. దువ్వాడ లాంటి నాయకుడు టీడీపీలో ఉంటే కచ్చితంగా వైసీపీ నుంచి కౌంటర్లు పడేవి, జగన్ కూడా ఏమాత్రం సందేహించకుండా విమర్శించేవారు. మరి అదే నాయకుడు వైసీపీలో ఉంటే మాత్రం ఆ పార్టీ నోరు మెదపడం లేదు.

# తమ్ముళ్లలో కొత్త ఉత్సాహం

**విజయవాడ, మార్చి 31, పెన్ పవర్**

ఆవిర్భావ దినోత్సవ వేళ.. పసుపు శ్రేణుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. కార్యకర్తల్లో ఒకడిని.. కార్యకర్తలకు ఒకడిని.. ఒక కార్యకర్తను అన్నట్లుగా.. చంద్రబాబు, లోకేశ్ ఇస్తున్న ధైర్యం.. ఆ ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తోంది. టీడీపీకి మూల బలం కార్యకర్తల అనడంలో ఎలాంటి అనుమానం లేదు. ఐతే అలాంటి కేడర్‌ను కాపాడుకుంటూ.. మరింత జోష్ నింపేలా టీడీపీ పెద్దలు తీసుకుంటున్న నిర్ణయాలు ఆసక్తికరంగా మారాయ్. టీడీపీది 43ఏళ్ల ప్రస్థానం.. సంక్షోభాలను అవకాశాలుగా మలచుకుని శక్తిమంతంగా మారిన ప్రాంతీయ పార్టీగా ఎదిగింది. 43ఏళ్ల ప్రస్థానంలో ఎన్నెన్నో ఆటుపోట్లు.. అయినా రాటుదేలి జాతీయ రాజకీయాల్లో కీలక శక్తిగా మారింది. జాతీయ రాజకీయాలను కూడా నడిపించే స్థాయికి ఎదిగింది. పార్టీ కోసం, నమ్మిన సిద్ధాంతం కోసం.. కష్టపడి పనిచేసే కరుడుకట్టిన కార్యకర్తలే ఈ బలానికికారణం అనడంలో ఎలాంటి అనుమానం లేదు.రాష్ట్ర విభజన తర్వాత ఏపీ పగ్గాలు అందుకున్న చంద్రబాబు.. అభివృద్ధి దిశగా మాత్రమే ఆలోచించడం మొదలుపెట్టారు. పార్టీని లైట్ తీసుకున్నారు. పార్టీ నేతలు చెప్పేది కూడా ఇదే ! దీనివల్లే గ్రౌండ్ లెవల్‌లో పార్టీ ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఐతే ఇప్పుడు ఆ పరిస్థితి రావొద్దని.. వచ్చే పరిస్థితి కూడా తీసుకురావద్దని.. టీడీపీ పెద్దలు స్ట్రాంగ్‌గా ఫిక్స్ అయినట్లు కనిపిస్తున్నారు. మీకోసం, మీవెంటే అన్నట్లుగా కార్యకర్తల మీద చంద్రబాబు, లోకేశ్ చేస్తున్న వ్యాఖ్యలు దీనికి అద్దం పడుతున్నాయ్తెలుగువారు ఉన్నంతవరకూ టీడీపీ శాశ్వతంగా ఉంటుందని.. పార్టీకి మనమంతా వారసులమే కానీ పెత్తందారులం కాదంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు.. కార్యకర్తల్లో కొత్త జోష్ నింపుతున్నాయ్. పార్టీనే ప్రాణంగా బతికే పసుపు సైన్యానికి.. చంద్రబాబు పాదాభివందనం తెలిపారు. కార్యకర్తలు హుషారుగా ఉంటే.. టీడీపీకి తిరుగేలేదని.. కార్యకర్తల్లో హుషారు తగ్గినప్పుడే విపక్షం పుంజుకునే ప్రయత్నం చేస్తుందంటూ కీలక సూచనలు చేశారు. ప్రతీ కార్యకర్తకు తప్పనిసరిగా గుర్తింపు ఇస్తామని.. ఆవిర్భావ దినోత్సవం వేదికగా హామీ ఇచ్చారు. జనాల చుట్టూ తిరిగే కార్యకర్తలకు, కార్యకర్తల చుట్టూ తిరిగే నాయకులకు పార్టీ అండగా ఉంటుందని ప్రామిస్ చేశారు.చంద్రబాబు కార్యకర్తల కోసం మాట్లాడుతుంటే.. లోకేశ్ కార్యకర్తల తరపున మాట్లాడుతున్నారనిపిస్తోంది. ఎన్ని కష్టాలు వచ్చినా ఎత్తిన జెండా దించకుండా నిల్చున్న పసుపు సైన్యానికి హ్యాట్సాఫ్ అన్న లోకేశ్.. నామినేషన్ పత్రాలు లాగేసుకుంటే తొడగొట్టి మీసం మెలేసిన అంజిరెడ్డి.. కత్తివేటు పడి రక్తం కారుతున్నా పోలింగ్ బూత్ వదలని మంజులారెడ్డి పేర్లను ప్రత్యేకంగా ప్రస్తావించారు. కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపే ప్రయత్నం చేశారు.కార్యకర్తల కోసం తాను బయట ఎంత పోరాడతానో.. పార్టీలోనూ అంతే పోరాడతానని లోకేష్ అన్నారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలు, నాయకులను గుర్తించడమే తన టార్గెట్ అంటూ కొత్త జోష్ ఇచ్చారు. త్వరలనే అన్ని నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తున్నామని చెప్పారు. ఇక రెడ్‌బుక్ గురించి ప్రస్తావించినప్పుడు కార్యకర్తల్లో కనిపించిన ఊపు అంతా ఇంతా కాదు. అధికారంలో ఉన్నామన్న గర్వం వద్దని.. అందరం కలిసి పనిచేద్దామని పిలుపునిచ్చారు.అటు చంద్రబాబు అయినా.. ఇటు లోకేశ్ అయినా.. కార్యకర్తల్లో కొత్త జోష్ నింపే ప్రయత్నం చేశారు. నిజానికి 2014లో అధికారంలోకి వచ్చినప్పుడు.. రాష్ట్ర అభివృద్ధి మీద మాత్రమే చంద్రబాబు ఫోకస్ పెట్టినట్లు కనిపించారు. కార్యకర్తల విషయంలో లైట్ తీసుకున్నట్లు అనిపించారు. దీంతో ఐదేళ్లు తిరిగేసరికి సీన్ రివర్స్ అయింది. ఐతే ఇప్పుడు మాత్రం అలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు.రాష్ట్రం బాధ్యత తాను చూసుకుంటూ.. పార్టీ బాధ్యతలు లోకేశ్‌కు అప్పగించారేమో అనిపిస్తోంది పరిస్థితి చూస్తుంటే! కార్యకర్తల కోసం పార్టీతోనూ పోరాడతానంటూ లోకేశ్ మాట్లాడిన మాటలు.. దీనికి నిదర్శనంగా కనిపిస్తున్నాయ్. ఏమైనా గత అనుభవం నేర్పిన పాఠంతో.. ఇప్పుడు ఆచీతూచీ అడుగులు వేస్తున్నట్లు కనిపిస్తున్నారు. ఇక అటు కార్యకర్తలకు ఉగాది గిఫ్ట్ కూడా టీడీపీ సిద్ధం చేసింది. ఇప్పటికే 47 మార్కెట్ కమిటీలకు ఛైర్మన్లను ప్రకటించింది. సభ్యులతో కలిపి త్వలో 705 నామినేటెడ్ పదవులు భర్తీ చేయబోతోంది. ఇలా కనిపెడుతున్నాం.. కాపాడుకుంటాం.. గుర్తిస్తాం.. గుండెల్లో పెట్టుకుంటాం అన్నట్లుగా కార్యకర్తలకు టీడీపీ పెద్దలు సందేశాలు పంపిస్తున్నట్లు అనిపిస్తుందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయ్.

# జగన్ వైపే... అందరి చూపు
# కనీసం సపోర్ట్ చేయని కేడర్

**విజయవాడ, మార్చి 31, పెన్ పవర్**

వైసీపీలో అంతర్గత ప్రజాస్వామ్యం మాత్రమే కాదు.. ఐక్యత కూడా కరువేనా అంటే ఔననే సమాధానమే వస్తోంది..కారణమేంటని చూస్తే అందరి చూపు జగన్ వేపే.. ఒక కాకికి దెబ్బ తగిలితే వంద కాకులు వచ్చి మూగుతాయ్. అవి మూగ జీవాలైనా ఐకమత్యంలో టాప్ ప్లేస్ లో నిలుస్తాయి. అలాంటి కాకి ఫార్ములా మన పార్టీ లో లేదు ఏం చేద్దాం.. ప్చ్.. అంటూ తెగ ఫీలవుతున్నారట.. ఫ్యాను పార్టీ లీడర్లు.చిన్నా చితకా.. సాదా సీదా.. చోటా మోటా లీడర్ల ఆవేదన అయితే పర్లేదనుకోవచ్చు. కానీ, పార్టీలో ఒక వెలుగు వెలిగి ప్రస్తుతం.. కేసులు, అరెస్టులు, జైళ్ల పాలై సతమతమవుతున్న వారు.. తీవ్ర నిరాశా నిస్పృహలు వ్యక్తం చేస్తున్నారట. అధికారంలో ఉన్నపుడు కాదు లేనప్పుడు.. అందరం ఒక్కటే అన్న ఐక్యతారాగం ఆలపించాలి. కానీ ఇక్కడ జరుగుతున్నదేంటి? నాపేరు బికారీ నా దారి ఎడారీ అన్న ఆరున్నొక్క రాగాలు ఆలపించాల్సి వస్తోందని వీరు వాపోతున్నారట.అధికారంలో ఉన్నపుడు.. తెగ హగ్గులూ షేక్ హ్యాండ్లు ఇచ్చుకున్న ఈ లీడర్లు.. ఇప్పుడు ఎడమొహం పెడమొహం పెట్టుకోవడం మాత్రమే కాదు.. ఒకరికొకరు అసలు గుర్తు పట్టనట్టే వ్యవహరిస్తున్నారట. అప్పట్లో ఒళ్లంతా నోరు చేసుకుని.. ప్రతిదానికీ రియాక్టయిన కొడాలి వంటి వారు కూడా.. ఇప్పుడు పిన్ డ్రాప్ సైలెన్స్ మెయిన్ టైన్ చేస్తున్నారట. ఊద్యోగం ఊడింది. ఉన్నా లేనట్టే ఉందాం అన్న ధోరణిలోకి జారుకుంటున్నారటఎంత మాత్రం కంట్రోల్లో లేదట. ఇలా నోరున్నోళ్లు కూడా భయపడి.. మౌన ముద్రలోకి వెళ్తుంటే.. ఇక సాదాసీదా లీడర్ల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న వినిపిస్తోందట. అది నీతో అవినీతో. కష్టమో నష్టమో.. మన వాళ్లకంటూ ఒక దెబ్బ తగిలితే.. దాన్ని ఖచ్చితంగా ఖండించాలి. అలా జరిగి ఉండదన్న కామెంట్లు చేయాలి. కానీ గతంలో క్లోజ్ గా మూవ్ అయిన వారు కూడా ఇప్పుడు అంటీ ముట్టనట్టు వ్యవరిస్తున్నారట.ప్రస్తుతం అందరిలోకీ.. విడదల రజనీ వ్యవహారమైతే అత్యంత దారుణంగానే ఉందట. ఎంత మాత్రం ఆశాజనకంగా లేదట. అది ఆమె స్వయంకృతాపరాధమే కావచ్చు. కానీ ఒకే పార్టీలో ఉన్నాం. ఆ మాత్రం ఒకరికొకరం కోపరేట్ చేసుకోకుంటే ఎలా? ఇలాగేనా పార్టీలో బిహేవ్ చేసేదంటూ.. ఏకంగా ఆమె అనుచరులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. కొందరైతే.. విజయసాయిరెడ్డి ఇందుకేగా పార్టీ పదవులు, సభ్యత్వం వదిలి వెళ్లిపోయిందంటూ.. ఆయన ఉదంతాన్ని ఉదహరిస్తున్నారట.ఏంటీ ఒంటరి పోరాటాలు.. మాకు మేము పోరాడుకోడానికేనా పార్టీలో చేరిందంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారట. మరలాంటప్పుడు మేం పార్టీలో ఉంటే ఏంటి లేకుంటే, ఏంటి? అని వీరు తీవ్ర ఆగ్రహం వెళ్లగక్కుతున్నారటమొన్న కాకాని వ్యవహారంలో కూడా ఇలాగే జరిగిందనీ చెప్పుకొస్తున్నారట. మాజీ మంత్రిపై ఎఫ్ఐఆర్ నమోదైతే.. జిల్లాలో ఒక్క నాయకుడు కూడా రియాక్ట్ కాలేదు. పార్టీలో ఒకరిపట్ల మరొకరికి ఎంత సఖ్యత ఉందో దీన్నిబట్టీ చెప్పొచ్చంటున్నారట.ఇది ఒక విడదల రజనీ, కాకాని గోవర్ధన రెడ్డి వంటి ఒకరిద్దరి వ్యవహారం కాదనీ.. బోరుగడ్డ అనిల్ కావచ్చు, నందిగం సురేష్ కావచ్చు.. పార్టీ కోసం అంతగా గొంతు చించుకుని పని చేసిన వారికి మిగిలిందేంటి? అరెస్టులు, కేసులు, జైలు పాలు కావడం తప్ప? అంటూ తీవ్ర ఆవేదనా పూరిత స్వరంతో తమ ఆక్రోశమంతా వెళ్లగక్కుతున్నారట.వంశీ అరెస్టు సమయంలో జగన్ జైలుకు రాలేదా? మరింకేం కావాలంటూ కొందరు వీరిని ప్రశ్నిస్తుంటే.. ఇక్కడే తమకు కాలుతుందోని అంటున్నారట. ఆయనొక్కరు వస్తే సరిపోతుందా? ఒకరి పట్ల మరొకరికి కేరింగ్ ఏదీ? అన్న కోణంలో తీవ్ర నిరాశగా వీరు ఎదురు ప్రశ్నిస్తున్నారటజగన్ తన పార్టీ లీడర్లలో ఒకరి మధ్య మరొకరికి యూనిటీ ఉండేలా.. పార్టీని తయారు చేయలేదని ఎలాంటి భయం బెరుకూ లేకుండానే ఓపెన్ స్టేట్మెంట్లు ఇస్తున్నారట. అంతర్గత ప్రజాస్వామ్యం అసలే లేదని బాధ పడుతున్నారట. పార్టీని తీర్చి దిద్దిన విధానంలోనే లోపముందని మాట్లాడుకుంటున్నారట.ఒక వేళ ఎవరైనా యాక్టివ్ లీడర్లు.. పార్టీకి ఏదైనా మేలు చేయాలని ముందుకేస్తే.. వీరిపై క్రమశిక్షణ ఉల్లంఘన చర్యలు చేపడతారన్న భయంతో నిమ్మకుండి పోతున్నారట. దీంతో తమకు ఎందుకొచ్చిన గొడవలెమ్మని చోద్యం చూస్తుండిపోతున్నారట. ఇదంతా అధినేత జగన్ పార్టీని రన్ చేసే పద్ధతిలోని అతి ప్రధాన లోపమనీ.. తాము ఏమీ చేయలేమని వీరిలో వీరు భావిస్తున్నారట.మరి దీనికి పరిష్కారమేంటని అధిష్టానానికి దగ్గరగా ఉన్నవారు వీరిని ప్రశ్నిస్తున్నారట. అధినేత జగన్ జనంలోకి వెళ్లడం కాదు.. ముందు తమతో విస్తృతంగా భేటీ అయ్యి.. మా మనోగతం ఏంటో అడిగి తెలుసుకోవాలని వీరు చెప్పుకొస్తున్నారట. జగన్ మీడియా ముందు ఒకటీ అరా కామెంట్ల ద్వారా కార్యకర్తలను సంతృప్తి పరచలేరనీ వీరు ఖరాకండిగా చెప్పేస్తున్నారట. సింగిల్ లైన్ కామెంట్లతో తమలో ఒక భరోసా రాదనీ వీరు కుండబద్ధలు కొడుతున్నారట. ఎప్పుడైతే అధినేత నుంచి ఒక ఇన్ స్పిరేషన్ దొరుకుతుందో.. ఆటోమేటిగ్గా.. ఒకరిలో మరొకరికి యూనిటీ పెరుగుతుందని వీరు అధినేతకే ఎదురు పాఠాలు చెబుతున్నారట.మొన్నటికి మొన్న విజయసాయిరెడ్డి చేసిన మెయిన్ కంప్లయింట్ ఇదేనని వీరు ఉదహరిస్తున్నారట. జగన్ చుట్టూ ఒక కోటరీ ఏర్పడిందనీ.. దీంతో సామాన్య కార్యకర్త నుంచి విడుదల రజనీ వంటి నేతల వరకూ కూడా వీరు అడ్డుగోడల్లా నిలుస్తున్నారనీ.. దీంతో పార్టీలో అనైక్యత నానాటికీ పెరిగిపోతుందని వీరు అంటున్నారట. దీంతో ఎవరికి వారే- ఎమునా తీరే అన్న చందంగా తయారైందనీ కామెంట్ చేస్తున్నారట. జగన్ కూడా మమ అనిపించేస్తూ.. నెట్టుకొస్తున్నారనీ.. ఈ మూడు ముక్కలాటతో తమలో యూనిటీ వచ్చే పరిస్థితే లేదని వీరు తెగేసి చెబుతున్నారట.గతంలో టీడీపీ లీడర్లు అరెస్టయినపుడు.. కేసులు ఎదుర్కొన్నపుడు.. ఆ పార్టీలోని ఎందరో లీడర్లు ముందుకొచ్చేవారు. దర్నాలు, నిరసనలు నిర్వహించేవారు. వైసీపీకి ఎదురు తిరిగి అందరూ కలసి ఏకతాటిపై నిలిచేవారు. ఫలితంగా పార్టీ బలం ఎపాటిదో అప్పట్లో అందరికీ తెలిసేది. అంతే కాదు పార్టీలో, ఐక్యత ఎంత మేరకు ఉందో స్పష్టమయ్యేది కావాలంటే గతం తరచి చూసుకోమంటున్నారట.ప్రస్తుతం వైసీపీలో విడుదల రజనీ, కాకాని గోవర్ధన్ రెడ్డి, వల్లభనేని వంశీ విషయంలో.. వారికి వారు చేసుకుంటున్న ఒంటరి పోరాటం తప్పించి.. తమ వెంట పార్టీ ఉందన్న భరోసా ఎంత మాత్రం కనిపించడం లేదని వాపోతున్నారట. మరిప్పుడేం చేయాలి? అంటే అందరి చూపు అధినేత జగన్ వైపే మళ్లుతోందట. మరి చూడాలి అధినేత జగన్.. దేవుడు, ప్రజలే నా బలం అని మాత్రమే కాకుండా.. నాయకులు, కార్యకర్తలే నా సైన్యమన్న ధోరణిలోకి ఎప్పుడస్తే అప్పుడే పార్టీ తిరిగి పూర్వవైభం సాధిస్తుందన్న కామెంట్లు చేస్తున్నారట. జగనన్నకొకసారి బలగం సినిమా చూపించాలి. కాకి ఫార్ములా తెలియచేయాలన్న సెటైర్లు విసురుతున్నారట.

# సీఎస్‌కేను దాటేసిన ఆర్‌సీబీ

**ఇన్‌స్టాలో అత్యధిక ఫాలోవర్లు కలిగిన ఫ్రాంచైజీగా బెంగళూరు**

**మొత్తంగా 17.8 మిలియన్ల ఫాలోవర్లతో అగ్రస్థానం**

**సీఎస్‌కేకు 17.7 మిలియన్ల ఫాలోవర్లు**

**16.2 మిలియన్ల ఫాలోవర్లతో మూడోస్థానంలో ముంబయి**





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో బడా ఫ్రాంచైజీలైన రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ), చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) ఫ్యాన్ ఫాలోయింగ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ రెండు జట్లకు ఉన్నంత డై హార్డ్ ఫ్యాన్స్ మరే ఇతర టీమ్‌లకు లేరంటే అతిశయోక్తి కాదు. ఈ రెండు జట్లు ఎక్కడ ఆడినా స్టేడియాలు అభిమానులతో నిండిపోవాల్సిందే. అటు సోషల్ మీడియాలోనూ ఆర్‌సీబీ, సీఎస్‌కేకు అదే స్థాయి ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అయితే, ఇప్పటివరకు ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధిక ఫాలోవర్లు కలిగిన చెన్నైను తాజాగా బెంగళూరు అధిగమించింది. మొత్తంగా 17.8 మిలియన్ల మంది ఫాలోవర్లతో తొలి స్థానానికి ఎగబాకింది. ఇప్పటివరకు సీఎస్‌కే 17.7 మిలియన్ల ఫాలోవర్లతో మొదటి స్థానంలో ఉండేది. ఇప్పుడు రెండో స్థానానికి పడిపోయింది. అటు ముంబయి ఇండియన్స్ (ఎంఐ) 16.2 మిలియన్ల ఫాలోవర్లతో మూడోస్థానంలో కొనసాగుతోంది.

కాగా, సీఎస్‌కే, ఎంఐ చెరో ఐదు సార్లు ఐపీఎల్ టైటిల్ గెలవగా ఆర్‌సీబీ ఇప్పటివరకు ఒక్క ట్రోఫీ కూడా గెలవలేదు. అయినా ఫాలోయింగ్‌లో మాత్రం అదరగొడుతోంది. బెంగళూరు 2009, 2011, 2016 సీజన్లలో ఫైనల్ వరకు వెళ్లి టైటిల్ చేజార్చుకుంది. అయితే, ఈ సీజన్‌లో ఆరంభం నుంచే ఆర్‌సీబీ అదరగొడుతోంది. ఈసారి ఆడిన రెండు మ్యాచ్‌లలోనూ విజయాలతో ప్రస్తుతం పాయింట్ల పట్టికలో టాప్‌లో ఉంది.

# రెండు గంటల పాటు చెన్నై ఇన్నింగ్స్.. పరాగ్‌కు భారీ జరిమానా!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ లో వరుసగా రెండో సారి స్లో ఓవర్ రేట్ నమోదయింది. ముంబైగా ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య తర్వాత రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ రియాన్ పరాగ్ స్లో ఓవర్ రేట్ కు గురయ్యాడు. గౌహతి వేదికగా వేదికగా ఆదివారం (మార్చి 30) చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా పరాగ్ కు రూ.12 లక్షల రూపాయల ఫైన్ వేశారు. దీంతో ఐపీఎల్ 2025 సీజన్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా జరిమానా ఎదుర్కొన్న రెండో కెప్టెన్ గా నిలిచాడు. ఛేజింగ్ చేస్తున్నప్పుడు చెన్నై సూపర్ ఇన్నింగ్స్ రెండు గంటల పాటు సాగింది. ఫీల్డింగ్ లో మార్పులు చేయడానికి పరాగ్ ఎక్కువగా సమయం తీసుకున్నాడు. దీంతో 90 నిమిషాల్లో ముగియాల్సిన ఇన్నింగ్స్ 120 నిమిషాలు పట్టింది. ఈ సీజన్ లో స్లో ఓవర్ రేట్ కారణంగా కెప్టెన్లకు జరిమానా విధించబడదు. అయితే కెప్టెన్లకు డీమెరిట్ పాయింట్లు ఇస్తారు. ఇవి మూడు సంవత్సరాల పాటు కొనసాగుతాయి. ఈ నిషేధం తీవ్రమైన సందర్భాల్లో మాత్రమే జరుగుతుంది. ఈ మ్యాచ్ లో ఈ మ్యాచ్ లో 37 పరుగులు చేసి బ్యాటింగ్ లో రాణించిన పరాగ్.. ఫీల్డింగ్ లోనూ కళ్ళు చెదిరే క్యాచ్ అందుకొని మ్యాచ్ స్వరూపాన్నే మార్చేశాడు. ఐపీఎల్ లో పరాగ్ కెప్టెన్ గా తొలి విజయాన్ని అందుకున్నాడు. ఆదివారం (మార్చి 30) గౌహతి వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ 6 పరుగుల తేడాతో విజయాన్ని సాధించింది. సంజు శాంసన్ స్థానంలో కెప్టెన్సీ చేస్తున్న అతను తొలి రెండు మ్యాచ్ ల్లో ఓటమి తర్వాత ఎట్టకేలకు విజయాన్ని అందుకున్నాడు.ప్రస్తుతం రాజస్థాన్ స్టాండింగ్ కెప్టెన్ గా ఉంటున్న పరాగ్.. తన తదుపరి మ్యాచ్ లో ఈ బాధ్యతల నుంచి తప్పుకోనున్నాడు. శనివారం (ఏప్రిల్ 5) పంజాబ్ కింగ్స్ తో జరగబోయే మ్యాచ్ కు సంజు శాంసన్ కెప్టెన్ గా కొనసాగనున్నాడు.

# ధోనీ 10 ఓవర్లపాటు బ్యాటింగ్ చేయలేడు.. అందుకే 9వ స్థానంలో బ్యాటింగ్



**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై సూపర్ కింగ్స్ మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ఒకప్పటిలా అభిమానులను అలరించలేకపోతున్నాడు. చివరి వరకు క్రీజ్ లో ఉన్నప్పటికీ జట్టును గెలిపించలేకపోతున్నాడు. గతంలో ధోనీ చివరి వరకు క్రీజ్ లో ఉంటే విజయం ఖాయం. అయితే ఇప్పుడు పరిస్థితులు మారాయి. మహేంద్రుడు మునుపటిలా బ్యాటింగ్ చేయలేకపోతున్నాడు. డెత్ ఓవర్స్ లో డాట్ బాల్స్ ఆడడం ఆశ్చర్యానికి గురి చేస్తుంది. దానికి తోడు ధోనీ బ్యాటింగ్ ఆర్డర్ లో ఎందుకు లోయర్ ఆర్డర్ లో వస్తున్నాడనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కెప్టెన్ కూల్ పై చెన్నై సూపర్ కింగ్స్ హెడ్ కోచ్ స్టీపెన్ ఫ్లెమింగ్ క్లారిటీ ఇచ్చాడు. ఆదివారం (మార్చి 30) గౌహతి వేదికగా రాజస్థాన్ రాయల్స్ తరపున చెన్నై సూపర్ కింగ్స్ 6 పరుగుల తేడాతో ఓడిపోయింది. ఈ మ్యాచ్ తర్వాత ధోనీ గురించి హెడ్ కోచ్ ఫ్లెమింగ్ మాట్లాడాడు. ధోనీ ఎందుకు బ్యాటింగ్ ఆర్డర్ లో 9వ స్థానంలో వచ్చాడనే దానిపై వివరణ ఇచ్చాడు. " ధోనీ 10 ఓవర్ల పాటు ఫుల్ స్టిక్ తో బ్యాటింగ్ చేయలేడు. మోకాలి గాయం అతన్ని ఇబ్బంది పెడుతుంది. ధోనీ ప్రస్తుతం బాగానే ఉన్నాడు. ఒకప్పటిలా అతని మోకాలు సహకరించడం లేదు. మ్యాచ్ పరిస్థితులను బట్టి అతను బ్యాటింగ్ కు వస్తాడు. జట్టు స్థితిని అంచనా వేసి తన బ్యాటింగ్ ఆర్డర్ ను మార్చుకుంటాడు". అని ఫ్లెమింగ్ అన్నాడు. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచ్ లో ధోనీ 9వ స్థానంలో బ్యాటింగ్ కు రావడం ఆశ్చర్యానికి గురి చేసింది. ధోనీ కొంచెం ముందుగా బ్యాటింగ్ ఆర్డర్ లో వచ్చి ఉంటే ఫలితం వేరేలా ఉండేదని చాలా మంది అభిప్రాయపడ్డారు. ఈ మ్యాచ్ లో అశ్విన్ కంటే వెనక బ్యాటింగ్ వచ్చిన ధోనీ 16 బంతుల్లో 30 పరుగులు చేశాడు. ఇక రాజస్థాన్ రాయల్స్ తో జరిగిన మ్యాచ్ లో 7 వ స్థానంలోనే బ్యాటింగ్ కు వచ్చాడు. 25 బంతుల్లో 52 పరుగులు చేయాల్సిన దశలో బ్యాటింగ్ కు వచ్చిన మహేంద్రుడు.. 11 బంతుల్లో 16 పరుగులు చేసి చివరి ఓవర్లో ఔటయ్యాడు. ధోనీ ఔట్ కావడంతో చెన్నై సూపర్ కింగ్స్ ఓటమి ఖరారైంది.

**పూజా హెగ్డే ఇన్‌స్టాగ్రామ్‌లో సొగసైన ఫ్యాషన్‌లో మెరిసింది**



# ఇక నితిన్ 'తమ్ముడు'.. ఏం చేస్తాడో?



స్టార్ హీరో నితిన్ వరుసగా చేసిన ప్రయోగాలు ఫలించకపోవడంతో బాక్సాఫీస్ వద్ద కాస్త వెనకబడినట్టు కనిపిస్తున్నారు. నితిన్ కెరీర్ లో ఫ్లాప్స్ కొత్తేమి కాదు. ఒక దశలో కెరీర్ ముగిసింది అనుకున్న టైమ్ లో ఒక్కసారిగా బౌన్స్ బ్యాక్ అయిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఈ రోజుల్లో పరిస్థితులు కాస్త భిన్నంగా ఉన్నాయి. ఆడియెన్స్ రెగ్యులర్ సినిమాలను పెద్దగా ఇష్టపడడం లేదనే సంకేతం నితిన్ ఇంకా ఎక్కించుకోలేదా అనే కామెంట్స్ కూడా వస్తున్నాయి.లేటెస్ట్ గా విడుదలైన 'రాబిన్ హుడ్' చిత్రం మంచి ప్రమోషన్, స్టార్లు గెస్ట్‌లా రావడం, యూత్ కంటెంట్ అన్నీ ఉన్నప్పటికీ థియేటర్లలో అసలైన ఎఫెక్ట్ చూపించలేకపోయింది. డైరెక్టర్ వెంకీ కుడుముల నుంచి మళ్ళీ హిట్ వస్తుందనుకున్న ప్రేక్షకుల్లోనూ అసంతృప్తి ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో నితిన్ తదుపరి ప్రాజెక్ట్‌పై ఫోకస్ మళ్లింది. ఇప్పుడు ఆయన చేస్తున్న 'తమ్ముడు' సినిమా అంచనాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారుతోంది.ఈ చిత్రాన్ని స్టార్ నిర్మాత దిల్ రాజు భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. ఫ్యామిలీ ఎమోషన్స్, యాక్షన్, కమర్షియల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా ప్రేక్షకులని విభిన్నంగా ఆకట్టుకునేలా వస్తుందన్న బజ్ ఇండస్ట్రీలో గట్టిగా వినిపిస్తోంది. గతంలో 'వకీల్ సాబ్'తో మంచి టాక్ తెచ్చుకున్న వేణు శ్రీరామ్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తమ్ముడు చిత్రంలో నితిన్, సీనియర్ నటి లయ అక్క పాత్రల్లో కనిపించనున్నారు.ఇది పూర్తిగా ఫ్యామిలీ ఎమోషన్‌తో నడిచే కథ అని తెలుస్తోంది. ఇందులో కాంతార ఫేమ్ సప్తమి గౌడ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఓ కీలక యాక్షన్ ఎపిసోడ్ కోసం రెండు కోట్ల రూపాయల బడ్జెట్ వేశారన్న వార్తలు కూడా హాట్ టాపిక్ అయ్యాయి. ఇదిలా ఉంటే, ఇప్పుడంతా ఈ సినిమా విడుదలపై దృష్టి పెట్టింది. ఇన్‌సైడ్ టాక్ ప్రకారం, దర్శకుడు వేణు శ్రీరామ్ మేజర్ పార్ట్ షూటింగ్ కంప్లీట్ చేసి చివరి దశ పనులలో బిజీగా ఉన్నట్టు సమాచారం.ముందుగా వేసవి రిలీజ్ ప్లాన్ చేసిన ఈ సినిమా, తాజాగా మే 9వ తేదీ కోసం మేకర్స్ చూస్తున్నట్టు ఫిల్మ్ నగర్ టాక్. అదే రోజున విడుదల కావాల్సిన హరిహర వీరమల్లు వాయిదా పడే అవకాశం ఉండటంతో తమ్ముడుని ఆ డేట్‌కి మార్చే యోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. మరొకవైపు, బాక్సాఫీస్ వద్ద నితిన్ తిరిగి ఫామ్‌లోకి రావడానికి ఇదే బాగా వర్క్ అవుతుందన్న నమ్మకం ఉంది.గతంలో వచ్చిన ఫ్లాపుల వలన మార్కెట్‌లో డామేజ్ తలెత్తినప్పటికీ, తమ్ముడు కంటెంట్ బలంగా ఉంటే తిరిగి గేమ్‌లోకి రావచ్చు. ట్రైలర్‌కి రెస్పాన్స్ బాగుంటే, అంచనాలు మళ్లీ పెరిగే ఛాన్సుంది. దిల్ రాజు కూడా ఈ సినిమాపై పూర్తి నమ్మకంతో ఉన్నట్టు సమాచారం. మొత్తానికి నితిన్ కోసం 'తమ్ముడు' ఓ కీలక మలుపు కావొచ్చని సినీ వర్గాలు భావిస్తున్నాయి. ఒకవేళ మే 9న ఈ సినిమా వచ్చి హిట్ అయితే, అది మిగతా ప్రాజెక్టులపై కూడా ప్రభావం చూపించవచ్చు. దర్శకుడు వేణు శ్రీరామ్ కూడా హిట్ కోసం ఎదురుచూస్తుండటంతో, ఈ సినిమా నుంచి మంచి ఫలితం రాకపోతే అతనికి కూడా కష్టమే. మరి తమ్ముడు సెంటిమెంట్ ఎంతవరకు కలిసొస్తుందో చూడాలి.



**స్ఫుటమైన వైట్ లుక్‌లో శ్రీలీల**

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh. Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS D.No:38-4-217/A, Maharani street, Marripalem, Visakhapatnam -530018, Andhrapradesh.
Editor: G.APPARAO, Mobile : 9059465965, RNI : APTEL/2014/58046, e-mail:penpower9@gmail.com